RNI.No. APTEL/2014/57702 ESTD: 1999

www.voodayam.com

# వుదయం

గుంటూరు | 02-08-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 141 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on







# చెరువుల రక్షణే.. భావి తరాలకు భవిష్యత్తు

## సీఎం రేవంత్ రెడ్డి





### హైదరాబాద్ రూపురేఖలు మారుస్తున్న చెరువుల పునరుజ్జీవం

**హైదరాబాద్, ఆగస్టు 1 (వుదయం) :**

హైదరాబాద్: నగరం పరిధిలోని ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవనం పొంది పూర్వవైభవంతో జలకళ సంతరించుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. క్యూర్ (CURE) పరిధిలోని చెరువుల పునరుద్ధరణ ద్వారా హైదరాబాద్ నగర రూపురేఖలు మారుతుండటం ఎంతో సంతృప్తిని ఇస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. నల్ల చెరువును పునరుజ్జీవింపజేసేందుకు అహర్నిశలు శ్రమించిన 'హైడ్రా' (HYDRA) యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

భావి తరాల కోసం చెరువుల సంరక్షణ

చెరువుల పరిరక్షణపై మాట్లాడిన సీఎం.. "చెరువులను కాపాడుకోవడమంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదు, భావి తరాల భవిష్యత్‌ను భద్రపరచడమే" అని ఉద్ఘాటించారు. నగరంలోని ప్రతి చెరువునూ కాపాడుకుంటూ, ప్రజా ఆస్తులను సంరక్షించే క్రమంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందని, ఈ దిశగా అందరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

# అమెరికా నుంచి 4,840 మంది భారతీయుల వెనక్కి

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఎఎంస్)**



విదేశీయులను వారి స్వదేశాలకు తిరిగి పంపించే (డిపోర్టేషన్) ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు కీలక స్పష్టత ఇచ్చింది. సదరు వ్యక్తుల జాతీయత (పాస్‌పోర్ట్/పౌరసత్వం) ఖరారైన తర్వాత మాత్రమే వారిని డిపోర్ట్ చేస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అత్యున్నత న్యాయస్థానానికి వెల్లడించింది. ఒకవేళ ఏ వ్యక్తినైనా తమ పౌరుడిగా గుర్తించడానికి సంబంధిత దేశం నిరాకరిస్తే, వారిని బహిష్కరించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అస్సాంలో 'విదేశీయులు'గా ప్రకటించిన వ్యక్తులను డిపోర్ట్ చేయకుండా సుదీర్ఘకాలం నిర్బంధ కేంద్రాల్లో ఉంచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్రం ఈ వివరణ ఇచ్చింది.

**డిపోర్టేషన్‌కు నిబంధనలు ఇవే..**

విదేశీ పౌరుడిపై కోర్టు విచారణ లేదా విధించిన శిక్ష పూర్తయిన తర్వాత.. వారి వద్ద చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రాలు (పాస్‌పోర్ట్) ఉండి, ఎలాంటి క్రిమినల్ కేసులు పెండింగ్‌లో లేకపోతేనే బహిష్కరణ ప్రక్రియ చేపడతామని హోంశాఖ తెలిపింది. అంతేకాకుండా, సదరు వ్యక్తిని పంపించే ముందు సంబంధిత దేశ రాయబార కార్యాలయం (ఎంబసీ) నుంచి జాతీయత ధ్రువీకరణ పత్రాన్నితప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని స్పష్టం చేసింది గతేడాది నుంచి అమెరికా నుంచి 4,840 మంది భారతీయుల డిపోర్ట్ మరోవైపు, విదేశాల్లో ఉంటున్న భారతీయుల వివరాలపై విదేశాంగ శాఖ ఇటీవల కొన్ని కీలక గణాంకాలను వెల్లడించింది. గతేడాది నుంచి ఇప్పటివరకు అమెరికా నుంచి మొత్తం 4,840 మంది భారతీయులు స్వదేశానికి వెనక్కి పంపించబడ్డారని తెలిపింది. అలాగే రష్యా సైన్యంలో ఇప్పటికీ సుమారు 24 మంది భారతీయులు సేవలుందిస్తున్నట్లు గుర్తించామని, వారిని సురక్షితంగా రప్పించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటివరకు ప్రభుత్వం జరిపిన సంప్రదింపుల ఫలితంగా 139 మంది భారతీయులు సురక్షితంగా మాతృభూమికి చేరుకోగా, మిగతా 24 మందిని కూడా త్వరలోనే తీసుకువస్తామని వివరించింది.

# 20 శాతం పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం



**హైదరాబాద్, ఆగస్టు 1 (వుదయం) :**

రాష్ట్రంలో ధరణి పోర్టల్ వేదికగా జరిగిన అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా (చిట్‌చాట్) మాట్లాడారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూలావాదేవీపైనా లోతైన విచారణ జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. అమాయకులైన పేదల భూములను కాజేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, నిషేధిత భూముల జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్) లోకి కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా ప్రభుత్వం చేర్చలేదని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల మార్కెట్ విలువల సవరణ సానుకూల ఫలితాలనిస్తోందని, దీంతో రిజిస్ట్రేషన్ల

# దశలవారీగా నామినేటెడ్ పదవుల భర్తీ

**హైదరాబాద్, ఆగస్టు 1 (వుదయం) :**



రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నియామకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయాలకు అనుగుణంగానే ఈ పోస్టుల భర్తీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న ఆశావహులంతా తమ పేర్లతో కూడిన వివరాలను పీసీసీ (PCC) కి పంపుకోవాలని మంత్రి సూచించారు. త్వరలోనే వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామకాలను సైతం చేపడతామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. అదేవిధంగా, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీని ప్రభుత్వం దశలవారీగా పూర్తి చేస్తుందని తుమ్మల తెలిపారు. వీటితో పాటే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా త్వరలోనే భర్తీ చేసేందుకు

## ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడి

# 9 మంది మృతి, 22 మందికి గాయాలు

**కీవ్:**

రష్యా దళాలు ఉక్రెయిన్‌పై మరోసారి భయానక దాడులతో విరుచుకుపడ్డాయి. ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా శనివారం ఉదయం బాలిస్టిక్ క్షిపణులు, లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో కనీసం 9 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది తీవ్రంగా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది.

నివాస ప్రాంతాల్లో విధ్వంసం..

భయానక దృశ్యాలు రష్యా ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు కీవ్‌లోని పలు నివాస ప్రాంతాలపై పడటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. సోలోమియాన్స్కి జిల్లాలోని ఒక ఐదంతస్తుల రెసిడెన్షియల్ భవనం దాడికి గురై పాక్షికంగా ధ్వంసమైంది. రెస్క్యూ టీమ్‌లు వెంటనే రంగంలోకి దిగి ఆ భవనంలో చిక్కుకున్న 35 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. అటు డర్నిస్కీ జిల్లాలో జరిగిన క్షిపణి దాడి అత్యంత తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అక్కడ ఇళ్లు కూలిపోయి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

**మిలిటరీ కేంద్రాలే లక్ష్యం:**

రష్యా ప్రకటన ఈ భయానక దాడులపై రష్యా రక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు హైప్రిసిషన్ గ్రౌండ్, సీలాంచ్డ్ ఆయుధాలు, సుదూర శ్రేణి డ్రోన్లతో డజన్ల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించినట్లు తెలిపింది. కీవ్ సమీపంలో ఉన్న మిలిటరీ పారిశ్రామిక కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లే లక్ష్యంగా ఈ విరుచుకుపాటు సాగిందని పేర్కొంది. ముఖ్యంగా క్షిపణులు, డ్రోన్లు, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు తయారు చేసే ప్రొడక్షన్, స్టోరేజ్ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు రష్యా ఆర్మీ వెల్లడించింది.

# కేరళలో వానల బీభత్సం

## 3 మంది మృతి

### శిథిలాల కింద పలువురు

**తిరువనంతపురం:**



కేరళ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడటంతో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఇడుక్కి, కొట్టాయం, వాగమాన్ జిల్లాల్లో శనివారం చోటుచేసుకున్న విపత్తుల్లో కొండచరియలు పడి ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, పలువురు శిథిలాల కింద చిక్కుకుపోయారు.

**కొండచరియలు విరిగిపడి తీవ్ర నష్టం**

ఇడుక్కి జిల్లాలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో అందులో ఉన్న మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పూంజార్ ప్రాంతంలో మరో ఇల్లు పూర్తిగా ధ్వంసమై ఇద్దరు వ్యక్తులు అందులోనే చిక్కుకుపోగా, వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాగమాన్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో ప్రభాకరన్ నాయర్ అనే వ్యక్తి మృతి చెందగా, అతడి మృతదేహం కోసం గాలిస్తున్నారు. అదూర్‌మాలా వద్ద కొండచరియలు పడి మరో వ్యక్తి శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు.



స్తంభించిన వాహన రాకపోకలు

ఈ ప్రాణాంతక వర్షాల వల్ల రాష్ట్రంలో రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. కోచి ధనుష్‌కోడి నేషనల్ హైవే పరిధిలోని మాచిప్లావు వద్ద కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి.



# నిజం గడప దాటేలోపే.. అబద్ధం ఊరంతా చుట్టివస్తోంది!

**హైదరాబాద్, ఆగస్టు 1 (వుదయం)**


సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, ఫేక్ న్యూస్‌లకు కేవలం అధికార పక్షమే కాదు, తాము కూడా బాధితులమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజం గడప దాటేలోపే, అబద్ధం అంగీ వేసుకుని ఊరంతా చుట్టివచ్చే పరిస్థితి ఉందన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రాజ్యాంగం-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సోషల్ మీడియా ఫేక్ న్యూస్ గురించి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రస్తావించిన కేటీఆర్.. వార్తల్లో నిజానిజాలను కచ్చితంగా 'ఫ్యాక్ట్ చెక్' ద్వారా నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు.

**ప్రగతి భవన్‌లో 150 బెడ్‌రూమ్‌లు ఉన్నాయా?**

గతంలో తమ ప్రభుత్వంపై జరిగిన దుష్ప్రచారాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రగతి భవన్‌లో కేసీఆర్ క్యాంప్ ఆఫీస్ పెడితే.. అందులో ఏకంగా 150 బెడ్‌రూమ్‌లు, బంగారు కప్‌బోర్డులు ఉన్నాయంటూ పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారని మండిపడ్డారు. "ఇప్పుడు ఆ భవనంలో ఎవరు ఉంటున్నారు? నిజంగా అక్కడ 150 బెడ్ రూమ్‌లు ఉన్నాయా? ఆ ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసింది ఎవరు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అలాగే రూ.84 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏకంగా లక్ష కోట్ల కుంభకోణంగా దుష్ప్రచారం చేశారని, ఇవన్నీ ఫేక్ న్యూస్ కాదా? అని ఆయన నిలదీశారు. ఇలాంటి వాటిని కచ్చితంగా ప్రశ్నించాలన్నారు.

**నటీనటుల ఫోన్ల ట్యాపింగ్ అంతా కట్టుకథే..**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనూ తమపై మీడియాను అడ్డం పెట్టుకుని అసత్యాలు ప్రచారం చేశారని కేటీఆర్ విమర్శించారు. కొందరు సినిమా యాక్టర్ల ఫోన్లు ట్యాప్ చేశారని వార్తలు రాయించారని ఆరోపించారు. "ఫోన్ ట్యాపింగ్ విచారణకు పిలిచినప్పుడు నేను వెళ్లాను. ఏ యాక్టర్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయో ఆ నంబర్లు ఇవ్వాలని విచారణ అధికారి (ఏసీపీ)ని అడిగాను. ఎవరివీ కాలేదు సార్ అని ఆయన చెప్పారు. మరి అదే మాట మీడియాకు చెప్పొచ్చు కదా అని అడిగితే.. ఒక పత్రికకు మాత్రం చెప్పానని ఆ అధికారి బదులిచ్చారు" అని కేటీఆర్ వివరించారు. జరగనివి జరిగినట్టుగా, ఉన్నవి లేనట్టుగా ఫేక్ న్యూస్ సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు.



# ఒత్తిడికి లొంగొద్దు



- కుంగుబాటును తొక్కిపెట్టు!
- భయపడితే జీవితం శూన్యం... తెగించి పోరాడితేనే విజయం
- చదువుల పేరుతో నరకం వద్దు... 'మానసిక స్థైర్యమే' అసలైన విద్యార్థి శక్తి

అలంపూర్ ఆగస్టు 01 (వుదయం బ్యూరో)

పోటీ ప్రపంచంలో ఒత్తిడికి తలవంచి ప్రాణాలు తీసుకోవడమో, ఆత్మన్యూనతతో జీవితాలను నాశనం చేసుకోవడమో పరిష్కారం కాదని... ధైర్యంగా నిలబడి ఎదురొడ్డి పోరాడినప్పుడే విజయం దాసోహమంటుందని జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా నోడల్ అధికారి ఎం. హృదయరాజు పిలుపునిచ్చారు. శనివారం అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, విద్యార్థులు మరియు అధ్యాపకుల వైఖరిపై తీవ్ర స్థాయిలో దిశానిర్దేశం చేశారు.సందర్శన సందర్భంగా నిర్వహించిన అసెంబ్లీలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన అత్యంత ఘాటుగా ప్రసంగించారు. "కౌమార దశలో చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయి, మనసులోనే దాచుకుని నరకం అనుభవించకండి. తల్లిదండ్రులనో, ఉపాధ్యాయులనో నమ్మి నోరు విప్పండి... గుండెధైర్యం, ఆత్మవిశ్వాసమే మిమ్మల్ని నిలబెట్టే అసలైన చదువు" అని గట్టిగా హెచ్చరించారు.అందరి ముందు అవమానిస్తే సహించేది లేదు! అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఉపాధ్యాయుల తీరుపై కఠినంగా స్పందించారు: అది వారిలో తీవ్ర ఆత్మన్యూనతను నింపి జీవితాలను దెబ్బతీస్తుంది. కౌన్సిలింగ్ ఇవ్వాల్సిందే: బలహీనంగా ఉన్న విద్యార్థులను ప్రత్యేకంగా పిలిపించి, ప్రేమతో మాట్లాడి, వారి సమస్యను గుర్తించి మార్గదర్శనం చేయాలి. బాధ్యతారాహిత్యం చెల్లదు: తల్లిదండ్రులుఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయకపోతే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంది. మార్కులు రావట్లేదని ఒత్తిడి పెంచడం కాకుండా, వారిలో ధైర్యాన్ని నింపే బాధ్యత అధ్యాపకులదే. పెరిగిన చేరికలు సరే... ఫలితాల్లో తేడా వస్తే ఊరుకోం! అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరగడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, ఉపాధ్యాయులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. కేవలం అడ్మిషన్లు పెంచితే సరిపోదని, నాణ్యమైన బోధన అందించి ఈ విద్యాసంవత్సరంలో 100% ఉత్తీర్ణత (వంద శాతం ఫలితాలు) సాధించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది మరియు విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వరకు తల్లిపాల వారోత్సవాలు

- అంగన్వాడి సూపర్వైజర్ సంతోష

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 1

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు శివ్వంపేట అంగన్వాడి కేంద్రంలో సెక్టారు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం అంగన్వాడి సూపర్వైజర్ సంతోష మాట్లాడుతూ. ప్రతి గ్రామంలో ఆగస్టు ఒకటవ తారీకు నుండి ఏడవ తారీఖు వరకు తల్లిపాల వారోత్సవాలను ప్రతి గ్రామములో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆమె సూచించడం జరిగింది. అన్ని గ్రామాల్లో తల్లిపాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట మండల సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ఐసిటి ల్యాబ్ కోసమై పరికరాల సరఫరా



నారాయణపేట ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి)

ఐసిటి ల్యాబ్ కోసమై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ కు కంప్యూటర్ పరికరాలను సరఫరా అయినట్లు పాఠశాల హెచ్ఎం భారతి తెలిపారు.
సమగ్ర శిక్ష తెలంగాణ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఐసిటీ ల్యాబ్ ఏర్పాటులో భాగంగా ఎం ఐ ఆర్ సి ఎలక్ట్రానిక్ లిమిటెడ్ కంప్యూటర్ పరికరాలు సరఫరా అయినట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా 5 డెస్క్ టాప్ కంప్యూటర్లు,2 యుపిఎస్ సిస్టం,1 హెచ్పీ లేజర్ జెడ్ ప్రింటర్,5 కంప్యూటర్ టేబుల్స్,5 కంప్యూటర్ చేర్స్ పాఠశాలకు సరఫరా అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్, లక్ష్మణ్ ,నిర్మల ,సాయి కృష్ణ, సంగీత తదితరులు ఉన్నారు.

## నానో యూరియా వినియోగంతోనే నేల సారవంతం



- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఆరుతడి పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్
- ఎరువుల దుకాణంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగులో మార్పులు అవసరం: కలెక్టర్

గద్వాల ఆగస్టు 01 (వుదయం కరస్పాండెంట్)

రసాయన యూరియాను అధికంగా వినియోగించడం వల్ల వ్యవసాయ భూములు క్రమంగా సారవంతతను కోల్పోతున్నాయని, రైతులు నానో యూరియాను ఎక్కువగా వినియోగించేలా అవగాహన కల్పించి అమ్మకాలు పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల నిల్వలు, విక్రయాలు, ధరలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి దుకాణ యజమానితో వివరాలు తెలుసుకున్నారు.యూరియాను ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా సరఫరా చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉంచాలని సూచించారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వరి సాగుకు బదులుగా కందులు, కూరగాయలు వంటి ఆరుతడి పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెస్టిసైడ్స్, విత్తనాలు, ఎరువుల దుకాణాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏడీఏ సుబ్బారెడ్డి, ఏవో సురేష్ గౌడ్, ఏఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా మందు అమ్మకాలు

- అక్రమ బెల్టు దందా
- మద్యం ప్రియుల గృహాలలో రాత్రి వేళ గొడవలు,
- కుటుంబాల భారం మహిళలపై పడుతుంది,
- కొన్ని చోట్ల పాఠశాలలు ఉన్న చోటా కూడా మందు విక్రయాలు.
- నిమ్మకు నిరేత్తనటు అధికారులు.
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ శాఖ

నారాయణఖేడ్ ఆగస్ట్ 1(వుదయం)

నారాయణఖేడ్ మండల లో బెల్టు షాపులు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. వాడవాడకూ ఏర్పాటు అవుతోండడంతో మందు బాబుల చేబులకు చిల్లులు పడుతున్నాయి. గ్రామాలు, తండాల్లో జోరుగా బెల్టుషాపులు, అ మ్మకాలు సాగుతోండ డంతో మందు ప్రియులు మత్తులో జోగుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే పెద్దఎత్తున మద్యం అమ్ముతూ ముడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న దందా అని ఆరోపణలు వస్తున్నా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**గ్రామాల్లో మద్యం ఫుల్..**

నారాయణఖేడ్ మండలంలో మద్యం, ఏరులై పారుతున్నా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తూ, చేతులు దులుపు కుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామా ల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం అ మ్మకాలు జోరుగా కొనసాగుతున్నా చోద్యం చూస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 5 గంటల నుంచే మద్యం అమ్మకాలు జరుగుతుండడంతో మద్యం ప్రియులు ఆ సమయంలోనే తాగి రోడ్లపై దొర్లుతున్నారని.. అయినా, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాటి ని పట్టించుకోవడం



**గృహాలలో రాత్రి వేళల్లో ఘర్షణలు..**

ప్రధానంగా రాత్రి వేళల్లో పీకలదాకా తాగి వారి గృహాలలో, నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయని, దీంతో ఆ సమయంలో ఇళ్లనుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తుందని జనం వాపోతున్నారు. కొంద రు పీకల దాకా తాగి రోడ్డుపై పడిపోతుండడంతో వారిని భుజానికెత్తుకొని ఇళ్లకు చేరుస్తున్న ఘటనలు రోజూ చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు.భారీగా ఆదాయం వస్తుండడంతో గ్రామాల్లో పెద్దఎత్తున బెల్టు దుకాణాల సంఖ్య పెరిగి పోటీలు పడి అమ్మకాలు సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాలలో విచ్చల విడిగా అమ్మకాలు. బట్టలపై 20 నుండి 50రూపాయలవరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు, ఆరోపణలు ఉన్నాయి. వైన్స్ దుకాణాలనుండి కాటన్లకటన్ చెచి గ్రామాల్లో ,ఎక్కడపడితే అక్కడ చిన్న కొట్టులో ప్రతి గ్రామంలో 4నుండి 6దుకాణాలు ఉదయం లేవగానే ఎప్పుడూ పడితే అప్పుడు ఎప్పుడూ ఓపెన్ ఉంటాయి ఇది ఇలా ఉంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు గ్రామాలకు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాలలో మద్యం బెల్టు దుకాణాల పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బడిలో ఉపాధ్యాయుడి నియామకం

- సర్పంచ్ జీతం అంకితం

గద్వాల, ఆగస్టు 01 (వుదయం బ్యూరో):

గోర్లఖాన్ దొడ్డి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు గ్రామ సర్పంచ్ యు. శ్వేత (యు. సేకమ్మ) ఒక వాలంటీర్ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశారు. సర్పంచ్ గా తనకు వచ్చే నెలవారీ గౌరవ వేతనాన్ని ఆ వాలంటీర్ ఉపాధ్యాయుడికి జీతంగా అందజేస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థుల చదువు దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా శాశ్వత ఉపాధ్యాయుల నియామకం జరిగే వరకు ఈ ఏర్పాటు కొనసాగుతుందని, సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా మని స్పష్టం చేశారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు, పాఠశాల



ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు రాధా మహేష్‌నాయుడు, సుగుణ శ్రీనివాస్ గౌడ్, భాను ప్రకాష్, రమ్యశ్రీ, నరసింహులు, పాఠశాల ఉపాధ్యాయులు యోగేష్, రాజు, తిమ్మప్ప, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దేవతల చేతుల్లో "త్రిశూలం" ఎందుకు?


- ఇది దేనికి సంకేతం?*....
- వివిధ దేవతామూర్తుల చేతుల్లో ఆయుధంగా 'త్రిశూలం' -....
- అలా ఉండడం వెనుక ఉన్న రహస్యం ఇదే!....
- ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చైర్మన్ ....

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 1

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో. ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్ దేవత మూర్తులు చేతుల్లో ఉన్న ఆయుధంగా ఉన్న త్రిశూలం గురించి ఆయన వివరిస్తూ.దేవతామూర్తులను మనం చూసినట్లయితే వారి చేతుల్లో వివిధ ఆయుధాలు కనిపిస్తుంటాయి. అందులో పరమశివుడు, దుర్గామాత, కాళికాదేవి చేతుల్లో త్రిశూలం ఆయుధంగా గోచరం అవుతుంది. ఇది దేనికి సంకేతం? కుమారస్వామిని త్రిశూలానికి ప్రతీకగా ఎందుకు భావిస్తారు? సృష్టి, స్థితి, లయాలకు, ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులకు, భూత, భవిష్యత్, వర్తమానాలకు ఈ "త్రిశూలం" ప్రతీక. ఇంతకంటే మించి ఇంకొక ప్రతీకాత్మక వివేచన కూడా ఉంది. అదేంటంటే, మనసు, బుద్ధి, చిత్తం, అంతఃకరణము అనే మూడింటిని మధ్యగా కాయిక, వాచికములు ఇరువైపులుగా త్రిశూలంగా ఆలోచన చేసే విధానం. కాయికం అంటే శరీరం, వాచికము అంటే మనసు మాట. మధ్యలో ఉండే "బుద్ధి" ఇందులో మనసు, బుద్ధి, చిత్తం, అంతఃకరణమ ఉన్న కారణం చేత కాస్త ఎగువగా కనిపించే ప్రయత్నం విశేషంగా మధ్యలో. ఈ మూడింటిని కలిపి 'త్రిశూలం' అంటున్నాం.

**శూల దండన అంటే ఏమిటంటే?**

శూలం మీద కూర్చుని తపస్సు చేయడం. శూలాన్ని దేహంలో ఒక బాధాకరంగా దిగవేసుకుని శివనామ స్మరణ చేయడం.





తీవ్రమైన ఈ శివ సంబంధిత లీలలు, విన్యాసాలన్ని కూడా మనం వీరపాశుపతం లేక పాశుపత విధానంలో చూస్తూ ఉంటాం. శూలం అన్నప్పుడు మనలో సత్వ గుణాన్ని పెంచేదిగా కూడా మనం భావన చేయాలంటున్నారు ఆధ్యాత్మిక వేత్త సూర్యనారాయణమూర్తి. ఇదంతా ఒక వర్గం కాగా, శూలానికి సంబంధించి ఇంకొక జ్ఞానం ఉంది.పంచాయతన ఆలయంలో ఆరోవ దైవం కుమార స్వామి. ఈయనకు ప్రతీక త్రిశూలం. ఈశ్వరుడు మధ్యలో, వినాయకుడు నైరుతి, పార్వతీదేవి వాయవ్యం, విష్ణువు ఈశాన్యం, సూర్యుడు ఆగ్నేయం కాగా ఆరోవ శక్తిగా ఆలయంలో ఉండే శక్తిస్వరూపము కుమారస్వామి త్రిశూలానికి ప్రతీక. శక్తి కుమారస్వామికి తనకు ప్రాతినిధ్యం వహించే విధంగా శూలాన్ని అందించింది. దానితో ఆ కుమారస్వామి శక్తిధరుడు, శూలధరుడు అయ్యాడు. శివ కుటుంబమే కాకుండా ఏ దైవానికి కూడా మనం చూసినప్పుడు ఈ శూలాన్ని త్రిశూలాన్ని ఎలా చూస్తామో శక్తికి ప్రతీక త్రిశూలం. "పని వివరించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ ఈ మహోత్తమైనా మందిరం ఈ ప్రాంతంలో నిర్మించడం మహా గొప్ప విషయమని ఇది నిర్మించిన శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ త్రిశూలం గురించి వివరించడం కూడా మహా అద్భుతంగా వివరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. వివిధ ప్రాంతాల నుంచి చేసిన భక్తులు.

# మార్పులు కనిపిస్తే వెంటనే స్పందించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి
- నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం–2024పై అవగాహన సదస్సు

గద్వాల ఆగస్టు 01 (వుదయం కరస్పాండెంట్)

పిల్లల హక్కుల పరిరక్షణ, భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు గమనిస్తే వెంటనే స్పందించి, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం-2024"పై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. పిల్లల గోప్యత, గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత శాఖల సమన్వయంతో వారి సంక్షేమం కోసం ఈ పథకం పనిచేస్తుందని వివరించారు. పోక్సో చట్టం-2012లోని నిబంధనలను వివరిస్తూ, 18 సంవత్సరాల లోపు ఉన్న వారందరూ పిల్లలుగా పరిగణించబడతారని, వారిని లైంగిక నేరాల నుంచి రక్షించడం, బాధితులకు న్యాయ పరిరక్షణ కల్పించడం, నేరస్థులకు కఠిన శిక్షలు విధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన, వివక్షలేని వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
అనంతరం నాల్సా పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం-2024, పోక్సో చట్టం, బాలల హక్కులు, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక నిర్మూలనపై రూపొందించిన అవగాహన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వి. శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ. నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీఓ ఆకాశ దీప్తి, ఉపాధ్యాయులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# శాఖల మధ్య సమన్వయ లోపం... అధికారుల నిర్లక్ష్యం

- విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్
- రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నా పట్టించుకోని సంబంధిత శాఖలు దౌల్తాబాద్‌లో ప్రమాద ఘంటికలు

దౌల్తాబాద్01 ఆగస్టు (వుదయం):

చేగుంట దౌల్తాబాద్ ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ, శాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. దౌల్తాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో, రహదారిని ఆనుకొని ఉన్న 100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ముందుగా సురక్షిత ప్రాంతానికి తరలించి, అనంతరం రహదారి పనులు చేపట్టాలి. అయితే విద్యుత్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను యథాతథంగా ఉంచి పనులు కొనసాగిస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాద భయంతో ప్రయాణిస్తున్నారు.

**విద్యార్థుల ప్రాణాలపై ముప్పు**

ఈ రహదారి వెంటనే దౌల్తాబాద్ మోడల్ పాఠశాల ఉండటంతో వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజు కాలినడకన పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. అదే ప్రాంతంలో ఎస్సీ బాలుర వసతి గృహం కూడా ఉండటంతో హాస్టల్ విద్యార్థులు సైతం ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారు. 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ రహదారికి అత్యంత సమీపంలో ఉండడం, రోడ్డు విస్తరణ పనుల వల్ల



వాహనాల రద్దీ పెరగడం విద్యార్థులకు పెద్ద ప్రమాదంగా మారిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శాఖల మధ్య సమన్వయం ఎక్కడ?**

రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ శాఖ నిర్వహిస్తుండగా, 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించే బాధ్యత విద్యుత్ శాఖపై ఉంది. అయితే రెండు శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల పనులు సక్రమంగా సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల భద్రత కంటే అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికే ప్రాధాన్యం ఇస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.

**అప్రమత్తం కాకపోతే అనర్థమే**

ఈ ప్రాంతంలో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే సురక్షిత ప్రాంతానికి తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టడం ప్రభుత్వ శాఖల బాధ్యత అని వారు పేర్కొంటున్నారు.

## మాచిన్‌పల్లి లో ఈతవనం ప్రారంభం

దౌల్తాబాద్ ఆగస్టు 01(వుదయం)

దౌల్తాబాద్ మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామంలో సాయి గౌడ్ ఆధ్వర్యంలో ఈతవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, గ్రామ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయి గౌడ్, గ్రామ పెద్ద ఇంకె రామచంద్రం, నాగరాజు, ప్రశాంత్, ఎబోయిన మల్లేష్, తుమ్మల కోటి తదితరులు పాల్గొన్నారు.



# పేదరికంపై విద్యతోనే దెబ్బ!



- కార్పొరేట్‌కు సమాధానం... సర్కారు బడికి సరికొత్త రూపం!
- మల్దకల్ పీఎం జడ్పీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు ప్రారంభం
- లక్ష్యాలను నిర్దేశించుకోండి... ఉన్నత శిఖరాలను అధిరోహించండి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

మల్దకల్, ఆగస్టు 01 (వుదయం బ్యూరో)

పేద విద్యార్థి భవిష్యత్తుకు పేదరికం ఏమాత్రం ఆటంకం కాకూడదని, ప్రతి పేద బిడ్డకూ నాణ్యమైన, ఉచిత విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉద్ఘాటించారు. కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి చెక్ పెడుతూ, సర్కారీ పాఠశాల లను సర్వాంగ సుందరంగా, ప్రగతి నిలయాలుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్వేగభరి తంగా మాట్లాడుతూ— "విద్యే సమాజ వికాసానికి ఆయుధం. నాణ్యమైన విద్య దక్కితే పేదవాడి తలరాత మారుతుంది. అందుకే ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది" అని పేర్కొన్నారు. ప్రైవేటుకు సవాల్ విసిరేలా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులు, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచామని విస్పష్టంగా తెలిపారు. విద్యార్థులు ఈ వసతులను ఆయుధాలుగా మలచుకుని ఉన్నత ఆశయ సాధనకు పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ— సర్కారు బడుల్లో విద్య నాణ్యత రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోందని, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేలా పాఠశాలల్లో పూర్తిస్థాయి విద్యా వాతావరణాన్ని, మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. సభలో హాజరైన ప్రముఖులు: ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, ఎంఈవో జి. సురేష్, దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్ కే. విష్ణు, ఎస్సై కొంద శ్రీహరి, నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, విక్రమ్ సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాకోబు, ప్రతాప్, పెద్దపల్లి అజయ్, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మరికల్ లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు విద్యార్థుల ర్యాలీ

మరికల్ ఆగస్టు 1( వుదయం ప్రతినిధి)

మరికల్ మండల కేంద్రంలోని శనివారం మండల కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు జరిగాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుండి విద్యార్థినీలు విద్యార్థులు అధిక సంఖ్యలో ర్యాలీగా పాల్గొనివీరి వీధి గూడ ర్యాలీ నిర్వహించి తల్లిపాల గురించి ప్రజలకు వివరించారు బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యమని మరియు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు ఆరోగ్యమును కాపాడవచ్చునని డాక్టర్లు తెలిపారు అందుకు ప్రతి ఒక్క తల్లి పిల్లలకు పాలు ఇవ్వాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య మోహన్ రెడ్డి గ్రామ సర్పంచ్ జి చెన్నయ్య బెలుగుంది వీరన్న హరీష్ కుమార్ వెంటనే రఘు మురళి టైసన్ రామకృష్ణ నాగరాజ్ అల్లా బకాష్ మురళి తో పాటు ఆయాలు నర్సులు విద్యార్థులుకాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## మాజీ జెడ్పిటిసి సేవలు అభినందనీయం

- చెంది సర్పంచ్ ప్రవీణ్ గౌడ్

వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 1....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చెంది గ్రామానికి చెందిన మోష గారి ఆంజనేయులు మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు. మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా తన సొంత కష్టాజితంలో కొంత5000రూపాయలు బాధిత కుటుంబ సభ్యులకు.చండి B.R.S నాయకులు అంకిరెడ్డి అంజిరెడ్డి సర్పంచ్ గైని బైటి ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. అనంతరం సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ ప్రముఖ సంఘ సేవకులు మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా చేస్తున్న సేవలు అభినందనీయమని. వారి సేవలకు మేము ఎప్పుడు రుణపడి ఉంటామని మా తరపున కుటుంబ సభ్యుల తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు. మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు. మాజీ ఉపసర్పంచి ఎల్లం. సంధిల్ల శ్రీనివాస్ గౌడ్. నర్సింగ్. ఆంజనేయులు. B.R.S. గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యంరెడ్డి. నాయకులు మోహన్ రెడ్డి. ఏనుగుల బాల్ రెడ్డి. గంటన్న గారి నవీన్. నల్లవల్లి కృష్ణ. నల్లవల్లి ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.


## ధాబా కార్మికుడి అనుమానాస్పద మృతి

- మృతుని బంధువులు పోలీస్ స్టేషన్‌పై దాడి
- దాబా యజమానికి సహకరిస్తులని ఆరోపణ


వట్టిపల్లి ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి)



సంగారెడ్డి జిల్లా, వట్‌పల్లి: పరిధిలోని ఓ ధాబాలో పనిచేస్తున్న దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన బీరప్ప (22) ధాబా వెనుక చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకునేలోపే మృతదేహాన్ని చెట్టు నుంచి ఎందుకు దించారని పోలీసులను, ధాబా యాజమాన్యాన్ని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు.ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో కొందరు గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి స్టేషన్‌లోని ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు అదనపు బలగాలతో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతి ఘటనతో పాటు పోలీస్ స్టేషన్‌పై దాడి, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి సంబంధించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# గ్రేటర్ హైదరాబాద్



## నవ్య జంక్షన్‌లో ట్రాఫిక్ మెరుగుదలకు కొత్త ఏర్పాట్లు



**రామచంద్రాపురం,**

వాహనదారుల సౌకర్యం, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ లక్ష్యంగా ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీసులు నవ్య జంక్షన్ పరిసరాల్లో పలు కొత్త ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టారు.గ్రీన్ మెడోస్ కాలనీ వైపు వెళ్లే వాహనాల కోసం ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మరింత సులభతరం చేశారు. అలాగే బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేట్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు అంతరాయం లేకుండా సాగేందుకు ట్రాఫిక్ కోన్స్‌ను ఏర్పాటు చేశారు.ఇక బీరంగూడ నుండి లింగంపల్లి వైపు వచ్చి అశోక్‌నగర్-పటాన్‌చెరు రోడ్ వైపు వెళ్లే వాహనాల కోసం ట్రయల్ ప్రాతిపదికన ట్రాఫిక్ కోన్స్, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి యూ టర్న్ సౌకర్యాన్ని కల్పించారు.ఈ కొత్త ట్రాఫిక్ ఏర్పాట్లతో వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగడంతో పాటు జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## టిఆర్‌టి క్వార్టర్స్‌లో నీటి కష్టాలు

**వెంటనే సమస్య పరిష్కరించాలి.. లేదంటే వాటర్ వర్క్స్ కార్యాలయం ముట్టడి: బీజేపీ నాయకుడు ఎ. వినయ్ కుమార్ హెచ్చరిక**

**ముషీరాబాద్, ఆగస్టు 01(వుదయం)**



గాంధీనగర్ డివిజన్ పరిధిలోని గణేష్ టెంపుల్ లేన్, టి ఆర్ టి క్వార్టర్స్ ప్రాంతంలో గత ఐదు నెలలుగా కొనసాగుతున్న కలుషిత మంచినీటి సరఫరా, లోప్రెషర్ నీటి సమస్య కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ. వినయ్ కుమార్ అన్నారు.ఈ సమస్యపై స్థానికులు గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ. పావని వినయ్ కుమార్కు ఫిర్యాదు చేయడంతో, ఆమె సూచనల మేరకు శనివారం ఎ. వినయ్ కుమార్ వాటర్ వర్క్స్ మేనేజర్ శివకుమార్, శాఖ సిబ్బంది, బీజేపీ నాయకులతో కలిసి టి ఆర్ టి క్వార్టర్స్‌ను సందర్శించి పరిస్థితిని సరఫరా కావడం వల్ల కుటుంబాల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని, చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి ఫిర్యాదులు చేసినా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.సమస్య తీవ్రతను వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎ. వినయ్ కుమార్ మాట్లాడుతూ, కలుషిత నీటి సరఫరా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్‌లైన్లను తక్షణమే ల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, వెంటనే చర్యలు తీసుకోకపోతే స్థానిక ప్రజలతో కలిసి వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోనాల పండుగ వైభవానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, ఆగస్టు01 (వుదయం)**



ముషీరాబాద్ నియోజకవర్గంలోని దేవుని తోట దేవాలయంలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంజూరైన నిధుల చెక్కులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 202 చెక్కులను, రూ.1,08,75,880 (ఒక కోటి 8 లక్షల 75 వేల 880 రూపాయలు) విలువైన నిధులను ఆలయ కమిటీలు, ఉత్సవ నిర్వాహకులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. ప్రతి ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, కొండ శ్రీధర్ రెడ్డి, ఎం. రాకేష్ కుమార్, శ్యామ్ యాదవ్, శంకర్ ముదిరాజ్తో పాటు పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ వేగవంతం

**రంగారెడ్డి జిల్లా**

భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమానికి ఆగస్టు 10వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు. సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు. ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో, ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు, పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన, చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు, స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు, నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని, బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో



అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శేరిలింగంపల్లి, ఎల్.బీ.నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు. కొన్ని గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, అనామలీస్, డూప్లికేట్, నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి, అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీఎస్ఆర్టీసీ మాజీ ఉద్యోగి ఔదార్యం

**బస్టాండ్‌కు గోడ గడియారం బహుకరణ**

**నాగర్ కర్నూల్, ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) :**



సామాజిక బాధ్యతకు నిదర్శనంగా టీఎస్ఆర్టీసీ మాజీ ఉద్యోగి పాలాది సాయిబాబా తన జన్మదిన సందర్భంగా నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు గోడ గడియారాన్ని బహుకరించారు. రాత్రి, పగలు సమయం స్పష్టంగా కనిపించేలా ఉండే ఈ గడియారాన్ని ప్రయాణికులు సమయం తెలుసుకునేందుకు ఉపయోగపడేలా ఏర్పాటు చేశారు. బస్టాండ్ డిపో అధికారికి శనివారం గడియారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రయాణికులకు చిన్న సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ గడియారాన్ని బహుకరించినట్లు తెలిపారు.ాజీ ఉద్యోగి చూపిన ఔదార్యాన్ని సహ ఉద్యోగులు, ప్రయాణికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సహ ఉద్యోగులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## 125 మంది చిన్నారులకు పునర్జన్మ...

**- వికారాబాద్ జిల్లాలో విజయవంతంగా ముగిసిన ప్రత్యేక డ్రైవ్:**
**- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్**



:వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్-XII' కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, భిక్షాటన నివారణ, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ, సంబంధిత శాఖలతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. రక్షించబడిన చిన్నారుల వివరాలు గత నెల రోజులుగా (జూలై 1 నుండి జూలై 31 వరకు) జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 125 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ తెలిపారు. బాలురు & బాలికలు : రక్షించబడిన వారిలో 116 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు.

బాల కార్మికులు: రక్షించిన వారిలో అత్యధికంగా 97 మంది బాల కార్మికులు కాగా, 26 మంది చదువు మానేసిన (డ్రాప్‌ఔట్) పిల్లలు ఉన్నట్లు వెల్లడించారు.భిక్షాటన చేస్తూ కనిపించిన ఒక చిన్నారిని రక్షించడమే కాకుండా, ఒక బాల్య వివాహాన్ని ప్రాథమిక దశలోనే అడ్డుకుని బాలికను సురక్షితంగా కాపాడినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 41 మంది చిన్నారులు కూడా ఉన్నారు 54 కేసులు నమోదు - *పునరావాస చర్యలు ఆపరేషన్ ముస్కాన్-XIIలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటివరకు 54 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఎస్పీ చెప్పారు. రక్షించిన చిన్నారుల్లో 89 మందిని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించగా, సరైన ఆశ్రయం లేని 36 మంది చిన్నారులను బాలల సంరక్షణ గృహాలకుతరలించినట్లు వివరించారు.చిన్నారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత: బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా,చదువుకు దూరం చేసే చర్యలపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచుతారని ఎస్పీ హెచ్చరించారు. చిన్నారుల హక్కులను కాపాడటం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజలకు విజ్ఞప్తి:ఎక్కడైనా బాల కార్మికులు లేదా ఆపదలో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు గానీ, డయల్-100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కి సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు.

## ఘనంగా నవీన్ గుప్త పుట్టినరోజు వేడుకలు.....




**- పండ్లు వంచినాచిన్నగొట్టిముక్క అభిమానులు....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 1....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ పులిమామిడి నవీన్ గుప్తా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ డైనమిక్ లీడర్ మాజీ సర్పంచ్ పులిమామిడి నవీన్ గుప్తా పుట్టినరోజు వేడుకలు నేడు చిన్నగొట్టి ముక్కల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నవీన్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల లో చదువుకునే బాలబాలికలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ బుచ్చా నాయక్ పాఠశాల బాల బాలికల తరఫున మాజీ సర్పంచ్ పులిమామిడి నవీన్ గుప్తాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. పాఠశాల ఉపాధ్యాయులు. బాల బాలికలు పాల్గొన్నారు.

## శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారం

**మహబూబ్‌నగర్ జిల్లా 01ఆగస్టు(వుదయం బ్యూరో)**




ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు2026 సందర్భంగా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని అన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంతో పాటు అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అనంతరం వయస్సుకు తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలోని ప్రతి కుటుంబానికి విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ తల్లిపాలను ప్రోత్సహించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో తల్లిపాలు అత్యంత కీలకమైనవని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు.తల్లి పాలు శిశువుకు సరిపోను పట్టిన తర్వాత ఎక్కువగా ఉంటే వృథా చేయకుండా "సుషేనా ఫౌండేషన్, ధాత్రి మిల్క్ బ్యాంకు కు డొనేట్ చెయ్యాలని, ఇట్టి తల్లి పాలు తాగించే అవకాశము లేని శిశువులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులు, నినాదాలతో సాగిన ర్యాలీలో తల్లులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మహంకాళి బోనాలు

**వుదయం, దుబ్బాక (ఆగస్టు 1)**

దుబ్బాక పట్టణంలో ఆషాడ మాసం సందర్భంగా శ్రీ మహంకాళి బోనాల పండుగ వేడుకలు ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. కాపు సంఘం ఆధ్వర్యంలో భారీ బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు తలపై బోనాలు పెట్టుకుని భక్తి గీతాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బోనాల ఊరేగింపుతో ఆలయ ప్రాంగణం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఆషాడ మాసంలోనూ ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తున బోనాలను ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. బోనాల వేడుకలతో దుబ్బాక పట్టణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.

**IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**OS. NO. 299 OF 2026**

*Between:*
1. Vadrevu Ramadevi
2. Tejaswini Vadrevu
3. Vadrevu Pratyusha

**... Plaintiffs**

**AND**

1. Banjara Hills R.O
2. SRO, S.R Nagar
3. Ranga Reddy R.O
4. All Concerned

**... Defendants**

To,
All Concerned
The Plaintiffs have filed the present suit is filed for Declaration of the Plaintiff as the Legal Heirs of one Late Vijay Sanker Vadrevu and the same stands posted to 24-08-2026 for your appearance. Anyone having any objection are therefore hereby directed to appear before this Hon'ble Court on the above said date at 10.30 A.M. either in person or through counsel, failing which the matter will be decided in your absence as per law.

**[BY ORDER OF THE HONOURABLE COURT]**

*sd/-*
*Kailash Nath P SS*
**Advocate**
*H.No.6-3-595/52, 'Gayatri Nivas', 3rd Floor, Padmavati Nagar Colony, Erramanzil, Khairatabad, Hyderabad - 500004. Mobile: 9989887314*
*Email:kailash.palagummi@gmail.com / kailash@kandklegal.in*

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O.S. No. 1983 OF 2026**

**Between:**
**1. Sri Lanka Panhar Kashyap,** S/o Late Lanka Visweswar Rao, Aged about 50 Years, Occ:Private, R/o C-201, Shree Balaji Residency, Motera Road, Chandkheda, Ahmedabad, Gujarat – 380005.
**2. Sri Lanka Shiva Kartik,** S/o. Late Lanka Visweswar Rao, Aged about 45 Years, Occ: private, R/o Flat No.101, Aditya Gateway Apartments, Plot No.75/A, Veterinary Colony, Road No.79, Jubilee Hills, Shaikpet, Hyderabad- 500096. ...**Plaintiffs**

**AND**

**1. The Tahsildar,** Shaikpet Mandal, Hyderabad District.
**2. All Concerned.**

... **Defendants**

To,
**ALL CONCERNED**
Please take notice that the above Plaintiffs herein have filed the above Suit for declaration of Plaintiffs as legal heirs of **Late Sri Lanka Visweswar Rao** (died on 16.04.2026) and **Late Smt. Lanka Lalitha** (died on 20.02.2023). The above Said case is posted to **13.08.2026 at 10.30 am,** if anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**( BY ORDER OF THE COURT )**
**Mr. T. Raghavender Reddy, G. Dileep, Advocates,**
Plot No.458, Sriram Nagar Colony, Puppalguda, Manikonda, Hyderabad-500089.
**Cell: 99480 80330**




ప్రధాని నివాసం దాకా పాదయాత్ర

"పెట్రోల్ బంకుల్లో ఈ20 ఇంధనం, స్వచ్ఛమైన పెట్రోల్ లలో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశం వినియోగదారులకు కల్పించాలి. అలాగే ఈ20 మిశ్రమ పెట్రోల్ ధరలను తగ్గించాలి. మిశ్రమ ఇంధనానికి సంబంధించి ప్రధాని మోదీకి వినతి పత్రాలు సమర్పించేందుకు ఆగస్టు 4న ఆయన నివాసం వరకు పాదయాత్ర చేపడతా. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా పౌరులపై ఈ20 ఇంధనాన్ని ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోంది. ఈఇంధనం కారణంగా ఇథనాల్ దిగుమతులు భారీగా పెరుగుతున్నాయి. ఈ20 ఇంధనం వాహనాలకు నష్టం కలిగించదని వాదిస్తూ ప్రభుత్వం ఉదహరిస్తున్న ఆ అధ్యయన నివేదికలను బహిరంగపరచాలి."

**అరవింద్ కేజ్రీవాల్, ఆప్ జాతీయ కన్వీనర్**

## వేమన' పద్యం

కానివాని చేతగాసు వీసంబిచ్చి
వెంటదిరుగువాడె వెఱ్ఱివాడు
పిల్లి తిన్న కోడి పిలిచిన పలుకునా
విశ్వదాభిరామ! వినురవేమ.



# సంపాదకీయం

ఆత్రగాడికి బుద్ధి మట్టు అన్నది ఒక లోకోక్తి. ప్రస్తుతం అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ పరిస్థితి అలానే ఉంది. ఒక వైపు ఇరాన్‌పై దాడులకు దిగి దాన్ని లొంగదీసుకోలేక హార్ముజ్ జలసంధి నుంచి బయటపడలేక గిలగిలా కొట్టుకుంటున్నాడు. నాటోలోని ఐరోపా, ఆసియా, ఇతర ఖండాల్లోని మిత్రదేశాలేవీ అమెరికాను ఆదుకొనేందుకు ముందుకు రావటం లేదు. వాటి వైఖరిని మింగా కక్కలేక ఉన్నాడు. ఒక వైపు నవంబరు మూడున పార్లమెంటు ఆయా దేశాలు బలవం తంగా శ్రమ చేయిస్తూ మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నందున అపరాధ సుంకాలు విధిస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం ట్రంప్ ప్రకటించాడు. బలవంతగా పని చేయిస్తున్న దేశాల నుంచి వస్తువుల దిగుమతులు నిలిపివేత లేదా పన్నుల విధింపు బెదిరింపులకు పాల్పడుతున్న ట్రంప్‌నకు రాజకీయంగా ఆ దేశాలను దెబ్బతీసేందుకు అదొక సాకు తప్ప మరొకటి కాదు.అమెరికా లేదా ట్రంప్ వైఖరిని చూస్తే గతం నుంచి పాఠాలు నేర్చుకోలేదన్నది స్పష్టం.తొలిసారి పదవిలో ఉండగా 2018లో ట్రంప్ యంత్రాంగం ప్రారంభించిన వాణిజ్య పోరులో అనేక ఎదురు దెబ్బలు తగిలినా వెనక్కు తగ్గటం లేదు. సెనెట్ సభ్యుల ప్రతిపాదిత బిల్లు గనుక చట్ట రూపం దాల్చితే రష్యాతో చమురు, ఇతర వాణిజ్య లావాదేవీలు జరిపే మనదేశం, చైనా, మరికొన్ని దేశాలను ఇబ్బందుల్లోకి నెట్టటం అనివార్యం. వంద శాతం అపరాధ సుంకాలు విధించేందుకు అవకాశం ఉంది. రష్యాను మరింతగా ఇబ్బందుల్లోకి నెట్టేందుకు దాని చమురు శుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్‌తో ఒకవైపు దాడులు చేయిస్తూ మరోవైపు ఆంక్షలను కఠినతరం కావిస్తున్నది. చమురు కొనుగోలు చేసే దేశాలనే కాదు, రవాణా చేసే నౌకలపై కత్తి ఝుళిపించేం దుకు చూస్తున్నది. ప్రస్తుతం ఈజిప్టు నుంచి సింగపూర్ వరకు సముద్రంలో 13.7కోట్ల పీపాల ముడి చమురుతో నౌకలు ఎటుపోవాలో తెలియక తిష్టవేసి ఉన్నాయి. హార్ముజ్ జలసంధి దిగ్గంధన సమయంలో అలాంటి రష్యా చమురును కొనుగోలు చేయవచ్చంటూ ట్రంప్ గతంలో తొలగించిన ఆంక్షల గడువు ముగిసింది. కూడా దిగ్బంధనంలోకి మరోసారి ఆంక్షలను తాత్కాలికంగా పక్కన పెట్టాల్సి రావచ్చు. చైనా ఇప్పటికే ఢీ అంటే ఢీ అనే స్థితిలో ఉంది గనుక అమెరికాను ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కటం ప్రారంభించింది.
. అమెరికా వత్తిడికి లొంగి ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా చమురు దిగుమతులను తగ్గించుకుంటామని ప్రధాని నరేంద్రమోడీ అంగీకరించ టంతో మన వస్తువులపై అపరాధ పన్ను మొత్తాన్ని యాభై నుంచి పద్దెనిమిది శాతానికి తగ్గించేందుకు ట్రంప్ అంగీకరిం చాడు. అయితే అదే నెలాఖరులో ఇరాన్‌పై దాడితో హార్ముజ్ జలసంధి దిగ్బంధనంతో మన దేశం తగ్గించటానికి బదులు అదనంగా రష్యా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.
మరోసారి మనకు అలాంటి పరీక్ష పెట్టేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ముందే చెప్పుకున్నట్లు చైనా వస్తువులపై వందశాతం పన్ను విధిస్తానని ట్రంప్ ప్రకటించంతో అమెరికాకు అవసరమైన విలువైన పన్నెండు ఖనిజాల ఎగుమతులను చైనా నిలిపివేసింది. దాంతో దిగివచ్చిన ట్రంప్ ఈ ఏడాది అక్టోబరుతో ముగిసే గడువుతో ఒక ఏడాది పన్నుల నిలిపివేతకు అంగీకరించాడు. ఇప్పుడు మరోసారి ఆ గడువు ముగిసిన తరువాత చైనాతో లడాయి పెట్టుకొనేందుకు చూస్తున్నాడు. నవంబరులో ఎన్నికల ముందు ఓటర్లకు చెప్పుకొనేందుకు అది కూడా ఉపయోగపడవచ్చని భావిస్తున్నట్లుంది. చైనా రాజకీయంగా, ఆర్థికంగా అమెరికాకు సవాలు విసురుతున్నది గనుక దాని మీద కక్ష తీర్చుకుంటున్నారని అనుకుందాం. మరి కెనడా అలాంటిది కాదే, తోటి ధనికదేశం. అమెరికా చేసే అన్ని అక్రమాలకు అది మద్దతు ఇచ్చిన చరిత్ర ఉంది, అయినప్పటికీ దాని మీద కూడా పన్నుల కత్తి ఝుళిపిస్తున్నాడు ట్రంప్, అమలు చేసినపుడు చూద్దాంలే, ముందే ఎందుకు స్పందించాలని కెనడా ప్రధాని చేసిన ప్రకటన మాదిరి అనేక దేశాలు ఎదురు చూస్తున్నాయి. అందువలన అమెరికా నడక నల్లేరు మీద బండిలా సాగదని గ్రహించాలి!

## అమెరికాకు అంత ఈజీ కాదు

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# ఆ మంటలతో ఆర్థికం కుదేలు

**మధ్యప్రాచ్యం ప్రపంచ ఇంధన సరఫరాకు కేంద్రబిందువు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హోర్ముజ్ జలసంధి గుండా సాగుతుంది. యుద్ధం తీవ్రతరం కావడంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు సుమారు 65–68 డాలర్ల స్థాయి నుంచి 80–82 డాలర్ల వరకు పెరిగి, దాదాపు 20 నుంచి 25 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ధరల పెరుగుదల రవాణా, విద్యుత్ ఉత్పత్తి, ఎరువులు, పెట్రోరసాయనాలు, విమానయాన రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ఇంధన వ్యయం పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు మళ్లీ పెరుగుతున్నాయి.**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ అణు సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యమయ్యే వరకు సైనిక చర్యలు కొనసాగుతాయని ప్రకటించడం మధ్యప్రాచ్యాన్ని మరోసారి యుద్ధ వాతావరణంలోకి నెట్టింది. దౌత్య చర్చలపై విశ్వాసం తగ్గుతోందన్న వ్యాఖ్యలు ఈ ఘర్షణ త్వరగా ముగిసే అవకాశాలు క్షీణిస్తున్నాయని సూచిస్తున్నాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య సైనిక వివాదం కాదు; ప్రపంచ ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలు, అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్రపంచ సంక్షోభంగా మారుతోంది.

మధ్యప్రాచ్యం ప్రపంచ ఇంధన సరఫరాకు కేంద్రబిందువు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హోర్ముజ్ జలసంధి గుండా సాగుతుంది. యుద్ధం తీవ్రతరం కావడంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు సుమారు 65-68 డాలర్ల స్థాయి నుంచి 80-82 డాలర్ల వరకు పెరిగి, దాదాపు 20 నుంచి 25 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ధరల పెరుగుదల రవాణా, విద్యుత్ ఉత్పత్తి, ఎరువులు, పెట్రోరసాయనాలు, విమానయాన రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ఇంధన వ్యయం పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు మళ్లీ పెరుగుతున్నాయి.

యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే భారీ మూల్యం చెల్లిస్తోంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ అంచనాల ప్రకారం, ఈ ఘర్షణ ప్రభావంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏటా సుమారు 2.2 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల కొనుగోలు శక్తి సమాన (PPP) స్థూల దేశీయోత్పత్తిని కోల్పోతోంది. హోర్ముజ్ జలసంధిలో పరిస్థితులు కొంత మెరుగుపడినా వార్షిక ప్రపంచ జీడీపీ నష్టం 1.3 ట్రిలియన్ డాలర్లు ఉండవచ్చని, యుద్ధం మరింత విస్తరిస్తే అది 3.5 ట్రిలియన్ డాలర్ల వరకు చేరవచ్చని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఇరాన్‌కే ప్రత్యక్ష ఆస్తి నష్టం 80 నుంచి 350 బిలియన్ డాలర్లు, జీడీపీ నష్టం 268 నుంచి 446 బిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని అంచనాలు పేర్కొంటున్నాయి.భారతదేశం కూడా ఈ ప్రభావాన్ని గణనీయంగా అనుభవిస్తోంది. ఘర్షణ ప్రారంభ దశలో భారత స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారుల సంపదలో సుమారు ₹25 లక్షల కోట్ల నుంచి ₹41 లక్షల కోట్ల వరకు క్షీణత నమోదైనట్లు వివిధ మార్కెట్ విశ్లేషణలు వెల్లడించాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) ₹1.3 లక్షల కోట్లకు పైగా భారతీయ షేర్లను విక్రయించడం మార్కెట్లపై మరింత ఒత్తిడిని తీసుకొచ్చింది. మరోవైపు, చమురు ధరల పెరుగుదలతో ఏప్రిల్ నెలలో భారత చమురు, సహజ వాయువు దిగుమతి వ్యయం మార్చితో పోలిస్తే సుమారు 53 శాతం పెరిగిందని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. దీని ప్రభావం వాణిజ్య లోటు, రూపాయి మారకపు విలువ, ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాలపై స్పష్టంగా కనిపిస్తోంది.ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం ముందస్తు వ్యూహంతో వ్యవహరించాలి. వ్యూహాత్మక చమురు నిల్వలను విస్తరించడం, దిగుమతి వనరులను వైవిధ్యీకరించడం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని వేగవంతం చేయడం, సహజ వాయువు వినియోగాన్ని పెంచడం, ఇంధన పొదుపు చర్యలను ప్రోత్సహించడం అత్యవసరం. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కోసం అత్యవసర తరలింపు ప్రణాళిక సిద్ధంగా ఉండాలి. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణ నియంత్రణకు సమన్వయ చర్యలు చేపట్టడం, చిన్న పరిశ్రమలకు తాత్కాలిక మద్దతు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు సమర్థమైన మార్కెట్ జోక్యం కూడా అవసరం. అదే సమయంలో దేశీయ చమురు అన్వేషణ, వ్యూహాత్మక నిల్వల సామర్థ్య విస్తరణ, విద్యుత్ రంగంలో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పెట్టుబడులు మరింత పెంచాల్సిన అవసరం ఉంది.యుద్ధంలో ఏ దేశం గెలిచినా, చివరికి ఓడిపోయేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థే. అభివృద్ధి చెందుతున్న దేశాలు అత్యధిక మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఇంధన భద్రత, ప్రపంచ వాణిజ్య స్థిరత్వం, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను కాపాడాలంటే సైనిక ఘర్షణల కంటే దౌత్య చర్చలు, పరస్పర విశ్వాసం, శాంతియుత పరిష్కారాలకే ప్రపంచ సమాజం ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.



సి. హెచ్. ప్రతాప్
77938 00743






## బ్యాటరీల విప్లవం... "వ్యర్థాల విస్ఫోటనం

ప్రపంచం కాలుష్య రహిత భవిష్యత్తు వైపు పరుగులు తీస్తోంది. విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్ వంటి పచ్చని సాంకేతికతలు కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక మరో ఆందోళనకరమైన ప్రశ్నb నిలుస్తోంది. అదే... లిథియం అయాన్ బ్యాటరీ వ్యర్థాల సమస్య.
నేటి ఆధునిక జీవనంలో మొబైల్ ఫోన్ల నుంచి విద్యుత్ వాహనాల వరకు బ్యాటరీలు కీలక శక్తి వనరులుగా మారాయి. కానీ వాటి జీవితకాలం ముగిసిన తర్వాత వాటిని సక్రమంగా రీసైక్లింగ్ చేయకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్రమైన ముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఐఐటీ మద్రాస్ కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే సంవత్సరాల్లో బ్యాటరీ వ్యర్థాలు భారీ స్థాయిలో పేరుకుపోయే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే శాస్త్రీయ రీసైక్లింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

2030 నాటికి వ్యర్థాల భారమా?
ప్రపంచానికి హెచ్చరిక
అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల లిథియం బ్యాటరీ వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో సౌర విద్యుత్ విస్తరణతో పాత సోలార్ ప్యానళ్ల వ్యర్థాల సమస్య కూడా పెరగనుంది.అయితే ప్రస్తుతం ప్రపంచ బ్యాటరీ రీసైక్లింగ్ సామర్థ్యం చాలా పరిమితంగా ఉంది. కేవలం 5 నుంచి 6 శాతం వరకు మాత్రమే రీసైక్లింగ్ జరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే పర్యావరణ సమస్యతో పాటు విలువైన ఖనిజాల కొరత కూడా ఎదురయ్యే అవకాశం ఉంది.వ్యర్థాల్లోనే విలువైన సంపద... 'బ్లాక్ మాస్'కు పెరుగుతున్న ప్రాధాన్యంవాడేసిన బ్యాటరీలు కేవలం చెత్త కాదు... అవి విలువైన ఖనిజాల నిల్వలు. రీసైక్లింగ్ ద్వారా లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి లోహాలను తిరిగి పొందవచ్చు.
బ్యాటరీలను శుద్ధి చేసిన తర్వాత లభించే నల్లటి పదార్థాన్ని 'బ్లాక్ మాస్' అంటారు. ఇది కొత్త బ్యాటరీల తయారీకి అవసరమైన ముఖ్యమైన ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది.
ప్రస్తుతం బ్యాటరీ తయారీకి అవసరమైన అనేక ఖనిజాల కోసం భారత్ విదేశాలపై ఆధారపడుతోంది. ముఖ్యంగా కోబాల్ట్ వంటి అరుదైన లోహాల కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. రీసైక్లింగ్ వ్యవస్థ బలపడితే ఈ ఆధారపడటం తగ్గి, దేశ ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుంది.
భారత సాంకేతిక శక్తికి నిదర్శనం బ్యాటరీ వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపేందుకు ఐఐటీ మద్రాస్ ఆధునిక సాంకేతికతలపై పరిశోధనలు చేస్తోంది. తమిళనాడు విద్యుత్ బోర్డుతో కలిసి బ్యాటరీ శక్తి నిల్వ, రీసైక్లింగ్ విధానాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.
లిథియం బ్యాటరీలు అత్యంత దహనశీలమైనవి కావడంతో వాటి నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. దీనికి ద్రవ ఆధారిత హైడ్రోమెటలర్జికల్ సాంకేతికతలను ఉపయోగిస్తూ సురక్షితమైన రీసైక్లింగ్ విధానాలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి.
ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచి రోజుకు వెయ్యి కిలోల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రయోగాలు జరుగుతున్నాయి.
ప్రపంచ దేశాల మార్గం... భారత్‌కు పాఠంచైనా, యూరప్ దేశాలు బ్యాటరీ రీసైక్లింగ్‌లో ముందంజలో ఉన్నాయి. చైనా పాత బ్యాటరీల నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి ఖనిజాలను తిరిగి పొందుతూ కొత్త బ్యాటరీల తయారీలో ఉపయోగిస్తోంది.
యూరప్‌లో బ్యాటరీ తయారీ సంస్థలకే వాటి జీవితాంత నిర్వహణ బాధ్యతలను అప్పగించే విధానాలు అమలులో ఉన్నాయి. అమెరికా ఆధునిక సాంకేతికతలతో బ్యాటరీలను సురక్షితంగా విడదీసి విలువైన పదార్థాలను తిరిగి పొందుతోంది.జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా పరిశోధన, పునర్వినియోగ విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.పచ్చని భవిష్యత్తుకు రీసైక్లింగ్ మార్గంవిద్యుత్ వాహనాల విస్తరణ ఎంత అవసరమో, వాటి నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణ కూడా అంతే ముఖ్యం. కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి సమగ్ర రీసైక్లింగ్ వ్యవస్థను నిర్మించాల్సిన సమయం వచ్చింది. సాంకేతిక ప్రగతి ప్రకృతికి భారంగా మారకుండా, భూమికి మేలు చేసే సాధనంగా నిలవాలంటే బాధ్యతాయుతమైన వినియోగం తప్పనిసరి.
"బ్యాటరీలు రేపటి ప్రపంచానికి శక్తినిస్తాయి... కానీ వాటి వ్యర్థాలను జాగ్రత్తగా నిర్వహించినప్పుడే ఆ శక్తి భవిష్యత్ తరాలకు ఆశగా మారుతుంది





## మరణం మనిషిదే... జ్ఞాపకాలది కాదు

నేను తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని చూసినవాడిగా, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎరిగినవాడిగా, నర్సంపేట ప్రాంతంతో మట్టిబంధం ఉన్నవాడిగా నర్సంపేట మట్టిలో కలిసిపోయిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్ర చూశాక ఈ నాలుగు మాటలతోనైనా అక్షర నివాళి రాయాలనిపించింది. మనిషిపై మనిషికి భిన్నభిప్రాయాలు, బేధాభిప్రాయాలు ఉండొచ్చు, రాజకీయ విభేదాలు ఉండొచ్చు, కానీ వాటన్నింటినీ కన్నీటితో కడిగేస్తున్నామనే విధంగా ఆయనకు వీడ్కోలు పలికేందుకు కుల, మత, పార్టీలకతీతంగా తరలివచ్చిన జన సమూహాన్ని చూసి నాలో కలిగిన భావాలకు అక్షరరూపమే ఈ శ్రద్ధాంజలి మాటలు.


మనిషి పుట్టిన క్షణమే మరణం కూడా అతని నీడగా ప్రయాణం మొదలుపెడుతుంది. మధ్యలో ఉండేది కేవలం జీవితం మాత్రమే. ఆ జీవితాన్ని ఎన్ని సంవత్సరాలు జీవించామనేది చరిత్ర అడగదు. ఎలా జీవించామనేదే కాలం గుర్తుంచుకుంటుంది. మనిషి చనిపోయినప్పుడు శ్మశానానికి వెళ్లే అడుగుల సంఖ్య అతని సంపదను చెప్పదు. అతను సంపాదించిన మనుషులను చెబుతుంది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో కనిపించిన వేలాది అడుగులు ఒక రాజకీయ కార్యక్రమానికి హాజరైన జనసందోహం కాదు. ఒక మనిషి జీవితానికి ప్రజలు రాసిన చివరి వాక్యం. మాటలతో చెప్పలేని గౌరవానికి, మౌనంగా చెల్లించిన ఋణానికి అది సజీవ సాక్ష్యం. తెలంగాణ మలిదశ ఉద్యమం కేవలం రాజకీయ పోరాటం కాదు. అది అనేకమంది జీవితాలను అర్పించిన ఒక సామూహిక స్వప్నం. ఆ స్వప్నాన్ని తమ భుజాలపై మోసిన వారిలో పెద్ది సుదర్శన్ రెడ్డి ఒకరు. ఉద్యమం వీధుల్లో వినిపించిన నినాదాల వెనుక ఉన్న చెమటలో, ప్రజల ఆశల్లో, తెలంగాణ ఆకాంక్షల్లో ఆయన అడుగుల ముద్రలు ఉన్నాయి.

జీవితంలో పదవులు వస్తాయి... పోతాయి. అధికారం చేతులు మారుతుంది. కానీ మనిషి చనిపోయిన రోజు ప్రజలు తమ పనులను పక్కన పెట్టి స్వచ్ఛందంగా చివరి చూపు కోసం తరలి వస్తే, అది అధికారానికి వచ్చిన గౌరవం కాదు. వ్యక్తిత్వానికి వచ్చిన గౌరవం. మనిషి చివరి ప్రయాణం అతని జీవితానికి అద్దం పడుతుంది. ఆ అద్దంలో కొందరికి ఖాళీ కుర్చీలు కనిపిస్తాయి. కొందరికి అధికారపు జ్ఞాపకాలు కనిపిస్తాయి. మరికొందరికి మాత్రం వేలాది కన్నీటి చుక్కలు కనిపిస్తాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్ర ఆ మూడో చిత్రాన్ని చూపించింది. నర్సంపేట నేల ఆయనను నాయకుడిగా చూసి ఉండొచ్చు. కానీ ఆయన వెళ్లిపోయిన రోజు అదే నేల తన మనిషిని కోల్పోయిన బాధను వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సిద్ధాంతాలు, వర్గాలు అన్నీ ఆ క్షణంలో వెనక్కి వెళ్లిపోయాయి. మిగిలింది ఒక్కటే——ఒక మనిషిపై ప్రజలు చూపిన ప్రేమ. జీవితం చివరికి ఒక ప్రశ్న మాత్రమే అడుగుతుంది "నువ్వు ఎంతకాలం బతికావు..?" అని కాదు... "నీ కోసం ఎంతమంది కన్నీరు పెట్టుకున్నారు..?" అని. ఆ ప్రశ్నకు పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితం తన సమాధానాన్ని ఆయన అంతిమయాత్ర ద్వారానే చెప్పింది. మనిషి మరణిస్తాడు. అతని పేరు కూడా ఒకరోజు చరిత్ర పుస్తకాల పేజీల్లో కలిసిపోవచ్చు. కానీ అతని వల్ల మారిన జీవితాలు, అతని చేతిని పట్టుకున్న మనుషులు, అతన్ని గుర్తు చేసుకుంటూ తడిచే కళ్లు... అవి మరణించవు.మరణం శరీరాన్ని మాత్రమే తీసుకుపోతుంది. మనిషి సంపాదించిన అభిమానాన్ని కాదు. కాలం అడుగులను చెరిపేయవచ్చు. కానీ మనసుల్లో పడిన ముద్రలను చెరపలేదు. అందుకే కొందరి అంతిమయాత్ర ముగింపు కాదు. అది వారు మనుషుల హృదయాల్లో ప్రారంభించిన మరో ప్రయాణం. పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా, తెలంగాణ మలిదశ ఉద్యమ జ్ఞాపకాలలో, నర్సంపేట ప్రజల మనసుల్లో, ఆయనతో కలిసి నడిచిన వేలాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

– రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్ వరంగల్

## దూరవాణి ఆవిష్కర్త గ్రాహంబెల్

వినికిడి గురించి మానవాళికి ప్రచారం కలిగించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ టెలిఫోన్ ను కనుగొన్న గ్రాహం బెల్ జన్మదినాన్ని ప్రపంచ వినికిడి దినోత్సవంగా జరుపు కుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007, 3న ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. 2016కు ముందు దీనిని అంతర్జాతీయ చెవి సంరక్షణ దినోత్సవం అని పిలిచే వారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన అంధత్వం, చెవుడు నివారణ కార్యాలయం ప్రతి సంవత్సరం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది.నేడు మనం వాడుతున్న ఫోన్లకు మాతృక అయిన "టెలిఫోన్" అనేదాన్ని కనిపెట్టింది అమెరికాకు చెందిన "అలెగ్జాండర్ గ్రాహంబెల్" అని మనలో చాలామందికి తెలిసే ఉంటుంది. టెలీ ఫోను అంటే... టెలీ అనగా దూర, ఫోను అంటే వాణి... దూరవాణి అని అర్థం. ఇది సాధారణంగా ఇద్దరు, మరికొన్ని సమయాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సంభాషించు కునేందుకు ఉపయోగిస్తుంటారన్న సంగతి మనకు తెలిసిందే. అలెగ్జాండర్ గ్రాహంబెల్ స్కాట్లాండులోని ఎడిన్‌బర్గ్ అనే ప్రాంతంలో మార్చి 3, 1847వ సంవత్సరంలో జన్మించాడు. ఆయన తండ్రి పేరు అలెగ్జాండర్ మెల్‌విల్లే బెల్ (ప్రొఫెసర్) కాగా, తల్లి పేరు ఎలిజా గ్రేస్. గ్రాహెంబెల్. చిన్న వయసు నుంచే సహజంగానే అనేక విషయాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా గ్రాహెంబెల్ కు ఆ రోజుల్లోనే పరిశీలనా శక్తి అధికంగా ఉండేది. తన పక్కింట్లో నివాసముండే తన స్నేహితుడు బెన్ హెర్డ్‌మెన్ సహాయంతో గ్రాహెంబెల్ 12 ఏళ్ల ప్రాయంలోనే "ఇన్వెంట్" అనే పేరుతో చిన్న వర్క్‌షాప్‌ను నిర్వహించాడు.తల్లి క్రమేణా వినికిడి శక్తిని కోల్పోవడంతో ఆమెతో మాట్లాడే క్రమంలో సంజ్ఞలతో భావ వ్యక్తీకరణలో ఆరితేరాడు. ఆమె నుదిటి ఎముకకు దగ్గరగా ఒక రకమైన ఉచ్ఛారణతో మాట్లాడే ప్రయత్నంలో ధ్వని శాస్త్రాన్ని అర్థం చేసుకున్నాడు.
బెల్‌లోని విజ్ఞాన తృష్ణకు తల్లి చెవిటితనం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు.



ధ్వని, వినికిడి శాస్త్రాలు చదివి అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయంలో 'గాత్ర సంబంధిత శరీర శాస్త్రం' (వోకల్ ఫిజియాలజీ)లో ప్రొఫెసర్‌గా చేరాడు. భార్య సైతం వినికిడి శక్తిని కోల్పోవడంతో బధిరుల కోసం పరిశోధనలు చేసి, వారు వినగలిగే శబ్ద పరికరాలను రూపొందించాడు. పగలంతా బోధిస్తూ, రాత్రంతా మేలుకుని ప్రయోగాలు చేసేవాడు. ఆ కృషి కారణంగానే తీగల ద్వారా శబ్ద తరంగాలను పంపగలిగే టెలిఫోన్‌ను కనిపెట్ట గలిగాడు. ఇలా కనిపెట్టినదే టెలిఫోను. దీనిని 1876 రూపొందించిన గ్రాహెంబెల్ మొదటిసారిగా ఉపయోగిస్తూ, పక్క గదిలో ఉన్న వాట్సన్‌తో మాట్లాడారు. దీనిపై 1876లో ఆయనకు లభించిన పేటెంట్ అమెరికాలోనే శాస్త్రరంగంలో మొదటిది. గ్రహంబెల్ ను చాలామంది టెలిఫోన్ ఆవిష్కర్తగా గుర్తుంచుకున్నా ఆయన వివిధ రంగాలలో ఆసక్తిని కనబరచాడు. ఆప్టికల్ టెలి కమ్యూనికేషన్స్, హైడ్రోఫాయిల్స్, ఏరోనాటిక్స్ రంగాల్లో కూడా అనేక ఆవిష్కరణలు చేశాడు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ వ్యవస్థాపకుల్లో గ్రాహంబెల్ కూడా అయన ఒకరు.1880 వ సంవత్సరంలో టెలిఫోన్ ఆవిష్కరణకు గాను ఫ్రెంచి ప్రభుత్వం ప్రధానం చేసే వోల్టా పురస్కారాన్ని గెలుచుకున్నాడు. దీని విలువ 50,000 ఫ్రాంకులు (



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

అమ్మ నాన్నల్ని గౌరవించకుండా..
దేవాలయం వెళ్లలేవు మిత్రమా !
తల్లిదండ్రుల పాదపూజ నుంచే..
దేవాలయానికి దారి దొరుకుతుంది !
నీ ప్రవర్తనతో ఎదుటివారి మనసుల్లో..
శాశ్వత స్థానం సంపాదించుకో..
నీ ఆత్మీయ మాటలతో మూటలతో..
నవ్వుల పువ్వులు పూయించుకో !
నవ్విన ప్రతిసారి ఆనందం
కలగకపోవచ్చు
ఇష్టపడిన ప్రతి వ్యక్తి నీ వాడు
కాకపోవచ్చు

## శ్రమ స్వేదం

ముంచకపోవచ్చు
నీ ప్రతి మంచి పని
గుర్తించబడకపోవచ్చు !
నీ ప్రతి త్యాగం గుర్తించబడకపోవచ్చు
నీ ప్రేమను బలహీనత అనుకోవచ్చు
నీ ప్రతి శ్రమ స్వేదం ఫలితం
ఇవ్వకపోవచ్చు
అయినా త్యాగం, ప్రేమ, శ్రమల్ని
వదలొద్దు !
ప్రతి సూర్యోదయం...

నిన్నటి వైఫల్యాల్ని మెట్లుగా చేసుకో..
నేటి సమోన్నత లక్ష్య శిఖరాలను
చేరుకో !
చేతులో ఉన్న ప్రతి గింజను
మింగేయకు..
నేడు మట్టిలో నాటితే రేపు పంట
వస్తుంది
ఉన్న డబ్బంతా దుబారాగా ఖర్చు
చేయకు..
సరైన పెట్టుబడితో రెట్టింపు
పొందవచ్చు !
మధుపాళీ



# జాతీయం-అంతర్జాతీయం



## అతడిని మంత్రిగా ఎలా కొనసాగిస్తారు?

- బీహార్ సర్కార్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ విమర్శ





**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** బీహార్ బీజేపీ ప్రభుత్వంపై దేశ ఉన్నత న్యాయస్థానం తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలింగ్ ద్వారా ఎన్నిక కాని మంత్రిని మంత్రి వర్గంలో ఎలా కొనసాగిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించకుండా సదురు మంత్రిని పదవిలో కొనసాగించడం రాజ్యాంగ ఉల్లంఘనంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. "ఇది పూర్తిగా చట్టపరమైన అంశం. ఎన్నిక కాకుండానే ఒక మంత్రి ఆరు నెలలకు పైగా పదవిలో ఎలా కొనసాగుతున్నారో ప్రభుత్వం వివరించాల్సి ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ కోసం ఈకేసును కోర్టు ఆగస్టు 4వ వాయిదా వేసింది.

నితీష్ కుమార్ సీఎంగా ఉన్నప్పుడు బీహార్ మంత్రివర్గంలో దీపక్ ప్రకాశ్ పంచాయతీ రాజ్ మంత్రి ప్రమాణా స్వీకారం చేశారు.ఏప్రిల్ 15, 2026న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పదవి నుంచి తప్పుకోవడంతో ప్రకాష్ పదవీకాలం ముగిసింది.

అంతకుముందు ఆయన నాలుగు నెలల 26 రోజుల పాటు పంచాయతీ రాజ్ మంత్రిగా పనిచేశారు. మే 7న సామ్రాట్ చౌదరి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, ఎన్నిక కాకపోయినప్పటికీ ప్రకాష్ మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఎన్నికకాకున్న కూడా సదురు మంత్రి ఆరు నెల కన్నా ఎక్కువగానే కొనసాగుతున్నారు. దీంతో దీపక్ ప్రకాశ్ చట్టవిరుద్ధంగా మంత్రి పదవిలో కొనసాగుతున్నారని పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం బీహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికకానీ మంత్రిని ఆరు నెలపైగా మంత్రి పదవిలో ఎలా కొనసాగిస్తారని, సమగ్ర వివరణ తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది.

## కకావికలం చేస్తోన్న కార్చిచ్చు




**పారిస్, రెథిమ్నో, జులై 30:** దక్షిణ ఐరోపా దేశాలను కార్చిచ్చు కకావికలం చేస్తోంది. ఫ్రాన్స్‌లో చెలరేగిన మంటలు అదుపులోకి రాకుండా విస్తరిస్తుండగా, గ్రీస్‌లో విధి నిర్వహణలో ముగ్గురు ఫైర్‌ఫైటర్లు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రమైన వేడి, కరవు, బలమైన గాలుల కారణంగా ఫ్రాన్స్, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

నైరుతి ఫ్రాన్స్‌లోని గిరోండే ప్రాంతంలో రాజుకున్న కార్చిచ్చు పారిస్ నగరానికి నాలుగు రెట్ల విస్తీర్ణంలో వ్యాపించిందని అధికారులు తెలిపారు. మంటలు మరింత విస్తరించే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో కలిపి దాదాపు 3.30 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఒక్క గిరోండే ప్రాంతం నుంచే 2.20 లక్షల మందిని ఖాళీ చేయించారు. 2,200 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, 20కి పైగా విమానాలు మంటలను ఆర్పేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయి. ఇతర యూరోపియన్ దేశాల నుంచి కూడా సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. స్థానిక ప్రజలు కూడా స్వచ్ఛందంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

మరోవైపు, గ్రీస్‌లో పరిస్థితి మరింత విషాదకరంగా మారింది. క్రీట్ ప్రాంతంలోని రెథిమ్నోలో మంటలను ఆర్పే క్రమంలో ఇద్దరు, పెలోపొన్నీస్ ప్రాంతంలో మరొకరు చొప్పున మొత్తం ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది మరణించారు. స్పెయిన్‌లో కొన్నిప్రాంతాల్లో మంటలు అదుపులోకి రావడంతో ప్రజలు ఇళ్లకు తిరిగి వస్తున్నారు. అయితే, కాస్టెలాన్‌లో ఇంకా 10,000 మంది తరలింపు శిబిరాల్లోనే ఉన్నారు.

తీవ్రమైన వేడి, తేమలేని వాతావరణం కారణంగా గడ్డి, పొదలు వేగంగా మండిపోతున్నాయని అధికారులు వివరిస్తున్నారు.

ఒక బ్రష్‌కటింగ్ యంత్రం నుంచి వచ్చిన నిప్పురవ్వల వల్లే ఫ్రాన్స్‌లో ఈ కార్చిచ్చు మొదలైందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మంటల వల్ల ఫ్రాన్స్‌లో తొలిసారిగా 'పైరోక్యుములోనింబస్' అనే ఉరుములతో కూడిన నల్లటి మేఘం ఏర్పడిందని, ఇది కొత్తగా మంటలను సృష్టిస్తోందని అధికారులు తెలిపారు. యూరప్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండమని, ఇది ప్రపంచ సగటు కంటే రెట్టింపు వేగంతో ఉందని యూరోపియన్ యూనియన్ క్లైమేట్ సర్వీస్ 'కోపర్నికస్' నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దక్షిణ ఐరోపా దేశాలు అగ్నికీలలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు



- కఠిన చర్యలు తీసుకునేలా రూపకల్పన
- ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** పబ్లిక్ ఎగ్జామినేషన్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్రం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మంత్రి జితేందర్ సింగ్ సదురు బిల్లును సభ్యుల ముందు ఉంచారు.ఈ బిల్లును ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా.. గురువారం ఎగువసభలో దీనిపై సుదీర్ఘ చర్చ జరగనుంది. ఇటీవలి కాలంలో దేశంలోని పలు పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, ప్రశ్నపత్రాల లీకేజీలు, మోసపూరిత చర్యలు, ఇతర అక్రమాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లును రూపొందించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను లోక్‌సభ బుధవారం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ క్లుప్తంగా సమాధానమిచ్చిన అనంతరం ఈ ఆమోదం లభించింది. ఈ బిల్లుపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సుదీర్ఘ చర్చ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. బుధవారం నాడు తిరిగి చర్చ ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న మూడేళ్లకు తక్కువ కాకుండా, ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు శిక్షను పొడిగించేలా పెంచాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. గరిష్ఠ జరిమానాను కూడా రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు.

## పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల ఆందోళన



- విద్యార్థులపై లాఠీఛార్జీకి ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్):** పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్షాలు ఆందోళన బాటపట్టాయి. జంతర్ మంతర్ వద్ద ఈనెల 25న నిరసన చేపట్టిన జెన్ జీ పై లాఠీచార్జీను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశాయి. న్యాయమైన డిమాండ్ల కోసం, యువత భవిష్యత్ కోసం చేపట్టిన శాంతియుత ఆందోళనలపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని విపక్ష ఎంపీలు మండిపడ్డారు. యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు.

జెన్ జీ నిరసనలకు మద్దతుగా నిలిచిన, పాల్గొన్న వారిపై మోడీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎవరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయబోమని జెన్ జీకి హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ జెన్ జీని మోసం చేస్తుందని విపక్షాలు మండిపడ్డాయి. ఉభయసభల్లో అయోధ్య విరాళాల దుర్వినియోగం చర్చ జరపాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

## హాకీ జట్టు జెర్సీపై రాజకీయం

- నీలం రంగు స్థానంలో కాషాయం
- చరిత్రను మారుస్తున్నారంటూ ప్రియాంకా గాంధీ ఆవేదన

**న్యూఢిల్లీ, జులై 30 (ఎ.ఎం.ఎస్) :** భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయ రంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్క్విన్హా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె, దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు. జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తం చేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయాన్ని దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టం చేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు.

## కంగనాకు సీజేపీ నేత కౌంటర్

- తనదైన శైలిలో సౌరవ్ దాస్ సెటైర్లు
- చర్చనీయాంశమైన వ్యాఖ్యలు
- కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదంటూ క్లారిటీ



**ముంబయి, జులై 30 (ఎ.ఎం.ఎస్):** బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన 'పనికిమాలినవాడు', 'నిరుద్యోగి' అనే తీవ్రమైన వ్యాఖ్యలకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తనదైన శైలిలో, హాస్యాన్ని జోడించి బదులిచ్చారు. తనపై కంగనా వ్యక్తిగత విమర్శలకు దిగడానికి కారణం, తాను "యువ హృతిక్ రోషన్‌లా కనిపించడమే" కావొచ్చని తన స్నేహితులు అంటున్నారని ఆయన చమత్కరించారు. ఇద్దరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధంలో ఈ వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తించాయి. ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో మాట్లాడుతూ సౌరవ్ దాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా కంగనా తనను లక్ష్యంగా చేసుకోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "నా స్నేహితులు నాకు టెక్స్ట్ చేసి 'ఆమె నీ వెనుక ఎందుకు పడింది?' అని అడుగుతున్నారు. వారిలో ఒకరు 'నువ్వు బహుశా యువ హృతిక్ రోషన్‌లా కనిపిస్తున్నావేమో' అని అన్నారు. ఇది నిజమేనా? ఈ గొడవ తర్వాత నా స్నేహితులు నాతో చెప్పింది ఇదే. నా లాంటి వ్యక్తిపై ఆమె ఎందుకు దాడి చేయాలనుకుంటుందోనని ఆశ్చర్యపోయాను" అని నవ్వుతూ చెప్పారు. అయితే, కంగనాపై తనకు వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకత లేదని ఆయన స్పష్టం చేశారు. అభిప్రాయ భేదాలను వ్యక్తిగత దాడులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సౌరవ్ దాస్ సూచించారు. "కంగనా రనౌత్‌పై నాకు వ్యక్తిగతంగా ఏమీ వ్యతిరేకత లేదు. తనే జెన్‌జీ పైనా, ఇప్పుడు నాపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారు. నేను ఇప్పటికే నా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చెప్పాను, 'యో కంగనా, కాస్త శాంతించు. దీని గురించి మాట్లాడుకుందాం' అని. ఈ దేశంలో ఉన్న సమస్యే ఇది. ప్రజలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు. చర్చలు, సంప్రదింపులు తగ్గిపోయాయి. మనం ఒకరినొకరు గౌరవించుకుంటూ సంభాషణలు జరపగలగాలి" అని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు దేశ యువత గురించి మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారి మాటలు నిరాశతో కూడుకున్నవిగా ఉన్నాయని అన్నారు. తాము ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## జెలెన్ స్కీ, నెతన్యాహూలతో ట్రంప్ భేటి



- సానుకూలంగా సమావేశాలు
- ఉక్రెయిన్‌కు సాయంపై ఎలాంటి ప్రకటనా చేయని అమెరికా

**వాషింగ్టన్, జులై 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశాలు సానుకూలంగా, ఫలప్రదంగా జరిగాయని అధ్యక్షభవనం తెలిపింది. సెనెటర్ లిండ్సే గ్రహమ్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ఇరువురు నేతలు వాషింగ్టన్ వచ్చారు. గ్రహమ్ ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం అందించాలని ఆయన సూచించే వారు. కాగా గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసే విషయంలో సాయం చేయాలని ట్రంప్‌ను జెలెన్‌స్కీ కోరారు.

అమెరికా నుంచి పాట్రియాట్ క్షిపణులను ఉక్రెయిన్ చాలా కాలం నుంచి కోరుతోంది. రష్యా డ్రోన్, క్షిపణి దాడుల నుంచి ఉక్రెయిన్ నగరాలను కాపాడుకునేందుకు ఇవి అవసరమని చెబుతోంది. మరోవైపు ఇరాన్ విషయంలో అమెరికాఇజ్రాయిల్ మధ్య సంబంధాలు బెడిసికొట్టిన తరుణంలో ట్రంప్‌తో నెతన్యాహూ చర్చలు జరిపారు.

ఏకాంత సమావేశం బాగానే జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై అమెరికా ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ పాట్రియాట్ క్షిపణులను దేశీయంగా తయారు చేయడానికి లైసెన్సులు ఇచ్చేందుకు ట్రంప్ అంగీకరించారని జెలెన్‌స్కీ చెప్పారు. బాలిస్టిక్ క్షిపణుల దాడిని అడ్డకోగలిగిన అతి కొద్ది గగనతల రక్షణ వ్యవస్థలలో పాట్రియాట్ ఒకటి. అయితే వీటి ధర చాలా ఎక్కువ. ఒక్కో పాట్రియాట్ ఖరీదు మూడు నుంచి ఐదు మిలియన్ డాలర్ల వరకూ ఉంటుంది.

## వైద్యరంగంలో కీలక సంస్కరణలు



- శ్రీకారం చుట్టిన తమిళనాడు ప్రభుత్వం
- సింగిల్ విండో క్లియరెన్స్‌కు నిర్ణయం
- నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలంటూ ఆదేశాలు

**చెన్నై, జులై 30 (ఎ.ఎం.ఎస్):** వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా తమిళనాడు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం 'సింగిల్ విండో క్లియరెన్స్' (ఏక గవాక్ష) విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

దీనివల్ల ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అనుమతుల ప్రక్రియ కేవలం కొన్ని నెలల్లోనే పూర్తి కానుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో పారిశ్రామికంగా పురోగతి సాధిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల సరసన తమిళనాడు కూడా నిలవనుంది. ప్రస్తుత విధానంలో ఆసుపత్రి భవనాలు, ప్రాజెక్ట్ డిజైన్లకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, కొన్ని సందర్భాల్లో రూ. 4050 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ జాప్యం కారణంగా సుమారు 78 మంది వైద్యులు తలపెట్టిన ఆసుపత్రి ప్రాజెక్టులు ప్రస్తుతం పెండింగ్‌లో పడిపోయాయి.

కొత్త సింగిల్ విండో విధానంతో పారదర్శకమైన, నిర్దిష్టమైన ఫీజుల విధానం అమల్లోకి రానుంది. దీనివల్ల అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని, అనుమతుల ప్రక్రియ వేగవంతమై వైద్య రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా పరిశ్రమ వర్గాల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## హోర్ముజ్‌లో నౌకలను స్వేచ్ఛగా తిరగనివ్వండి

- ఐరాస భద్రతా మండలిలో భారత్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన



**న్యూయార్క్, జులై 30 :** పశ్చిమాసియాలో తిరిగి ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇటీవల జరిగిన దాడులను ఖండించింది. ఉద్రిక్తలను నివారించాలని, అంతర్జాతీయ జలమార్గంలో నౌకలు స్వేచ్ఛగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా చూడాలని కోరింది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితిపై భద్రతా మండలిలో జరిగిన బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి (ఐరాస) పర్వతనేని హరీష్ మంగళవారం ప్రసంగిస్తూ స్వల్ప విరామం తర్వాత తిరిగి శత్రుత్వాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. చర్చలు, దౌత్యానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌కు పశ్చిమాసియా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని అంటూ ఆ ప్రాంతంలో ఉద్రిక్తతల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. హోర్ముజ్‌లో జరిగిన దాడులు భారతీయ పౌరులపై ప్రత్యక్ష ప్రభావం చూపాయని చెప్పారు.

'ఈ దాడులలో పలువురు భారతీయులు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరొకరి ఆచూకీ తెలియడం లేదు. నౌకాయాన సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని జరిపే హింసాత్మక చర్యలను భారత్ నిరంతరం ఖండిస్తూనే ఉంది. హోర్ముజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాల ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానానికి అంతరాయం కల్పించడాన్ని కూడా మేము నిరసిస్తూనే ఉన్నాం' అని హరీష్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరత పునరుద్ధరించబడాలంటే దౌత్యం ఒక్కటే మార్గమని భారత్ గట్టిగా అభిప్రాయపడుతోందని అన్నారు.

పశ్చిమాసియాలో భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను హరీష్ ఈ సందర్భంగా వివరించారు. పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతు కొనసాగుతుందని, రెండు దేశాల పరిష్కారానికి దీర్ఘకాలంగా మద్దతు ఇస్తోందని తెలిపారు.

## ఇరాక్‌పై విరుచుకుపడిన అమెరికా, సౌదీ



- 20 మంది మరణం
- ఉగ్రవాదులపైన్నే దాడులంటూ ఇరు దేశాల స్పష్టీకరణ

**బాగ్దాద్, జులై 30 :** ఇరాక్‌పై అమెరికాసౌదీ సేనలు బుధవారం విరుచుకుపడ్డాయి. ఈ దాడులలో మాజీ పార్లమెంటరీ కూటమికి చెందిన కనీసం 20 మంది చనిపోయారు. ఈ కూటమిలో ఇరాన్ అనుకూల గ్రూపులు కూడా ఉన్నాయి. మాజీ పార్లమెంటరీ గ్రూపులు, ఇరాక్ సాయుధ దళాలలో భాగస్వాములైన వర్గాలతో ఏర్పడిన పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్ (పీఎంఎఫ్) అందించిన సమాచారం ప్రకారం ఏడు రాష్ట్రాలలోని కూటమి స్థావరాలపై అమెరికాసౌదీ జరిపిన దాడులలో కనీసం 20 మంది చనిపోగా 32 మంది గాయపడ్డారు. కాగా అమెరికా సేనల పైన, సౌదీ చమురు స్థావరాల పైన జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఇరాక్‌లో ఇరాన్ మద్దతిస్తున్న ఉగ్రవాదులపై దాడులు చేశామని అమెరికాసౌదీ అరేబియా ఆరోపించాయి. 2014లో జిహాదీలపై పోరాడేందుకు పారామిలటరీలు, వర్గాలతో ఏర్పడిన కూటమే పీఎంఎఫ్. ఇప్పుడది ఇరాక్ సాయుధ దళాలలో కలిసిపోయింది. కూటమిలోని కొన్ని గ్రూపులకు ఇరాన్ మద్దతు ఇస్తున్నప్పటికీ వీటిలో చాలా వరకూ స్వతంత్రంగానే వ్యవహరిస్తున్నాయి. అమెరికాసౌదీ ప్రమాదకరమైన దాడులకు పాల్పడుతున్నాయని, ఇరాక్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తున్నాయని, ఇది తమ అధికారిక భద్రతా సంస్థలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పీఎంఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ఇరాక్‌లో ఇరాన్ మద్దతున్న గ్రూపులు తమ చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్ దాడులు చేశాయని, తమ సేనలు వాటిని నిలువరించాయని సౌదీ అంతకుముందు తెలిపింది.

## ప్రశాంతంగా దతియా ఉప ఎన్నిక



**భోపాల్, జులై 30 (ఎ.ఎం.ఎస్):** మధ్యప్రదేశ్ లోని దతియా అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 11 గంటల వరకు సుమారు 32.53 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ, తగిన భద్రతా ఏర్పాట్ల మధ్య నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అంతకుముందు, ఉదయం 9 గంటల వరకు నమోదైన ప్రారంభ పోలింగ్ సరళిలో ఓటింగ్ శాతం 12.94గా ఉంది. ఉదయం 7 గంటలకు అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా మొదలైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. అంతకముందు ఉదయం 5:30 గంటలకు ప్రారంభమైన మాక్ పోల్, 7 గంటల లోపే ముగిసింది. ఓట్ల లెక్కింపు ఆగస్టు 3న చేపడతారు. ఏప్రిల్ 2న కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి అనర్హతకు గురికావడంతో దతియా అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అశుతోష్ తివారీని బరిలోకి దించగా, కాంగ్రెస్ ఘన్‌శ్యామ్ సింగ్‌ను అభ్యర్థిగా నిలిపింది.

## జపాన్‌లో భూకంపం



- 13 మంది మృత్యువాత
- ప్రతిక్షణం విలువైనదేనన్న జపాన్ ప్రధాని

**టోక్యో, జులై 30 :** జపాన్‌లో సంభవించిన భూకంపంలో మరణించిన వారి సంఖ్య 13కు చేరింది. క్షతగాత్రుల సంఖ్య వందలలోనే ఉంది. షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ముగ్గురు, పేపర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అనేక మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. విద్యుత్, మంచినీటి సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యాభై వేలకు పైగా కుటుంబాలు కరెంటు లేక అంధకారంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. సుమారు లక్షన్నర ఆవాసాలకు నీటి సరఫరా బంద్ అయింది. భూకంపం సంభవించిన ప్రాంతంలో బుధవారం 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భూప్రకంపనలు సంభవిస్తాయేమోనన్న భయంతో చాలా మంది మంగళవారం రాత్రి తమ కార్లలోనే నిద్రించారు. తొమ్మిది వేల మందికి పైగా బాధితులను అధికారులు సహాయ శిబిరాలకు తరలించారు. భూకంపం సంభవించిన వెంటనే 200 షాపులున్న ఓ షాపింగ్ మాల్‌లో పేలుడు జరిగింది. ప్రధాన భవనంలోని పై అంతస్తు పాక్షికంగా కూలిపోయింది. భూకంపం సంభవించగానే వినియోగదారులను, సిబ్బందిని హుటాహుటిన ఖాళీ చేయించారు. దక్షిణ ప్రాంతంలోని కుమమోటో ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో భూకంపం సంభవించిందని ప్రధాని సానే టకైచీ బుధవారం తెలిపారు. శిథిలాల కింద చిక్కుబడిన వారి కోసం వేలాది మంది సైనికులు గాలింపు చేపట్టారని, ప్రస్తుత పరిస్థితులలో ప్రతి క్షణం విలువైనదేనని ఆయన అన్నారు. సహాయ కార్యక్రమాల కోసం 2,600 మంది సిబ్బందిని సమీకరించారు. గగనతలం నుంచి నష్టాన్ని అంచనా వేసేందుకు 20 విమానాలను పంపారు. భూకంపం ధాటికి అనేక బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. 2016లో సంభవించిన భూకంపంలో దెబ్బతిన్న ఒక చారిత్రక కోటకు తాజా ఘటనలో మరోసారి నష్టం వాటిల్లింది. భారీ భూకంపం వచ్చిన ప్రాంతాలలో రాబోయే వారం రోజులలో మరింత బలమైన ప్రకంపనలు సంభవించవచ్చునని, కొండ చరియలు విరిగిపడతాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. బుధవారం ఉదయానికి 60కి పైగా ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 14గా నమోదైంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజ

**చీకుపల్లి–పెద్దగొల్లగూడెం దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలిన...**

**– రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు, ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) :**

గోదావరి వరద శాంతించాలనిశనివారం వాజేడు మండలం లోని ముళ్ళకట్ట – పూసూరు వంతెన వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించి గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజ చేశారు. అనంతరం చీకుపల్లి –పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు వంతెన వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్నడైవర్షన్ రోడ్డును పరిశీలించి, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది వరద ప్రవాహంపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బ్యాక్ వాటర్ ద్వారా గ్రామాలు కాలనీలు ముంపుకు గురైతే వెంటనే ఆ కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్



**జనగామ, ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి) :**

ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి. తాగునీరు, స్నాక్స్, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం మరియు అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలి. కార్యక్రమాలు, స్టాల్స్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలి.జిల్లా ప్రగతి సందేశం సీపీఓ, డీపీఆర్ఓ కలిసి జిల్లా అభివృద్ధిపై సందేశ ప్రతిని రూపొందించాలి.భద్రత, అలంకరణ, పోలీస్ బందోబస్తు, పగడ్బందీ బ్యారికేడింగ్, స్టేజ్ అలంకరణ, ప్రముఖులకు ఆహ్వాన పత్రాల పంపిణీ బాధ్యతలను సంబంధిత అధికారులు వేగవంతం చేయాలి.ఈ సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో రవి కిరణ్, సీపీఓ చినకోట్యా నాయక్, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీలు వేగవంతం చేయాలి: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి

**బకాయిలు చెల్లించని మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగం**

**డిఫాల్టర్ల ఆస్తుల జప్తునకు తహసీల్దార్లకు ఆదేశం**



**హనుమకొండ, ఆగస్టు 01 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఎఫ్‌సీఐకి అప్పగించడంలో ఎలాంటి జాప్యం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి స్పష్టం చేశారు. శనివారం రోజున జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పౌర సరఫరాల శాఖ అధికారులు, మానిటరింగ్ అధికారులు మరియు రైస్ మిల్లర్లతో 2025–26 ఖరీఫ్, రబీ సీఎంఆర్ డెలివరీలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ...నిత్యం తనిఖీలు, మానిటరింగ్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు రోజూ మిల్లులను సందర్శించి మిల్లింగ్ వేగం, సీఎంఆర్ సిద్ధం చేస్తున్న తీరుపై నివేదికలు అందించాలని ఆదేశించారు. సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లు పెండింగ్‌లను త్వరగా పూర్తి చేయాలని, రబీకి సంబంధించి ఒక్క ఏసీకే కూడా సమర్పించని మిల్లర్లు వెంటనే మిల్లింగ్ ప్రారంభించాలని సూచించారు. యాక్షన్ ప్యాడీ బకాయిలు చెల్లించని డిఫాల్టర్లపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం కింద చర్యలు తీసుకుని, ఆస్తులు జప్తు చేసే ప్రక్రియను తహసీల్దార్లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.సీఎంఆర్ లక్ష్యాల సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలనిఆయనపేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మహేందర్, ఎఫ్‌సీఐ మేనేజర్ ప్రసన్న కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరియు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ సహిత సంతోషిమాత ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, 01/08/2026**

ఈ రోజు భువనగిరి పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయ సహిత సంతోషిమాత ఆలయంలో ఆలయ చైర్మన్ శ్రీ చాగంటి సురేష్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ఆలయంలో శ్రీ సీతారామాంజనేయ స్వామివారిని, సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ చైర్మన్ శ్రీ చాగంటి సురేష్ గారిని, ఆలయ నిర్వాహకులను ఎమ్మెల్యే గారు అభినందించారు. భక్తులకు సేవ చేయడం గొప్ప పుణ్యకార్యమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, మానవతా విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి–రవికుమార్ గారు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి పోతంశెట్టి మంజుల–వెంకటేశ్వర్లు గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ అవేస్ చిస్తీ గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ కూర వెంకటేశ్ గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సదరం–యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి..కలెక్టర్

**అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం–**

**యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు**



**ఖమ్మం, వుదయం బ్యూరో ఆగస్టు 1:**

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం–యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం– యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. స ద ర ం– యూడీఐ డీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌలిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లాకలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం సదరం–యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం– యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన సదరం కేంద్రం వల్ల ప్రక్రియ మరింత క్రమబద్ధీకరించబడిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం– యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ జీఓలను తక్షణమే రద్దు చేయాలి

**రాష్ట్ర కేబినెట్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి**

**మాల మహానాడు ప్రతినిధి బృందం వినతిపత్రం**



**నల్గొండ, జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 1**

నల్గొండ జిల్లా కేంద్రంలో పర్యటించిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం మరియు దానికి అనుబంధంగా జారీ చేసిన జీఓల వల్ల మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ, వాటిని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మాల మహానాడు ప్రతినిధి బృందం శనివారం నల్గొండలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమల్లో ఉన్న షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం–2025 (చట్టం 15/2025) మరియు ప్రభుత్వం జారీ చేసిన జి ఓ ఎం ఎస్ నెంబర్ నోఇం 9, 10, 99 వల్ల మాల మరియు దాని 25 ఉపకులాలకు తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. సమాన సామాజిక న్యాయం పేరుతో అమలు చేస్తున్న ఈ విధానం ఆచరణలో మాల యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభ రోస్టర్ పాయింట్లలో మాలలకు అవకాశం లేకపోవడం అన్యాయం 100 పాయింట్ల రోస్టర్ విధానంలో త్వరగా ఉద్యోగ అవకాశాలు వచ్చే ప్రారంభ రోస్టర్ పాయింట్లలో మాల సామాజిక వర్గానికి ఎక్కడా ప్రాతినిధ్యం కల్పించలేదని తెలిపారు. ముఖ్యంగా గ్రూప్–IIIకు మొదటి రోస్టర్ పాయింట్‌ను 22వ స్థానంలో కేటాయించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. అనంతరం 41, 62, 77, 91 పాయింట్లలో మాత్రమే అవకాశం కల్పించడం వల్ల చిన్న సంఖ్యలో వెలువడే నోటిఫికేషన్లలో మాల అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయిందని వివరించారు చిన్న నోటిఫికేషన్లలో మాల యువతకు అవకాశం లేకుండా పోతోందిపోలీస్ శాఖ నియామకాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మరియు వివిధ ప్రభుత్వ శాఖల్లో 5 నుంచి 15 పోస్టుల మధ్య వెలువడే నోటిఫికేషన్లలో మాల అభ్యర్థులకు అవకాశం లేకుండా పోతోందని తెలిపారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(4), 16(4)లలో పేర్కొన్న సమాన అవకాశాల స్ఫూర్తికి విరుద్ధమని, ఆచరణలో "రివర్స్ డిస్క్రిమినేషన్"కు దారితీస్తోందని పేర్కొన్నారు.మాల మహానాడు ప్రధాన డిమాండ్లుశాస్త్రీయ ఆధారాలు లేకుండా తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ జీఓలను తక్షణమే రద్దు చేయాలి.రోస్టర్ పాయింట్లను పునఃపరిశీలించి, 1 నుంచి 16 పాయింట్లలోపే మాల సామాజిక వర్గానికి (గ్రూప్–III) కనీసం రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలి.రోస్టర్ పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యే వరకు రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లను తాత్కాలికంగా నిలిపివేయాలి.ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాలలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాల మహానాడు ప్రతినిధులు కోరారు. వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి లింగమయ్య రాష్ట్ర కార్యదర్శి ఎన్నమల్ల అనిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతపల్లి బాలకృష్ణ రాష్ట్ర కమిటీ మెంబర్ చిలుకూరి అభినవ్ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిచింతపల్లి వెంకన్న జిల్లా నాయకులు అనుముల పూరి సుధాకర్ జిల్లా నాయకులురావిరాల వరప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులుబోగరి రవీందర్ నాయకులు ఎర్రమళ్ళ ప్రభాకర్ ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక.. అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం

**భద్రాచలం వద్ద 56 అడుగులకు చేరిన నీటిమట్టం**

**– క్షేత్రస్థాయిలో వరద పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 01( వుదయం ప్రతినిధి)**

భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయం 10 గంటలకు గోదావరి నీటి మట్టం 56.00 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం 15,90,778 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఉదయం భద్రాచలంలోని గోదావరి స్నాన ఘాట్లు, కరకట్ట ప్రాంతం, భద్రాచలం–కూనవరం ప్రధాన రహదారి వెంట వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం, పెరుగుతున్న నీటిమట్టం, ప్రభావిత గ్రామాల పరిస్థితి, సహాయక చర్యల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలివరద ప్రభావిత లోతట్టు ప్రాంతాల ప్రజలను టామ్‌టామ్, మైకింగ్ ద్వారా నిరంతరం అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలకు పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రజలను ఆలస్యం చేయకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఎవరూ తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.పునరావాస కేంద్రాల్లో తాగునీరు, నాణ్యమైన భోజనం, పారిశుద్ధ్య వసతులు, విద్యుత్, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి పునరావాస కేంద్రంలో వైద్య బృందాలు, తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.వరద ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలుఅనంతరం భద్రాచలం–కూనవరం ప్రధాన రహదారి వెంట వరద ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్, వరద నీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు బ్యారికేడ్లను దాటి ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా పోలీసులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించారు.ప్రజలు గోదావరి నదిలో స్నానాలు చేయడం, ఈత కొట్టడం, వరద నీటిలోకి వెళ్లడం, ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, వంతెనలు, కరకట్టలు, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లడం వంటి చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. వరద నీటిలో చేపలు పట్టేందుకు లేదా పడవల ద్వారా ప్రయాణించేందుకు ఎవరూ ప్రయత్నించరాదని సూచించారు.అధికారిక సమాచారాన్నే నమ్మాలివదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా 24×7 ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 08744–241950 లేదా వాట్సాప్ నంబర్ 9392919743ను సంప్రదించాలని సూచించారు.విద్యుత్ తీగలు నీటిలో పడిన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులను వరద నీటి సమీపానికి వెళ్లనివ్వవద్దని, పశువులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలు అవసరమైన మందులు, తాగునీరు, ముఖ్యమైన పత్రాలు, ఇతర అవసరమైన వస్తువులను వెంట తీసుకుని సురక్షిత పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యలను విస్తృత స్థాయిలో కొనసాగిస్తున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించి సూచనలను తప్పనిసరిగా పాటిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## పిల్లలను చదివించి బంగారు భవిష్యత్తు ఇవ్వండి" - ఎస్పీ నరసింహ

**- ఆపరేషన్ ముస్కాన్ ముగింపు సభలో పిలుపు**



**సూర్యాపేట ఆగస్టు1, వుదయం ప్రతినిధి**

జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించిన 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి కె.నరసింహ ఐపిఎస్ గారు సంబంధిత బృందాలతో సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ లో బాగా పని చేసి ఎక్కువ మంది పిల్లలను సంరక్షించిన సిబ్బందిని అభినందించారు.ఆపరేషన్ ముస్కాన్ ఫలితాలు127 మంది బాలల గుర్తింపు వెట్టిచాకిరి, నిరాదరణకు గురవుతున్న 127 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించారు. – తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు: 56 మంది వీరిలో 52 మంది బాలురు, 4 మంది బాలికలు – ఇతర రాష్ట్రాలకు చెందిన వారు: 71 మంది వీరిలో 65 మంది బాలురు, 6 మంది బాలికలు90 కేసులు నమోదు బాలలను వెట్టిచాకిరికి గురిచేసిన వారిపై చట్టపరంగా 90 కేసులు నమోదు చేశారు."ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నాం. జిల్లా పోలీసు, సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాం" అని తెలిపారు."బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించి బాలల వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. బాలల రక్షణ కోసం పోలీసు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. వెట్టిచాకిరికి గురిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు."ప్రభుత్వాలు ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను చదివించి బంగారు భవిష్యత్తు ఇవ్వాలి" అని విజ్ఞప్తి చేశారు.పాల్గొన్న వారుఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, డిసిఆర్బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దుం అలీ, మహిళా ఎస్ఐలు మౌనిక, నీలిమ, చైల్డ్ సంరక్షణ అధికారులు శ్రీలక్ష్మి , ఉమామహేశ్వరి, నాగుల మీరా, నాగరాజు, వంశీ, విద్యాసాగర్, ముస్కాన్ బృందం ఎస్ఐ మల్లేశం, రహిముద్దిన్, ఏఎస్ఐ వెంకన్న, ఏఎస్ఐ సైదాబి, లేబర్ శాఖ సిబ్బంది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతిని చాటిన ఆదర్శ హైస్కూల్ బోనాల వేడుకలు

**ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి):**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు విద్యార్థుల్లో మన సంస్కృతిపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకల్లో అమ్మవారి వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మట్టి కుండల్లో బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాల నడుమ పాఠశాల నుంచి లక్ష్మీదేవర ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల పాటలకు అనుగుణంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు బోనాల పండుగ విశిష్టతను తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలకే కాదు.. గడువులోపు పనులు పూర్తి చేయడమే మా లక్ష్యం.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**కాజిపేట్/ వరంగల్ ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి):**

ప్రతి డివిజన్ అభివృద్ధే ధ్యేయం.. ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే నాయిని...రూ.1.49 కోట్లతో 49వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే నాయిని...తేదీ :01/08/2026–శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం.వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్ పరిధిలో సుమారు రూ.1.49 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, తాము కేవలం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసే రాజకీయాలకు పరిమితం కాదని, ప్రతి పనిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయించడమే తమ లక్ష్యమని అన్నారు. వారం, పది రోజులు లేదా నెల రోజులకు మించకుండా పనులను పూర్తి చేసేలా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే నాయిని,తాను ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నానని చెప్పారు. ప్రతి డివిజన్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు.

## తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమే: కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 01(వుదయం జిల్లా ప్రతినిధి):**

తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వడమేనని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శ నివారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సుస్థిరమైన జీవితం ప్రారంభానికి తల్లిపాలు ఫలితాలను ఇచ్చే చర్యలను మరింత బలోపేతం చేయడం అనే థీమ్‌తో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతాయని, అలాగే వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పించి తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖలసిబ్బంది పరస్పర సమన్వయంతో ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలు మరియు కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలనే ఇవ్వడం, తదుపరి సమయానుకూలంగా పోషకాహారం ఇవ్వడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ యోచన తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## *ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ తొలి జత యూనిఫాంలు అందించాలి : కలెక్టర్

**ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.15 లక్షలకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణం అందేలా ప్రణాళిక రూపొందించాలి**

**ప్రతి వి.ఓ పరిధిలో రెండు ఫామ్‌పాండ్లు, ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళ ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి**



**పెద్దపల్లి, ఆగస్టు-01 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత పాఠశాల యూనిఫాంలను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల యూనిఫాంల కుట్టింపు, పంపిణీ, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై సెర్ప్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత యూనిఫాంలను ఈ నెల 15వ తేదీలోగా అందించేలా అన్ని చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు ఇప్పటికే యూనిఫాంల పంపిణీ పూర్తయిందని, నిర్ణీత గడువులో నాణ్యమైన యూనిఫాంలను అందించిన స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ఎలాంటి జాప్యం లేకుండా యూనిఫాంలు అందించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థిరత్వానికి బ్యాంక్ లింకేజ్ రుణాల సకాల చెల్లింపులు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ సంఘం కూడా నిరర్థక ఆస్తి (ఎన్పీఏ)గా మారకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.15 లక్షలకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణం లభించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సూచర్ ఎలినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామ సంఘం (వి.ఓ) పరిధిలో కనీసం రెండు ఫామ్‌పాండ్స్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలి ఇంటిలో ఒక ఇంకుడు గుంత ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల పెంపుకు ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళలకు వివరించాలని ఆదేశించారు.ప్రతి 10 వేల గ్రూపుల క్లస్టర్‌కు ఒక బుక్‌కీపర్‌ను ఏర్పాటు చేసి వారికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించేందుకు బుక్‌కీపర్ల సామర్థ్యాన్ని మరింత పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఏ రవీందర్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ దుర్గాప్రసాద్, ఏపీఎంలు, సెర్ప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి...

**రాయికల్ పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ: జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**



**రాయికల్/జగిత్యాల, ఆగస్టు 01 (వుదయం విలేకరి)**

జిల్లాలోని ప్రజలకు ప్రభుత్వ వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంను శనివారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపి సేవలు ఐపీ సేవలు రికార్డ్ ల్యాబ్ రికార్డ్, ఐపీ రికార్డ్, మెడికల్ ఫార్మసి పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు మెరుగు పరచాలని డాక్టర్లు సమయపాలన పాటించాలని ఆసుపత్రిలో అటెండెన్స్ బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు రోజుకు ఎన్ని ఓపి లను చూస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్స్పైర్ అయినటువంటి మెడిసిన్ ఉండకుండా చూసుకోవాలన్నారు డాక్టర్లను పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని వున్న మంచినీటి సౌకర్యాలు ఎప్పటికప్పుడు నాణ్యతమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలి ఆదేశించారు ఈ పరిశీలనలో జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ ఎమ్మార్వో ఎంపిడివో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయం

**- ఆరోగ్య పాఠశాల లక్ష్యాలను పక్కాగా అమలు చేయాలి- కలెక్టర్**



**ఆదిలాబాద్, ఆగస్టు 1:**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. స్థానిక కేఆర్కే కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం, నూతన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరంలో ఉండే 220 పనిదినాల్లో ప్రతి విద్యార్థి కనీసం 200 రోజులు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగలు, శుభకార్యాలకు కేటాయించిన సమయాన్ని మినహాయించి మిగతా రోజుల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైతే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన సామర్థ్యాలు మెరుగుపడటంతో పాటు పదో తరగతిలో మంచి ఫలితాలు, గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగితే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ ప్రత్యేక సర్దుబాటు ద్వారా అదనపు ఉపాధ్యాయుడిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాలపై ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేందుకు మధ్యాహ్న వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలను 'ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాల'గా తీర్చిదిద్దాలని ఆదేశించారు.ప్రతిరోజూ నిర్వహించే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తూ విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచాలని అన్నారు. విద్యార్థుల పోషకాహారం కోసం త్వరలోనే మధ్యాహ్న భోజనంతో పాటు హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.విద్యార్థులు గుట్కా, గంజాయి, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాలకు బానిసలైన వారిని గుర్తించి రిమ్స్‌లోని డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా ఉచిత చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే నీలిరంగు యూనిఫాంలు విద్యార్థులకు సరిగ్గా సరిపోయేలా స్వయం సహాయక సంఘాల టైలర్ల ద్వారా అవసరమైన మార్పులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, అధికారులు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలోని అంశాలపై పాటలు, ప్రసంగాలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను కలెక్టర్ శాలువాలతో సత్కరించి అభినందించారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాలకు సీసీ కెమెరాలను విరాళంగా అందించిన మౌనీష్, శ్రీకాంత్ సేవలను ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, కౌన్సిలర్లు రజిత, మాన్కర్ నాక్సేన్, ఆరోగ్య పాఠశాల పర్యవేక్షకులు అజయ్, కాంప్లెక్స్ హెచ్ఎం సాధన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్, ఏఏపీసీ చైర్మన్ రజియా సుల్తానా, దాతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలనీ వాసులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి రూపురేఖలు మారుస్తాం

**ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యం**

**దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మర మ్మతులు**

**2027 జనవరి 27 నాటికి అక్కపెల్లి లిఫ్ట్ ద్వారా నీరు అందిస్తాం**

**విద్యుత్, సాగునీరు పై కాంగ్రెస్ సర్కార్ ఫోకస్**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**ధర్మపురి ఆగస్ట్01 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పనులపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించా రు.ప్రజా భద్రత,సాగునీరు, విద్యుత్ సౌకర్యాల మెరుగుదలే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోం దని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.భారీ వర్షాలకు కొట్టుకు పోయిన ధర్మపురి మండలం తుమ్మేనాల,నర్స య్యపల్లె రహదారిని అధికా రులతో కలిసి మంత్రి పరిశీలించారు.రాకపోకలకు అంతరా యం కలగకుండా తక్షణమే తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని, అనంతరం శాశ్వత పునర్నిర్మా ణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ప్రమాదకర ప్రాంతా ల్లో ప్రజలను అప్రమత్తం చేయా లని ఆదేశించారు.వెల్గటూర్ మండలం స్తంభంపల్లి చెరువు ను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు గోదావరి పక్కనే ఉన్న ధర్మపురి రైతుల అవస రాలను పట్టించుకోలేదని విమర్శించారు.రోళ్లవాగు,అక్కపెల్లి లిఫ్ట్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశా రని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేశామని, 2027 జనవరి 27 నాటికి అక్కపల్లి లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. స్తంభంపల్లి చెరువు మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటిం చారు.గొల్లపల్లి మండల కేంద్రం లో రూ.74 లక్షలతో చేపట్టను న్న 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల షిఫ్టింగ్ పనులను మంత్రి ప్రారంభించారు.నియోజక వర్గం లో విద్యుత్ మౌలిక వసతుల కోసం రూ.4 కోట్లు మంజూరు కాగా, ఒక్క గొల్లపల్లి మండలక్కే రూ.2.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

పనులను నాణ్యత తో, నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదే శించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**వరద నీటి చేరికపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష**



**నిజామాబాద్, ఆగస్టు 01 :**

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాం సాగర్ రిజర్వాయర్ ను శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐ.టీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని (ఇన్ ఫ్లో) పరిశీలించారు. రిజర్వాయర్లో నీటి మట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టుకు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువన గల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు కడెం తదితర ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీలో నీటి మట్టం పెరిగిందని అధికారులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికిప్పుడు వర్షాలు నిలిచిపోయినా, మరో 48 గంటల వరకు వరద నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం1091.00 అడుగులు, 80 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1072.30 అడుగులు, 27.376 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నం సమయానికి85వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను బట్టి ఆయకట్టు పంటలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలని అన్న విషయమై రెండు మూడు రోజులలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయితే, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే ఎస్సారెస్పీలో ఈసారి కొంత తక్కువ మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్ లో 38 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 27 టీఎంసీలకే పరిమితం అయ్యిందన్నారు. నిజానికి 112 టీఎంసీల పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించబడిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సారెస్పీ లో పూడిక తొలగింపు ప్రక్రియను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయమై అతి త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. కాగా,కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ, శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులు దశాబ్దాల కాలంగా చెక్కు చెదరకుండా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వ హయాంలో 2019లో నిర్మించిన మేడిగడ్డ,సుందిల్ల, అన్నారం బ్యారేజీలు మాత్రం 2022 నాటికే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ ఆక్షేపించారు. వీటి అవసరం లేకుండానే ఎల్లంపల్లి రిజర్వాయర్ లోకి 20 టీఎంసీ ల నీరు వచ్చి చేరిందని అన్నారు. మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పై బ్యారేజీలలో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారని, అన్ని విషయాలను శాస్త్రీయంగా, సాంకేతికపరంగా సమగ్ర పరిశీలన జరిపి మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ బ్యారేజీల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇటీవల ఢిల్లీలో అత్యున్నత స్థాయిలో జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, కేంద్ర జల సంఘం సమావేశాల్లోనూ ఏకీభవించడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆక్షేపించారు. మేడిగడ్డ పంప్ హౌజ్ ల ద్వారా గత ప్రభుత్వం 60 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే ఒక్క కరెంట్ బిల్లు రూపంలోనే 3వేల కోట్ల రూపాయల ఛార్జీలు అయ్యాయని అన్నారు. పంప్ హౌజ్ ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే బ్యారేజీలను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రజాధనం వృధా చేసిన వారే, ప్రస్తుతం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రులకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీ.పీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీ.ఈ సునితాదేవి తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుని ఆలయ సీనియర్ అసిస్టెంట్‌గా వావిలాల తిరుపతికి పదోన్నతి

**ఉత్తర్వులు అందజేసిన మంత్రి అడ్లూరి**



**ధర్మపురి, ఆగస్ట్02 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వా మి వారి దేవస్థానంలో జూని యర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వావిలాల తిరుపతికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఇటీవల ఆలయంలో ఖాళీగా ఏర్పడిన సీనియర్ అసిస్టెంట్ పోస్టులో ఆయనకు ప్రమోషన్ కల్పిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల ప్రతిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం తిరుపతికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానంకార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్



**నిర్మల్ జిల్లా 1 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

కడెం ప్రాజెక్టు సందర్శన కోసం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్ద పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ సాయి కిరణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పలు ప్రజా సంక్షేమ అంశాలపై సమీక్ష

**సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలు, దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ జిల్లా ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన ఐడిఓసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల జిల్లా అధికారులు, కామారెడ్డి జిల్లా దివ్యాంగుల సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, మైనారిటీ, బీసీ, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలకు ఆవిరితో ఉడికించిన బియ్యం (స్టీమ్ రైస్) సరఫరా, విద్యాసంస్థలకు గ్యాస్ సిలిండర్ల సరఫరా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు కొత్త చౌక ధరల దుకాణాల ఏర్పాటు, ఈ-కేవైసీ నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ, దీపం పథకం ప్రయోజనాల బదిలీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి, వారికి అవసరమైన సేవలు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ-కేవైసీ నమోదులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నిత్యావసర సరుకులు,ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టళ్లు, ప్రభుత్వ విద్యాసంస్థలకు నాణ్యమైన ఆవిరితో ఉడికించిన బియ్యం, గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు చౌక ధరల దుకాణాల కేటాయింపు ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిగణించి, సంబంధిత శాఖలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకత, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి, ట్రైనింగ్ కలెక్టర్ రవితేజ, డీఎం శ్రీకాంత్, రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రిని మర్యాదపూర్వకముగా కలిసి మొక్క అందజేసిన కలెక్టర్



**మంచిర్యాల/ఆగష్టు 01 (వుదయం ప్రతినిధి)**

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటిమట్టం, ప్రాజెక్టు సామర్థ్యం అంశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, ఆహార - పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, అధికారులతో కలిసి రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని మర్యాద పూర్వకముగా కలిసి మొక్కను అందజేశారు.

## పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు కసరత్తు

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 1 (వుదయం ప్రతినిధి):**

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో మొత్తం 549 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో వేములవాడ నియోజకవర్గంలో 262, సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు జిల్లాలో లేవని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ గడువు పొడిగింపు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ప్రక్రియ వేగంగా సాగుతోందని, ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 87.42 శాతం పూర్తయిందని వెల్లడించారు. 17న ముసాయిదా జాబితా..ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

**నారాయణపేట ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి)**

బిజీవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజీవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం, విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ కోసం పోరాడు తున్న నిరుద్యోగులను సీఎం రేవంత్ రెడ్డి క్రిమినల్స్ అంటూ,అడ్డా మీది కూలీలు అంటూ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం స్థానిక నారాయణపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసినట్లు పేర్కొన్నారు. సీఎం స్థాయిలో ఉండి విద్యార్థులను క్రిమినల్స్ అనడం సిగ్గుచేటు అని అన్నారు.రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రసిడెంట్ మణి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, మణి మోడీ, ప్రకాష్, చేతన్, శ్రీకాంత్, అరవింద్, అన్వేష్, పోలమోని శివ,కురుమూర్తి యాదవ్, చక్రి, చరణ్ దాస్, రవి, వెంకటేష్, సాయి కృష్ణ, పాల్గొన్నారు తదితరులు.

## నేటి బాలలే రేపటి పౌరులు -సెక్రెటరీ శ్రీదేవి



**నాగర్ కర్నూల్, ఆగస్టు 01 : (వుదయం ప్రతినిధి):**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు జిల్లా విద్యా శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ. శ్రీదేవి, సెక్రెటరీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హాజరై మాట్లాడారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు పిల్లలను సరైన మార్గంలో నడిపించడానికి గొప్ప అవకాశం ఉంది అని అన్నారు. నేటి బాలలే రేపటి భారత పౌరులు కాబట్టి బాల్య దశ నుండే ఉన్నత విలువలతో వారిని తీర్చిదిద్దాలని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బాధ్యతల గురించి వివరిస్తూ... పిల్లల హక్కులను కాపాడటం, బాల కార్మికులు, హింస లేదా వేధింపులకు గురైన పిల్లలను రక్షించడం, వారికి న్యాయం అందించడం వారి ప్రధాన బాధ్యత అని తెలిపారు. బాలల చట్టాలపై అవగాహన కల్పించడం, ఆపదలో ఉన్న పిల్లలను ఆదుకోవడం, పునరావాసం కల్పించడం చేయాలన్నారు. ఆపదలో ఉన్న, నిరాశ్రయులైన లేదా హింసకు గురైన పిల్లలను గుర్తించి తక్షణ రక్షణ కల్పించాలని, పాఠశాలలు మరియు సమాజంలో పిల్లల హక్కులు, చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీసు శాఖ, శిశు సంక్షేమ కమిటీ మరియు ఇతర అధికారులతో కలిసి పనిచేసి బాధితులకు సహాయం అందించాలని, నిరాశ్రయ పిల్లలకు ఆశ్రయం, విద్య మరియు వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు.ప్రతి పాఠశాలలో వారానికి ఒకసారి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. శ్రీనిధి, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్, పాండు నాయక్, ఇంచార్జ్ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, శ్రీ కిరణ్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, శ్రీరామ్ ఆర్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ _, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, జువెనైల్ జస్టిస్ బోర్డు అధికారులు, అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ XII విజయవంతం

**మహబూబ్‌నగర్ జిల్లా 01ఆగస్టు (వుదయం బ్యూరో)**




మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-XII కార్యక్రమం విజయవంతం పూర్తయిందని జిల్లా ఎస్పీ డి. జానకి, IPS తెలిపారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించడం, వారికి సురక్షితమైన భవిష్యత్తు కల్పించడం లక్ష్యంగా జిల్లా పోలీసులు సంబంధిత ప్రభుత్వ శాఖలు, చైల్డ్‌లైన్ మరియు ఇతర విభాగాలతో కలిసి విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 01.07.2026 నుండి 31.07.2026 వరకు నోడల్ అధికారి అదనపు ఎస్పీ NB రత్నం పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో జిల్లాలో మొత్తం 80 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు. వీరిలో 76 మంది బాలురు, 4 మంది బాలికలు ఉండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 79 కేసులు (FIRలు) నమోదు చేయడం జరిగిందని, రక్షించిన చిన్నారులను సంబంధిత అధికారుల సమక్షంలో వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షకులకు అప్పగించినట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఆపరేషన్ ముస్కాన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తు పొందేలా అన్ని శాఖలతో సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్-XII కార్యక్రమాన్ని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో విజయవంతం నిర్వహించడంలో నెలరోజుల పాటు అంకితభావంతో పనిచేసిన డివిజనల్ బృందానికి చెందిన SI లెనిన్, ASI విలియం మార్క్, PC శ్రీహరి, PC శివకుమార్, WPC శిల్ప, అలాగే చైల్డ్‌లైన్ ప్రతినిధులు అంజాద్, RDS విజయభారతి.మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (AHTU) సిబ్బంది WASI సక్రీ, WHC జ్యోతి, PC వరప్రసాద్, సబ్ చిన్నమ్మతో పాటు సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



- షేక్ అస్లాం షరీఫ్

**వడ్డేపల్లి, ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి)**

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి మండల కేంద్రం శాంతినగర్‌లో శాంతినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్ బీసీ హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుడికి ప్రత్యేక స్థానం ఉంటుందని, అందరూ స్నేహభావంతో మెలగాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అనంతరం బీసీ హాస్టల్ వార్డెన్ మంజునాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరమేష్, రిహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం నైచ్యపు వ్యాఖ్యలు!

- తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని 'కమలం' సమరశంఖం
- విద్యార్థి లోకం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం: రామాంజనేయులు
- బీజేవైఎం శ్రేణుల హోరాహోరీ పోరుతో పాత బస్టాండ్ వద్ద ఉద్రిక్తత

**గద్వాల ఆగస్టు 01 (వుదయం బ్యూరో)**



భావి భారత నిర్మాతలైన ఇంజినీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్స్', 'వేస్ట్' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబోధించడం ఆయన అహంకార పూరిత వైఖరికి నిదర్శనమని, దీనిపై సీఎం వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని లక్ష్మీనరసింహ స్వామి సాక్షిగా శపథం పూనుతూ బీజేపీ ధ్వజమెత్తింది. బాధ్యతాయుతమైన సర్కార్ పీఠంపై కూర్చుని లక్షలాది మంది విద్యార్థుల ఆత్మగౌరవాన్ని మట్టిపాలు చేసేలా మాట్లాడటం దారుణమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.రామాంజనేయులు తీవ్రంగా మండిపడ్డారు. మండిపడ్డ కమల దళం.. రగిలిన వైఎస్సార్ చౌక్ ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి నాయకత్వంలో శనివారం పాత బస్టాండ్ వైఎస్సార్ చౌక్ ప్రాంగణం నిరసన హోరెత్తింది. ప్రభుత్వం, సీఎం వైఖరికి వ్యతిరేకంగా కార్యకర్తలు గగనమే హద్దుగా నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పోలీసు యంత్రాంగం నిరసనకారులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయి నెట్టివేత, తోపులాట జరిగి పాత బస్టాండ్ పరిసరాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే..

ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. ఎన్నికల వేళ యువతకు కోటానుకోట్ల హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్, నేడు వాటిని గాలికి వదిలేసిందని విమర్శించారు. "వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నిలిపివేసి విద్యార్థుల భవిష్యత్తును త్రిశంకు స్వర్గంలో పడేసారు. నిరుద్యోగ భృతి లేదు.. కొత్త ఉద్యోగాల ప్రసక్తి లేదు.. నాణ్యమైన విద్య దేవుడెరుగు! తమ పరిపాలనా వైఫల్యాలు, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులపై ఇటువంటి నిందలు మోపుతున్నారు" అని నిప్పులు చెరిగారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం!

రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన ఇంజినీరింగ్ విద్యార్థుల గౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని, ఈ వ్యవహారంపై సీఎం బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన జ్వాలలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, కౌన్సిలర్ శాలన్న, సీనియర్ నాయకులు మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, రజక నరసింహ, తిమ్మన, బీజేవైఎం నేతలు పటేల్ పాండు, గాంజ సాయి, సతీష్, లడ్డు రాజు, సంఘాల పవన్ తదితర ముఖ్య నేతలు, శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం

- ప్రతి అర్హత గల ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, ఆగస్టు 01:-వు దయం.**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ ఫారాలను సమర్పించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆగస్టు 10 లోపు తమ ఫారాలను సంబంధిత బీఎల్వోలకు తప్పనిసరిగా సమర్పించాలని కోరారు.అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా ఆగస్టు 10నాటికి పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17, 2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16వరకు ఓటర్లు క్లెయిమ్స్, అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు.స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిష్కార ప్రక్రియ చేపట్టనున్నట్లు, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని వెల్లడించారు. జిల్లాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలన్నారు.బీఎల్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## అనుమతి లేని సెలవు.. ఉద్యోగానికే ఉరి!

- జీవో-9తో తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయం
- ఏడాది పాటు అనధికార గైర్హాజరు అయితే నేరుగా తొలగింపు
- ఐదేళ్లు విధులకు దూరంగా ఉన్నా సర్వీస్‌కు గుడ్‌బై
- డైస్-నాన్‌తో పాటు ఉద్యోగానికే ముప్పు

**వికారాబాద్ ఆగస్టు 1 (వుదయం బ్యూరో)**



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళ్లే ధోరణికి తెలంగాణ ప్రభుత్వం గట్టి బ్రేక్ వేసింది. విధుల్లో క్రమశిక్షణ, బాధ్యత, పారదర్శకత పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్-1991లోని రూల్-9, రూల్-25లకు కీలక సవరణలు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ జీవో నెం.9ను అమల్లోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే ఇకపై అది సాధారణ తప్పిదంగా కాకుండా తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణించనున్నారు. అనధికారిక గైర్హాజరు కొనసాగితే చివరికి ఉద్యోగమే కోల్పోయే పరిస్థితి తలెత్తనుంది. ఇప్పటి వరకు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై డైస్‌నాన్ నిబంధనను అమలు చేసేవారు. ఆ కాలానికి వేతనం చెల్లించరు. సర్వీస్ కాలంగా కూడా పరిగణించరు. వార్షిక ఇంక్రిమెంట్లు, సెలవుల అర్హత, పెన్షన్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాల లెక్కింపులో ఆ కాలాన్ని మినహాయించేవారు. అయితే తాజా జీవో-9తో ప్రభుత్వం మరింత కఠిన వైఖరి అవలంబించింది. ఇకపై కేవలం వేతనం కోల్పోవడమే కాదు, కొన్ని పరిస్థితుల్లో ఉద్యోగమే కోల్పోయేలా నిబంధనలను రూపొందించింది.

ఏడాది గైర్హాజరు.. ఉద్యోగానికి ముగింపు కొత్త నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందకుండా లేదా సెలవు మంజూరు కాకుండానే వరుసగా ఒక సంవత్సరం కంటే ఎక్కువకాలం విధులకు గైర్హాజరైతే సంబంధిత ఉద్యోగిని నేరుగా సర్వీస్ నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలం విధులకు దూరంగా ఉండి తర్వాత తిరిగి వచ్చి విధుల్లో చేరే అవకాశాలకు కూడా ఈ నిబంధనలతో దాదాపు తెరపడినట్టే. ఐదేళ్ల గైర్హాజరు కూడా ప్రమాదమే సెలవు మంజూరైనా, మంజూరు కాకపోయినా వరుసగా ఐదేళ్లకు పైగా విధులకు దూరంగా ఉంటే కూడా ఉద్యోగిని సర్వీస్ నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దీర్ఘకాలంగా విధులకు దూరంగా ఉంటూ ఉద్యోగాన్ని కొనసాగించే అవకాశం ఇకపై ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**డిప్యూటేషన్ గడువు దాటినా చర్యలు**

విదేశీ సంస్థలు లేదా ఇతర సంస్థల్లో ఫారిన్ సర్వీస్ డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తిరిగి విధుల్లో చేరాల్సి ఉంటుంది. అనుమతించిన గడువును మించి కొనసాగితే వారిపైనా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకొని సర్వీస్ నుంచి తొలగించే అవకాశం ఉంటుంది.ముందు నోటీసు... తర్వాతే తుది నిర్ణయంఉద్యోగిపై వెంటనే చర్యలు తీసుకోకుండా సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ముందుగా షోకాజ్ నోటీసు జారీ చేస్తారు. ఉద్యోగి తన వివరణను లిఖితపూర్వకంగా సమర్పించుకునే అవకాశం ఉంటుంది. అవసరమైతే విచారణ నిర్వహించి, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారు. ఉద్యోగి అనధికార గైర్హాజరును ప్రభుత్వం తీవ్రమైన దుష్ప్రవర్తనగా పరిగణించనున్నట్లు జీవోలో స్పష్టం చేసింది. లీవ్ లెటర్ ఒక్కటే సరిపోదుచాలామంది ఉద్యోగులు కేవలం సెలవు దరఖాస్తు సమర్పించి విధులకు హాజరుకాకపోవడం ఆనవాయితీగా మారింది. అయితే ఇకపై అలాంటి విధానం చెల్లదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత అధికారి నుంచి స్పష్టమైన అనుమతి లేదా సెలవు మంజూరు ఉత్తర్వులు వచ్చిన తర్వాతే విధులకు దూరంగా ఉండాలని సూచించింది. అనుమతి లేకుండా సెలవుపై వెళ్లడం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించింది.పరిపాలనలో క్రమశిక్షణే లక్ష్యంప్రభుత్వ శాఖల్లో సమర్థవంతమైన పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగుల హాజరు, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ అత్యంత కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. అనధికార గైర్హాజరు కారణంగా ప్రభుత్వ సేవలు దెబ్బతినకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల ఆకస్మిక తనిఖీ

- వర్షా ల నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి

**సంగారెడ్డి వుదయం**



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సదాశివపేట మండలంలోని పాఠశాలల భద్రతా పరిస్థితులను పరిశీలించేందుకు అధికారుల బృందం నేడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.ఈ తనిఖీల్లో తహసిల్దార్ జి. హరిచంద్ర ప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి పి. అంజనీ దేవి,సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. వెంకటేష్, మరియు మండల విద్యాధికారి ఎన్. శంకర్* పాల్గొన్నారు.అధికారుల బృంద ప్రాథమికోన్నత పాఠశాల మద్దికుంట ఇంగ్లీష్ , ఉర్దూ మీడియం పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాల మెలిగిరిపేట, ప్రాథమిక పాఠశాల నాగులపల్లి పాఠశాలలను సందర్శించి ప్రతి పాఠశాలలో తరగతి గదుల పైకప్పులు, గోడలు, పాఠశాల ఆవరణ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న గదులగురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.శిథిలావస్థలో ఉన్న గదులను గుర్తించి, వాటిని వెంటనే మూసివేసి విద్యార్థుల రాకపోకలకు వినియోగించవద్దని ఆదేశించారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు అవసరమైన భద్రతా సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షాల సమయంలో విద్యార్థుల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలని, విద్యుత్ తీగలు మరియు ప్రమాదకర ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యా బోధనకు ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైతే తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నామని మండల విద్యాధికారి ఎన్ శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పేట హజ్ సొసైటీ ప్రతినిధి బృందం తెలంగాణ హజ్ కమిటీకి వినతి

**నారాయణపేట టౌన్, ఆగస్టు 01 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు హాజీ మహ్మద్ అమిరుద్దీన్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి హాజీ ఉస్మాన్ ఉబైదుల్లా సిద్దిఖీ ముజాహిద్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో తెలంగాణ హజ్ కమిటీ అసిస్టెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ ఇర్ఫాన్ షరీఫ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు.హజ్ 2027 కోసం నారాయణపేట జిల్లా నుంచి మొత్తం 37 మంది హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోగా, లాటరీ ద్వారా 11 మంది మాత్రమే ఎంపికయ్యారని, మిగిలిన 26 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నారని ప్రతినిధి బృందం వివరించింది. వెయిటింగ్ లిస్టులో ఉన్న ఈ 26 మంది యాత్రికులకు కూడా హజ్‌కు వెళ్లే అవకాశం కల్పించాలని కోరినట్లు వారు తెలిపారు.దీనికి స్పందించిన అసిస్టెంట్ సీఈఓ మహ్మద్ ఇర్ఫాన్ షరీఫ్ మాట్లాడుతూ వెయిటింగ్ లిస్టులో ఉన్న నారాయణపేట జిల్లా యాత్రికులందరికీ ఇన్‌షా అల్లాహ్ అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. 20 రోజుల హజ్ ప్యాకేజీని ఎంపిక చేసుకున్న యాత్రికులకు మక్కా, మదీనాలో హరమ్‌లకు సమీపంలోని హోటళ్లలో వసతి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు .ఈ సందర్భంగా మహ్మద్ ఇజాజ్ మర్కీతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం




- 1990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి

**పటాన్చెరు (వుదయం):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన 17వ స్నాతకోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 1990 మంది విద్యార్థులకు (1532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. స్కాలర్లు) పట్టాలు ప్రదానం చేశారు.ప్రపంచ ప్రఖ్యాత భారతీయ చలన చిత్ర దర్శకుడు శ్రీ ఎస్.ఎస్. రాజమౌళి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గీతం అధ్యక్షుడు విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు శ్రీ ఎం. శ్రీభరత్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా మహాత్మా గాంధీ విగ్రహానికి, గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా, చేనేత రంగంలో విశేష కృషి, భారతదేశపు గొప్ప వస్త్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో అందించిన సేవలకు గుర్తింపుగా, భారతీయ చేనేత కళాకారుడు శ్రీ గజం గోవర్ధనకు గీతం గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ప్రదానం చేసింది. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 17 బంగారు పతకాలను అందజేశారు. బీ.టెక్.లోని అన్ని విభాగాలలో టాపర్ గా నిలవడంతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించిన డిగుదాడి ప్రణవ్ రాహుల్ ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకున్నారు. అలాగే, పరిశోధన, ఆవిష్కరణల రంగంలో గణనీయమైన కృషి చేసిన 86 మంది పరిశోధక విద్యార్థుల (పీహెచ్.డీ. స్కాలర్లు)కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేసింది. అత్యుత్తమ పరిశోధన విజయాలకు గాను, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (అర్థశాస్త్ర విభాగం) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అర్షద్ అన్సారీ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (రసాయన శాస్త్ర విభాగం) ప్రొఫెసర్ ఎ.ఎస్. సురేంద్రబాబులకు 'ఉత్తమ పరిశోధకుడు' (బెస్ట్ రీసెర్చర్) అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజమౌళి స్నాతకులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి తత్వాన్ని గుర్తుచేస్తూ పట్టభద్రులను ఉత్తేజపరిచారు. తన అధ్యక్షోపన్యాసంలో, శ్రీభరత్ పట్టభద్రులైన విద్యార్థులను అభినందిస్తూ, విజయానికి ఏడు మార్గదర్శక సూత్రాలను వివరిస్తూ రాజమౌళి గారి సందేశాన్ని పునరుద్ఘాటించారు. పెద్ద కలలు కనండి, మిమ్మల్ని మీరు నమ్మండి, గొప్ప వ్యక్తులతో కలిసి ఉండండి. మీ లక్ష్యాల పట్ల అభిరుచి కలిగి ఉండండి, నిబద్ధతతో ఉండండి. నిరంతరం నేర్చుకుంటూ, ఎదుగుతూ ఉండండి. వినయంగా ఉండండి, ఇచ్చిన మాటను ఎల్లప్పుడూ నిలబెట్టుకోండి అని సలహా ఇచ్చారు.వార్షిక నివేదికను సమర్పిస్తూ, హైదరాబాదులో అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం సాధించిన విజయాలను వివరించారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలలో శ్రేష్ఠత ద్వారా సామాజిక బాధ్యత గల నాయకులను తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. పట్టభద్రులైన విద్యార్థులు నైతిక ప్రవర్తన, వృత్తిపరమైన నైపుణ్యం, దేశ నిర్మాణానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ స్నాతకోత్సవ ప్రతిజ్ఞ చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ వందన సమర్పణ చేశారు.17వ స్నాతకోత్సవ కార్యక్రమం, విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి పట్ల గీతం హైదరాబాదు అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమం ద్వారా పట్టభద్రులైన వారు బాధ్యతాయుతమైన నిపుణులుగా, సమాజంపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపగల భవిష్యత్ నాయకులుగా ఎదిగేలా సాధికారత కల్పించింది.

## స్నేహమంటే ఇదేరా



- అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం శ్రీ గాయత్రి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

**నారాయణఖేడ్ ఆగస్ట్ 01 (వుదయం)**

నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ గాయత్రి పాఠశాలలో శనివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు అందరూ కలిసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ స్నేహితుల బ్యాడ్లు ను చేతులకు కట్టుకున్నారు.

**ఈ సందర్భంగా పాఠశాల కార్పండేట్ సిద్ధ రెడ్డి మాట్లాడుతూ**

స్నేహితుల దినోత్సవాన్నిప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకుంటారు. ఈ రోజున ప్రజలు తమ స్నేహితులపై ఉన్న తమ ప్రేమను వ్యక్తపరచడానికి తమ స్నేహితులతో గడుపుతారు. ఈ సందర్భంగా ఆదివారము పాఠశాలలకు సెలవు కావడంతో శనివారం రోజునేపువ్వులు, కార్డులు, మణికట్టు బ్యాండ్లు వంటి ఫ్రెండ్షిప్ డే బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు, ఇది ఒక ప్రముఖ సాంప్రదాయం. స్నేహం అనేది జీవితంలో లభించే అత్యంత విలువైన బంధాలతో ఒకటి ఇది నమ్మకం అవగాహన దయ మధురమైన జ్ఞాపకాల పునాదిపై నిర్మితమవుతుంది అన్నారు. సంస్కృతాలు తరాలు సరిహద్దుల్ని దాటి వ్యక్తులను అనుసంధా నించే శక్తి స్నేహానికి ఉంటుంది. ఒక నిజమైన తోడు మన జీవితంలోనే ప్రతి సవాలను తేలికగా ప్రతి వేడుకను మరింత ఉత్సాహంగా మారుస్తుందని ఇది మనకు గుర్తు చేస్తుందని ప్రతి ఏడాది వచ్చే ఫ్రెండ్షిప్ డే స్నేహితుల దినోత్సవ మన కష్టసుఖాల్లో మనతో పాటు నిలిచి వ్యక్తులకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఒక మంచి అవకాశన్ని ఇస్తుందని స్నేహితులకు కృతజ్ఞతలు చెప్పడానికి ఫ్రెండ్షిప్ డే సరియైన వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పైడిగుమ్మల్ లో అత్యంత వైభవంగా ఊరడమ్మ, కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలు

**కోహీర్ ఆగస్టు 1( వుదయం ప్రతినిధి )**



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో గ్రామ దేవతలు అయిన ఊరడమ్మ, కట్టమైసమ్మ తల్లుల బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను శిరస్సుపై ఎత్తుకుని, డప్పు వాయిద్యాలు శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో పోతురాజుల వీరభక్తి విన్యాసాలు, ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, ఆలయ పరిసరాలన్నీ విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా వికసించాయి. గ్రామస్తులు తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. , ప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతంగా సాగింది. అమ్మవారి దయాకటాక్షాలతో గ్రామానికి సకల శుభాలు కలగాలని కోరుకుంటూ, ఈ వేడుకలు ఊరి ప్రజల నడుమ సోదరభావాన్ని మరింత పెంపొందించాయి. ఈ బోనాల ఉత్సవ వేడుకలో గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పెద్దలు మహీళాలు యువకులు చిన్నారులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు



# దౌదర్పల్లిలో తల్లిపాల వారోత్సవాలు

గద్వాల ఆగస్టు 01
(వు దయం కరస్పాండెంట్)

గద్వాల జిల్లాదౌదర్పల్లి గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మొహమ్మద్ అస్గర్ అలీ, డీవీఎల్ఎం నరేంద్రబాబు, హెల్త్ సూపర్వైజర్ శ్యాం సుందర్ హాజరై తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొహమ్మద్ అస్గర్ అలీ మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లి నుంచి వచ్చే మొదటి పసుపు రంగు చిక్కని పాలు (కొలొస్ట్రమ్) శిశువుకు అమృతంతో సమానమని, తల్లి అనారోగ్యంగా ఉన్నప్పటికీ చాలా సందర్భాల్లో వైద్యుల సూచన మేరకు తల్లిపాలు ఇవ్వవచ్చని తెలిపారు.అలాగే రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి, పోషకాహార లోపం తగ్గుతుందని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల ఆరోగ్యానికీ మేలు జరుగుతుందని, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాధ, 7వ వార్డు అంగన్వాడీ టీచర్ చిట్టెమ్మ, ఆశా కార్యకర్తలు సారిక, శంకరమ్మతో పాటు గ్రామంలోని తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మరికల్ ఆర్య వైశాల్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రమేష్

మరికల్ ఆగస్టు 1
(వుదయం ప్రతినిధి)



మరికల్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్యాల సంఘం యువజన రాష్ట్ర కార్యదర్శిగా ఇల్లూరు రమేష్ ఎన్నికైనందుకు ఆర్యవైశ్య సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు మరియు ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని విధాలుగా అభివృద్ధికి తోడ్పడతానని ఆయన అన్నారు నాకు సహకరించిన ఆర్యవైశ్యులకు పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు

# గద్వాల ఐటీఐలో అధునాతన సాంకేతిక కోర్సులు



- అడ్మిషన్లు ప్రారంభం

గద్వాల ఆగస్టు 01
(వుదయం కరస్పాండెంట్)

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేసినట్లు ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు సీతారాములు తెలిపారు.రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐల్లో అత్యాధునిక ప్రయోగశాలలు, యంత్ర పరికరాలు, పరిశ్రమలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికతో శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గద్వాల ఏటీసీలో సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ వంటి ఆరు ఆధునిక ట్రేడ్లలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ కోర్సులు రోబోటిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ తయారీ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో ఉద్యోగ అవకాశాలకు విద్యార్థులను సిద్ధం చేస్తాయని చెప్పారు. గద్వాల జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ కలీం, ఇంచార్జి ట్రైనింగ్ ఆఫీసర్ మొహమ్మద్ జహంగీర్, సూపరింటెండెంట్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి



- జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట టౌన్ ఆగస్టు 01
(వుదయం ప్రతినిధి)

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నారాయణపేట, దామరగిద్ద, కోస్గి మండలాల్లో గుర్తించిన గ్రామాల్లో భూసేకరణ సర్వేను మరింత వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లతో కలిసి ఎంఎన్కేఎల్ ప్రాజెక్టు భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా దామరగిద్ద మండలంలోని విఠలాపూర్, గదప, కాన్కూర్తి, అన్నాసాగర్, ఉలిగుండం గ్రామాల్లో సర్వే, భూసేకరణ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందో అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. కోస్గి మండలంలోని నాచారం, తోగాపూర్ గ్రామాల సర్వే పూర్తయిందా లేదా అని సర్వే ల్యాండ్ ఏడీని ప్రశ్నించారు. ఈ రెండు గ్రామాల్లో సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.ముశ్రీఫా, మీర్జాపూర్ గ్రామాల్లో ఎంజాయ్మెంట్ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. చంద్రవంచ, ముక్తిపాడ్, చెన్నారం గ్రామాల్లోనూ వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.అవసరమైతే ఆయా గ్రామాల సర్పంచులతో మాట్లాడి భూసేకరణ ప్రక్రియ మరింత వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రమేష్కు కలెక్టర్ సూచించారు. భూసేకరణలో అర్హులైన భూ యజమానులకు నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వచ్చే శనివారం ఆయా గ్రామాల్లో సర్వే, భూసేకరణ పురోగతిపై మరోసారి సమీక్ష నిర్వహిస్తానని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు.

# నైపుణ్యాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- క్రీడలే విజయానికి పునాది.. క్రీడాకారులకు కలెక్టర్ పిలుపు
- సీబీఎస్ఈ సౌత్ క్లస్టర్ వాలీబాల్ టోర్నీ ఘన ముగింపు
- విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ట్రోఫీలు, పతకాల ప్రదానం
- క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగితేనే ఉన్నత శిఖరాలు: కలెక్టర్

గద్వాల ఆగస్టు 01
(వుదయం కరస్పాండెంట్)



క్రీడాకారులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శనివారం గద్వాల మండలం వీరాపూర్ గ్రామంలోని ఎస్ఆర్ విద్యానికేతన్లో జూలై 29 నుంచి నిర్వహించిన సీబీఎస్ఈ సౌత్ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు సీబీఎస్ఈ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. టోర్నమెంట్ నిర్వహణలో పాల్గొన్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా పోటీలను నిర్వహించారని ప్రశంసించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడిని అభినందించిన కలెక్టర్, విజేతలు, రన్నరప్ జట్లకు పతకాలు, ట్రోఫీలను ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సీబీఎస్ఈ పాఠశాలల పరిశీలకులు శేషు, డైరెక్టర్ రాముడు, ప్రిన్సిపల్ గోన సునీత, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత కీలక భాగస్వాములు

- జిల్లా యువజన అధికారి కోట నాయక్
- మత్తుకు దూరంగా.. లక్ష్యాల వైపు యువత అడుగులు వేయాలి
- 'నశా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు
- మత్తు వ్యసనాలపై యువతకు అవగాహన..
- జిల్లా స్థాయి కార్యక్రమం
- మత్తు రహిత సమాజమే లక్ష్యం: వి. కోట నాయక్

గద్వాల ఆగస్టు 01
(వుదయం కరస్పాండెంట్)




డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా యువజన అధికారి వి. కోట నాయక్ పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నశా ముక్త్ భారత్ అభియాన్-మేరా యువ భారత్ సంయుక్తంగా శనివారం స్థానిక ఎంఏఎల్డీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వి. కోట నాయక్ మాట్లాడుతూ, "నశా ముక్త్ భారత్ అభియాన్" ప్రధాన లక్ష్యం మత్తు రహిత సమాజ నిర్మాణమేనని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తైన యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు వ్యసనాలు వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

అనంతరం విద్యార్థులతో 'నశా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు. యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు నుక్కడ్ నాటకం, దేశభక్తి గీతాలు, వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శివకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ పాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాస్కర్, అధ్యాపకులు సురేందర్ రెడ్డి, డా. కర్ణాకర్, వివిధ కళాశాలల అధ్యాపకులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మానసిక ధైర్యాన్ని కోల్పోవద్దు

- నోడల్ ఆఫీసర్ ఎం. హృదయ రాజు
- ఒత్తిడిని జయించి లక్ష్యాలను సాధించాలి:
- ఇంటర్ విద్యార్థులకు సూచన
- తల్లిదండ్రుల ఆశయాలే విద్యార్థుల విజయానికి పునాది
- అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ అవసరం: హృదయ రాజు

అలంపూర్ ఆగస్టు 01
(వుదయం కరస్పాండెంట్)



విద్యార్థులు జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా, మారుతున్న సమాజంలో ఒత్తిడిని అధిగమిస్తూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా నోడల్ ఆఫీసర్ ఎం. హృదయ రాజు సూచించారు. శనివారం అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన అసెంబ్లీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కౌమార దశలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు, మనోవ్యాకులతలను తల్లిదండ్రులు లేదా తమకు ఇష్టమైన ఉపాధ్యాయులతో పంచుకోవడం ద్వారా అధిగమించవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని గుర్తు చేశారు.అనంతరం కళాశాల అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులను తరగతి గదిలో అందరి ముందు మందలించకుండా, ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఒత్తిడి లేని విద్యా వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు.ఈ విద్యాసంవత్సరంలో అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెరగడం అభినందనీయమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో నాణ్యమైన విద్యను అందించి శాతం వంద ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాత ఆరోగ్య కార్డులతోనే కార్పొరేట్ వైద్యం అందించాల్సిందే!

- సేవలు నిలిపివేస్తే ఊరుకునేది లేదు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల హెచ్చరిక
- చందా మినహాయిస్తున్నప్పుడు ఉచిత వైద్యం ఆపే హక్కు ఎవరిచ్చారు?
- పొరుగు రాష్ట్రాల్లోని ఆసుపత్రులూ పథకం పరిధిలోకి..
- పాత కార్డులే ప్రామాణికం.. గద్వాల సమావేశంలో లక్ష్మీరెడ్డి స్పష్టం

గద్వాల, ఆగస్టు 01
(వుదయం బ్యూరో)



రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కార్డులు జారీ చేసే వరకు.. పాత కార్డుల ఆధారంగానే ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిరభ్యంతరంగా ఉచిత (నగదు రహిత) వైద్యసేవలు అందించాల్సిందేనని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. కార్డుల నెపంతో ఎక్కడా వైద్య సేవలకు విఘాతం కలగడానికి వీల్లేదని, విశ్రాంత ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించింది. శనివారం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు వద్ద గల విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘం జిల్లా సహ అధ్యక్షుడు బాలకిషన్రావు అధ్యక్షతన నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఘాటుగా మాట్లాడారు.

ప్రధాన డిమాండ్లు & ముఖ్యాంశాలు: చందా వసూలు చేస్తూ సేవలాపుతారా?: 2026 మే నెల నుంచి మూల పింఛనులో 1.5 శాతం చొప్పున ఆరోగ్య పథకం చందాను ప్రభుత్వం క్రమం తప్పకుండా మినహాయించి ఆరోగ్య నిధికి జమ చేస్తోందని తెలిపారు. జూలై 17 నుంచి అధికారికంగా ఉచిత వైద్య సేవలు అమల్లోకి వచ్చినా కొన్ని ఆసుపత్రులు సాకులు చెప్పడం సరికాదన్నారు. పాత కార్డులే ప్రామాణికం: నూతన కార్డులు ముద్రించి పంపిణీ చేసే వరకు పాత కార్డులతోనే ఉచిత చికిత్స అందించాలని రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రెడ్డి ఆదేశించారని, దీనిపై కార్పొరేట్ యాజమాన్యాలతో జరిపిన చర్చలు ఫలించాయని వెల్లడించారు. ఆలస్యం లేకుండా పరిహారం: అత్యవసర సమయాల్లో విశ్రాంత ఉద్యోగులు తమ సొంత డబ్బులతో చికిత్స చేయించుకుంటే.. ఆ బిల్లులను ఆరోగ్య నిధికి సమర్పించిన వెంటనే నిబంధనల ప్రకారం వైద్య ఖర్చుల పరిహారం (రీయింబర్స్మెంట్) చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాల ఆసుపత్రులకూ వర్తింపు: ఉద్యోగుల పోరాట ఫలితంగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్లోని కర్నూలు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న గుర్తింపు పొందిన ఆసుపత్రులను కూడా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. నమోదు ప్రక్రియ వేగవంతం: అర్హులైన విశ్రాంత ఉద్యోగుల ఆధారపడిన కుటుంబ సభ్యులు వెంటనే ఉప ఖజానా, సహాయ ఖజానా, జిల్లా ఖజానా కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్త కార్డులు వచ్చే వరకు పాత విధానంలోనే సేవలు పొందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు.

ఈ సమావేశంలో సహ అధ్యక్షుడు బాలకిషన్రావు, ఆర్థిక కార్యదర్శి బీసీ రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, సీనియర్ విశ్రాంత ఉద్యోగి హనుమంతుతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

బొంరాస్ పేట, ఆగస్టు 01;(వుదయం):


పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని మండల పరిధిలోని టేకుల గడ్డ తాండ పాఠశాల హెచ్ ఎం గోపాల్ తెలిపారు. శనివారం గ్రామం లో గ్రామ సర్పంచ్ లక్ష్మీ ఆధ్వర్యం లో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి మరియు పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు.పాఠశాల ఆవరణలో మురుగునీరు నిల్వ కాకుండా ఉండేందుకు అండర్ డ్రైనేజ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే నూతన భవనాల నిర్మాణ సమయంలో పాడైపోయిన సెప్టిక్ ట్యాంకులను పునర్నిర్మించాలని తెలిపారు.ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అనువుగా జెండా స్థంభానికి (ఫ్లాగ్ పోల్) శాశ్వత దిమ్మెను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయాలని,గుంతల పూడికలను మట్టితో సరిచేయాలని గ్రామ సర్పంచ్ని ఆయన కోరారు.ఈ సందర్భంగా గ్రామ పాలనాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో హరితహారం ద్వారా వీధులలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని జలసిరి కార్యక్రమాల ద్వారా పంట పొలాలలో గ్రామంలోని బోరు బావుల దగ్గర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.వారికి ప్రభుత్వం ద్వారా 35వేల రూపాయలు చెల్లిస్తామని తెలియజేశారు.ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు బుజ్జి భాయ్ సోనీ బాయ్ రాజు సుప్లీ భాయ్ సోనీ బాయ్ పూజ రాజు నాయక్ ధర్మానాయక్ తుల్జా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# వేణుగోపాలుని సేవలో 'కే. ప్రసాద్'

- ఆలయ ఈఓగా పదోన్నతిపై బాధ్యతల స్వీకరణ
- అక్రమాలకు తావులేని పారదర్శక పాలనే లక్ష్యం: నూతన ఈఓ

గద్వాల ఆగస్టు 01
(వుదయం బ్యూరో)



గద్వాల పట్టణంలోని బీంనగర్లో కొలువుదీరిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థాన నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ)గా శ్రీ కే. ప్రసాద్ శనివారం ప్రమాణ పూర్వకంగా బాధ్యతలు చేపట్టారు. పదోన్నతిపై ఇక్కడకు నియమితులైన ఆయన, పూర్వ ఈఓ శ్రీ పురేందర్ నుంచి అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు.

**పూర్ణకుంభ స్వాగతం.. వేదాశీర్వచనం:**

బాధ్యతల స్వీకారానికి ముందుగా కే. ప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శేష వస్త్రం సమర్పించి వేదమంత్రోచ్ఛారణల నడుమ దివ్యాశీస్సులు అందజేశారు. అనంతరం దేవస్థాన కార్యాలయంలో ఆయన బాధ్యతల పత్రాలపై సంతకం చేశారు.ఆలయ నిధుల దుర్వినియోగానికి తావులేదు! స్వామివారి క్షేత్ర సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో శ్రమిస్తా. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మౌలిక వసతులను బలోపేతం చేయడమే కాకుండా, దేవస్థాన పరిపాలనలో పూర్తి పారదర్శకత పాటిస్తాం. ఈ పుణ్యకార్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు, దాతలు పూర్ణిమ సహకారాన్ని అందించాలి. — కే. ప్రసాద్, నూతన ఈఓ ప్రముఖుల శుభాకాంక్షలు:ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు జనుంపల్లి జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, బీచుపల్లి బ్రహ్మయ్యలతో పాటు దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొని నూతన ఈఓ కే. ప్రసాద్కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



దౌల్తాబాద్ ఆగస్టు 01(వుదయం) :

శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి అంగన్వాడీ కేంద్రం-1లో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పంజా స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం లభించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.అంగన్వాడీ టీచర్ సరోజన మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయని, తల్లులు అపోహలను నమ్మకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్కుమార్, గ్రామంలోని తల్లులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్య సూచనలు వివరించారు

# చెంగోల్లో 'నకిలీ' విషనాగులు

- అన్నదాతల కడుపు కొడుతున్న దగా!
- అధికారుల పర్యవేక్షణ లోపమా? అపవిత్ర కలయికా?

తాండూర్ ఆగస్టు01వుదయం ప్రతినిధి



ఆకాశం వైపు చూసి వర్షం పడితే చాలు.. అప్పులు తెచ్చి మరీ విత్తనాలు నాటి, ఎరువులు వేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకుందామనుకునే అమాయక రైతును 'నకిలీ' మహమ్మారి కోలుకోలేని దెబ్బ తీస్తోంది. చెంగోల్ సరిహద్దుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ ఎరువుల విక్రయాలు రైతులకు కోలుకోలేని షాక్ ఇస్తున్నాయి. అసలు ఈ నకిలీ ఎరువులు మార్కెట్లోకి ఎలా వచ్చాయి? ఎవరి ఆశీస్సులతో ఈ దందా మూలల్లోకి పాకింది?

ఎలా వచ్చాయి ఈ నకిలీ ఎరువులు..? నాసిరకం ఎరువులు, లైసెన్స్ లేని పురుగుమందులు, కల్తీ డి.ఎ.పి (DAP), యురియాలు చెంగో ల్ గ్రామంలో రైతులను ముంచెత్తుతున్నాయి. పక్క రాష్ట్రాల సరిహద్దుల నుండి రహస్యంగా, ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారులు అక్రమ రవాణా చేస్తున్నారు. తక్కువ ధరకే వస్తుందని నమ్మించి, నకిలీ ఎరువులను రైతుల ముక్కున తాడులా కట్టి సొమ్ము చేసుకుంటున్నారు. పంట ఏపుగా ఎదుగుతుందని ఆశపడి వేసిన రైతుకు.. చివరికి ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ఎండిపోయిన పంటలే మిగులుతున్నాయి.

వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపమా..? అసలేం జరుగుతోంది? గ్రామాల్లో ఏ వ్యాపారి ఏం అమ్ముతున్నాడు? లైసెన్సులు ఉన్నాయా లేదా? విక్రయిస్తున్న ఎరువుల నాణ్యత ఎంత? అని చూడాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారు?

పర్యవేక్షణ శూన్యం: సీజన్ ప్రారంభంలో తనిఖీలు చేయాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మామూళ్ల మత్తు: 'అధికారుల ప్రమేయం లేకపోతే ఈ స్థాయిలో నకిలీ వ్యాపారం సాధ్యమేనా?' అని రైతులు గొంతు విప్పి ప్రశ్నిస్తున్నారు. కొందరు అధికారుల అండదండలు, మామూళ్ల మత్తు వల్లే నకిలీ రాయుళ్లు రెచ్చిపోతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నమూనాల సేకరణ పేరుతో కాలయాపన: ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప అధికారులు కదిలే పరిస్థితి లేదు. నమూనాలు (Samples) సేకరించి ల్యాబ్లకు పంపామని చెప్పడమే తప్ప, ఆ నివేదికలు వచ్చేసరికి రైతు పంట చేతికొచ్చి సర్వనాశనం అయిపోతోంది. రైతులను ముంచుతారా.. కఠిన చర్యలు తీసుకుంటారా?

అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, ముఖ్యంగా వ్యవసాయ శాఖపై ఉంది. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, అధికారులు క్షేత్రస్థాయిలోకి దిగి నకిలీ ఎరువుల మూలాలను నరికివేయాలి.

పత్రిక ప్రకటనలకే పరిమితం కాకుండా కింది చర్యలు వెంటనే చేపట్టాలి:

టాస్క్ ఫోర్స్ తనిఖీలు: చెంగోల్లోని ప్రతి ఎరువుల దుకాణంలోనూ, గోడౌన్లలోనూ విజిలెన్స్ మరియు టాస్క్ ఫోర్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.కఠిన చట్టాలు కేసులు: నకిలీ ఎరువులు విక్రయించే ముఠాలపై పి.డి చట్టం (PD Act) కింద కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలి.రైతులకు నష్టపరిహారం: నకిలీ ఎరువుల వల్ల నష్టపోయిన చెంగోల్ రైతులకు ఆయా కంపెనీలు, వ్యాపారుల ఆస్తులను జప్తు చేసి నష్టపరిహారం చెల్లించాలి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చెంగోల్లో జరుగుతున్న ఈ అక్రమ దందాపై ఉక్కుపాదం మోపుతారో.. లేక ఎప్పటిలాగే 'చూసీ చూడనట్లు' వ్యవహరిస్తూ రైతులకు ఉరితాళ్ళు వేస్తారో వేచి చూడాల్సిందే!

ఏవో కుమారయ్య కి ఫోన్ చేస్తే స్పందించలేరు వారి యొక్క వివరణ పెట్టాలని ఫోను ద్వారా సమాచారం అందిస్తారని ఫోన్ చేయగా వారి నుండి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు..

# విద్యార్థులను అవమానించిన సీఎం రేవంత్ రెడ్డి

- వెంటనే క్షమాపణ చెప్పాలి
- ఖేడ్ లో సీఎం దిష్టి బొమ్మ దగ్గం
- బీజేపీ యువ మోర్చా నారాయణఖేడ్ శాఖ.

నారాయణఖేడ్ ఆగస్ట్ 01(వుదయం)

ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ దరఖాస్తు కూడా నింపడం రాదంటూ, వారిని క్రిమినల్స్తో పోల్చుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యమైనవి, అవమానకరమైనవి. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా చేసిన ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ ఖేడ్ రాజీవ్ గాంధీ చౌక్ లో శనివారం భారతీయ జనతా యువ మోర్చా (బి జె వై ఎం) ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారూ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం తీవ్రంగా శ్రమిస్తున్న యువతను ప్రోత్సహించాల్సిన ముఖ్యమంత్రి, వారిని కించపరుస్తూ మాట్లాడటం దురదృష్టకరం అన్నారు. నిరుద్యోగ సమస్యలు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, విద్యార్థులను అవమానించే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.అందువల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ( బి జె వై ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ప్రజాస్వామ్య బద్ధమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్, రవి కుమార్, పట్నం మాణిక్,సాయి పటేల్,మండల టౌన్ అధ్యక్షులు రాజు గౌడ్, దశరథ్,సగుణకర్, జ్ఞానేశ్వర్,సయేందర్, ఎస్ టి మోర్చా అధ్యక్షులు పవన్, సాగర్ విఠల్,తదితరులు పాల్గొనారు.



# చక్కని ఆరోగ్యం

## ఊబకాయం సమస్య ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి..



ఊబకాయం (ఒబెసిటీ) ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యల్లో ఒకటి. శరీరంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, హార్మోన్ల అసమతుల్యత వంటి అనేక అనారోగ్య సమస్యల ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా యువతలో ఊబకాయం కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ఊబకాయం నియంత్రణలో అత్యంత కీలకం. రోజువారీ ఆహారంలో కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు సరైన మోతాదులో ఉండాలి. అలాగే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, తక్కువ కొవ్వు ఉన్న పాల ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్‌ను ఆహారంలో చేర్చడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఆహారం తీసుకునే సమయం కూడా బరువు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉదయం అల్పాహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మానకూడదు. రాత్రంతా ఉపవాసం తర్వాత శరీరానికి శక్తిని అందించేందుకు పోషకాలు అధికంగా ఉండే అల్పాహారం తీసుకోవడం వల్ల రోజంతా ఆకలి నియంత్రణలో ఉంటుంది. తేనె, డ్రైఫ్రూట్స్ తో కూడిన పాలు, తృణధాన్యాలు లేదా ఇతర ఆరోగ్యకరమైన అల్పాహారం మంచి ఎంపిక. చిరుతిండి పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను ఎంచుకోవాలి. పండ్లు, సోయా గింజలు, ఓట్స్ బార్‌లు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల జీవక్రియ చురుకుగా ఉండి శక్తి స్థాయిలు మెరుగుపడతాయి. వ్యాయామానికి ముందు, తర్వాత తీసుకునే ఆహారం కూడా ముఖ్యమే. వ్యాయామానికి ముందు పండ్లు, గుడ్లు లేదా డ్రైఫ్రూట్స్ వంటి శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి. వ్యాయామం పూర్తయిన 30 నుంచి 45 నిమిషాల్లోపు ప్రోటీన్లు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణకు సహాయపడతాయి.

రాత్రి భోజనం తేలికగా ఉండేలా చూసుకోవాలి. పగటి పూట భోజనం మానేసి రాత్రి అధికంగా తినడం వల్ల శరీరంలో క్యాలరీలు పేరుకుపోతాయి. రాత్రి సమయంలో జీవక్రియల వేగం తక్కువగా ఉంటుంది కాబట్టి సూప్‌లు, సలాడ్లు, తక్కువ కొవ్వు ఉన్న మాంసాహారం లేదా పెరుగు వంటి తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లను తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం కూడా అవసరం. ధూమపానం జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుండగా, మద్యం అధిక క్యాలరీలను అందించి బరువు పెరగడానికి కారణమవుతుంది. శుద్ధి చేసిన ధాన్యాల కంటే తృణధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సజ్జలు, రాగులు, జొన్నలు, మొక్కజొన్న వంటి ధాన్యాలను తరచూ ఆహారంలో చేర్చాలి. అలాగే తెల్ల బియ్యానికి బదులుగా బ్రౌన్ రైస్, రెడ్ రైస్, బ్లాక్ రైస్ వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం మంచిది. కేవలం కందిపప్పు, మినపప్పుతోనే కాకుండా రాజ్మా, శనగలు, సోయాబీన్స్, ఇతర సంపూర్ణ పప్పుధాన్యాలను కూడా ఆహారంలో చేర్చాలి. మొలకల రూపంలో లేదా వండుకుని వారంలో పలుమార్లు తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్లు సమృద్ధిగా అందుతాయి. మాంసాహారం తీసుకునేవారు తక్కువ కొవ్వు ఉన్న ముక్కలను ఎంచుకోవడం ఉత్తమం. రోజుకు కనీసం మూడు సార్లు కూరగాయలు, రెండు సార్లు సంపూర్ణ పండ్లు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. రోజుకు 25 నుంచి 30 గ్రాముల ఫైబర్ అవసరమవుతుంది కాబట్టి ఒక్క యాపిల్‌పైనే ఆధారపడకుండా వివిధ రకాల పండ్లు, కూరగాయలను తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్, ప్యాకెట్ స్నాక్స్, డీప్ ఫ్రై చేసిన పదార్థాలు, కుకీలు, మార్జరిన్ వంటి ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండే ఆహారాలను వీలైనంత వరకు తగ్గించాలి. ప్యాకెట్ ఆహారాలను కొనుగోలు చేసే ముందు వాటి లేబుళ్లను పరిశీలించి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వంటి అలవాట్లు పాటిస్తే ఊబకాయాన్ని సహజంగానే నియంత్రించడంతోపాటు దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## నెయ్యి అన్ని విధాలుగా మంచిది..




నెయ్యిని ఆహారంలో భాగంగా తీసుకోవడం భారతీయ ఇళ్లలో సర్వసాధారణం. అయితే ఈ నెయ్యి కేవలం రుచిని పెంచడానికే కాదు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుందని ఆయుర్వేదం పేర్కొంటోంది. ఈ చిట్కాలను వైద్య సలహాతో మాత్రమే పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నెయ్యిని భారతీయ సంప్రదాయంలో ఎంతో కాలంగా విలువైన ఆహారంగా భావిస్తారు. బలహీనత, పొడి చర్మం, కీళ్ల నొప్పులు వంటి అనేక సమస్యలకు ఇది ఉపయోగపడుతుందని చాలా కాలంగా విశ్వసిస్తున్నారు. ముఖ్యంగా వాతావరణం చల్లగా ఉన్న సమయంలో శరీరానికి వెచ్చదనం అందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే చాలామంది రోజువారీ ఆహారంలో నెయ్యిని తప్పకుండా చేర్చుకుంటారు. జలుబు, ముక్కు దిబ్బడ లేదా సైనసైటిస్ వంటి సమస్యలు వచ్చినప్పుడు కూడా నెయ్యితో చేసే కొన్ని ఇంటి చిట్కాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో ఒకటి నెయ్యిలో కొన్ని వెల్లుల్లి రెబ్బలను స్వల్పంగా వేయించి గోరువెచ్చగా తినడం. ఇది శరీరానికి వేడి అందించి ఉపశమనం కలిగిస్తుంది. మరో సంప్రదాయ పద్ధతి ఏమిటంటే.. గోరువెచ్చని నెయ్యిని ఛాతి, చేతులు, కాళ్లపై మర్దనా చేయడం. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు శరీరంలోని ఈ భాగాల ద్వారా చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిద్రపోయే ముందు కొద్దిగా గోరువెచ్చని నెయ్యిని చేతులు, కాళ్లకు రాస్తే శరీరం వెచ్చగా ఉండటంతోపాటు చర్మం పొడిబారకుండా కూడా సహాయపడుతుంది. ఆయుర్వేదంలో నస్య (Nasya) అనే చికిత్సా విధానంలో గోరువెచ్చని స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ముక్కులో కొన్ని చుక్కలు వేయడం గురించి కూడా ప్రస్తావిస్తారు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఈ విధానం పాటిస్తే ముక్కు దిబ్బడ తగ్గి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తీవ్రమైన దిబ్బడ ఉన్నప్పుడు ఉదయం, రాత్రి నిద్రకు ముందు రోజుకు రెండు సార్లు చేయవచ్చని కూడా పేర్కొంటున్నారు. అయితే ఈ విధానాన్ని తప్పనిసరిగా అనుభవం ఉన్న ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలోనే చేయాలి. ఉపయోగించే నెయ్యి స్వచ్ఛమైన ఆవు పాలతో తయారైనదై ఉండాలి. అలాగే అది కేవలం గోరువెచ్చగా మాత్రమే ఉండాలి; ఎక్కువ వేడిగా ఉంటే ముక్కు లోపలి భాగానికి హాని కలిగించే ప్రమాదం ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇంటి చిట్కాలు కొంత ఉపశమనం ఇస్తాయి. అయితే జలుబు, ముక్కు దిబ్బడ లేదా సైనస్ సమస్యలు ఎక్కువ రోజులు కొనసాగినా, జ్వరం, తీవ్రమైన నొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించినా స్వయంగా చికిత్స చేసుకోకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## మధ్యాహ్నం భోజనం చేశాక నిద్ర మత్తు ఎక్కువగా వస్తుంటే ఇలా చేయండి..

మధ్యాహ్న భోజనం చేసిన వెంటనే చాలా మందికి నిద్రమత్తు, బద్ధకం రావడం సహజం. ముఖ్యంగా కార్యాలయాల్లో పనిచేసేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. భోజనం చేసిన తర్వాత పనిపై ఏకాగ్రత తగ్గడం, ఉత్సాహం తగ్గిపోవడం వల్ల పనితీరు కూడా దెబ్బతింటుంది. అయితే కొన్ని సులభమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో ఈ సమస్యను చాలావరకు నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్న భోజనం ఎక్కువగా తిన్నప్పుడు శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించేందుకు ప్యాంక్రియాస్ అధికంగా ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇన్సులిన్ పెరగడంతో మెదడులో సెరోటోనిన్, మెలటోనిన్ వంటి నిద్రను ప్రేరేపించే హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో శరీరం మందగించి నిద్రమత్తు ఎక్కువగా అనిపిస్తుంది. అయితే ఈ కారణంగా మధ్యాహ్న భోజనం మానేయడం సరైన పరిష్కారం కాదు. బదులుగా భోజనం చేసిన తర్వాత కొన్ని చిన్నచిన్న అలవాట్లు పాటిస్తే శరీరం చురుకుగా ఉండేందుకు సహాయపడుతుంది. భోజనం చేసిన వెంటనే కుర్చీలో కూర్చొని పని ప్రారంభించకుండా ఐదు నుంచి పది నిమిషాలు నడవడం మంచిది. కార్యాలయం పరిసరాల్లో చిన్న నడక చేయడం లేదా మెట్లు ఎక్కడం వంటి తేలికపాటి శారీరక వ్యాయామం రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను పెంచి శక్తిని అందిస్తుంది. దీంతో నిద్రమత్తు తగ్గి ఉత్సాహం పెరుగుతుంది. పుదీనా రుచి కలిగిన షుగర్ ఫ్రీ చ్యూయింగ్ గమ్‌ను కొద్దిసేపు నమలడం కూడా అప్రమత్తతను పెంచడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే దీనిని అధికంగా ఉపయోగించడం మంచిది కాదు. రోజంతా తగినంత నీరు తాగడం కూడా ఎంతో ముఖ్యం. శరీరంలో నీటి కొరత ఏర్పడితే అలసట, మానసిక నిరుత్సాహం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల మధ్యాహ్న భోజనం తర్వాత కూడా తగినంత నీరు లేదా ఇతర ఆరోగ్యకరమైన ద్రవాలను తీసుకోవడం ద్వారా శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. అలాగే మధ్యాహ్న భోజనాన్ని మితంగా తీసుకోవడం, ఎక్కువ నూనె, కొవ్వు, అధిక చక్కెర ఉన్న ఆహారాలను తగ్గించడం, పీచుపదార్థాలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం కూడా భోజనం తర్వాత వచ్చే నిద్రమత్తును తగ్గించడంలో సహాయపడుతుంది.

ఒకవేళ తగినంత నిద్రపోయినా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా ప్రతిరోజూ అధికంగా నిద్రమత్తు వస్తుంటే, దాని వెనుక ఇతర ఆరోగ్య సమస్యలు ఉండే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో వైద్యుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం మంచిది.



## ముఖంపై ఇలాంటి లక్షణాలు, సంకేతాలు కనిపిస్తున్నాయా..



మన ముఖం కేవలం అందాన్ని మాత్రమే కాదు, ఆరోగ్య పరిస్థితిని కూడా ప్రతిబింబిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చర్మం, పెదవులు, కళ్లలో కనిపించే కొన్ని మార్పులు శరీరంలో ఉన్న పోషక లోపాలు లేదా కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతాలు అవుతాయి. అయితే ఈ లక్షణాలు కనిపించాయంటే తప్పనిసరిగా అదే వ్యాధి ఉందని భావించకూడదు. వీటిని హెచ్చరిక సంకేతాలుగా పరిగణించి అవసరమైతే వైద్యులను సంప్రదించడం మంచిది. పెదవులు లేదా చర్మం తరచూ పొడిబారడం శరీరంలో నీటి కొరతకు సంకేతం అయ్యే అవకాశాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గడం (హైపోథైరాయిడిజం) వల్ల కూడా ఈ సమస్య కనిపిస్తుంది. దీంతోపాటు బరువు పెరగడం, అలసట, చలిని ఎక్కువగా భరించలేకపోవడం వంటి లక్షణాలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. కళ్లలోని తెల్లని భాగం పసుపు రంగులోకి మారడం సాధారణంగా కామెర్లకు (జాండిస్) ప్రధాన సంకేతంగా పరిగణిస్తారు. ఇది కాలేయ సమస్యలను సూచించే అవకాశం ఉంటుంది. ఇలాంటి లక్షణం కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం అవసరం. మహిళల్లో గడ్డం, పై పెదవి లేదా దవడ భాగంలో అసాధారణంగా వెంట్రుకలు పెరగడం పాలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ (PCOS) వంటి హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం అవుతుంది. దీంతోపాటు నెలసరి సమస్యలు, బరువు పెరగడం, మొటిమలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ముఖంపై దురదతో కూడిన ఎర్రని మచ్చలు లేదా దద్దుర్లు కనిపిస్తే కొన్ని అలర్జీలు, జీర్ణవ్యవస్థ సమస్యలు లేదా గ్లూటెన్‌కు సంబంధించిన ఉదరకుహర వ్యాధి (సీలియాక్ డిసీజ్) వంటి సమస్యలకు సంకేతం అవుతుంది. కళ్ల కింద వాపులు లేదా నీలం, ఊదా రంగు వలయాలు కనిపించడం కొన్నిసార్లు అలర్జీలు, నిద్రలేమి లేదా ఇతర కారణాలతో రక్తనాళాలు విస్తరించడం వల్ల సంభవిస్తుంది. ఇది నిరంతరం కొనసాగితే వైద్య సలహా తీసుకోవడం మంచిది. కళ్ల కింద నల్లని వలయాలు ఎక్కువగా నిద్రలేమి, ఒత్తిడి లేదా అలర్జీల వల్ల ఏర్పడతాయి. కొన్నిసార్లు పోషకాహార లోపం కూడా దీనికి కారణం అవుతుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ముఖంపై చిన్న తెల్లని మొటిమలు లేదా గడ్డలు కనిపిస్తే అవి కొన్నిసార్లు విటమిన్ ఎ, జింక్, అవసరమైన కొవ్వు ఆమ్లాల వంటి పోషకాల లోపానికి సంకేతంగా ఉంటాయి. అయితే మొటిమలకు హార్మోన్ల మార్పులు, చర్మ సంరక్షణ అలవాట్లు వంటి అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. అద్దంలో ముఖాన్ని చూసేటప్పుడు కేవలం అందాన్ని మాత్రమే కాకుండా ఇలాంటి మార్పులను కూడా గమనించడం మంచిది. ముఖంపై కనిపించే ఒక్క లక్షణం ఆధారంగా స్వయంగా వ్యాధిని నిర్ధారించుకోవద్దు. లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే లేదా ఇతర అసౌకర్యాలు కూడా ఉంటే వైద్య నిపుణులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## ఇంట్లో ఉండే ఈ సహజసిద్ధమైన పదార్థాలతోనే చర్మం సురక్షితం

ఆరోగ్యవంతమైన, కాంతివంతమైన చర్మాన్ని పొందడానికి కేవలం ఖరీదైన క్రీములు, లోషన్లు ఉపయోగించడం మాత్రమే సరిపోదు. చర్మ సౌందర్యానికి సరైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అంతే ముఖ్యమైనవి. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే చర్మం సహజ కాంతిని సంతరించుకోవడమే కాకుండా తేమను నిల్వ చేసుకుని వృద్ధాప్య లక్షణాలు కూడా ఆలస్యంగా కనిపించే అవకాశం ఉంటుంది. డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి సూర్యరశ్మిలోని హానికరమైన అతినీలలోహిత కిరణాల ప్రభావం నుంచి చర్మాన్ని కొంతవరకు రక్షించడంలో సహాయపడతాయి. అలాగే చర్మంలో తేమను నిల్వ ఉంచి మృదువుగా, కాంతివంతంగా కనిపించేలా చేయడంలో దోహదపడతాయి. పెరుగు చర్మ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో ఒకటి. దీనిని తినడంతోపాటు ఆలివ్ నూనె కలిపి ఫేస్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఇలా చేయడం వల్ల సన్నని ముడతలు, మొటిమలు తగ్గడంతోపాటు చర్మం మృదువుగా మారడానికి సహాయపడుతుంది. పసుపు కలిపిన వేడి పాలు అనారోగ్య సమయంలో మాత్రమే కాకుండా చర్మ ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో కొద్దిగా పసుపు కలిపి తాగితే చర్మం శుభ్రంగా ఉండటంతోపాటు సహజమైన కాంతి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జిడ్డు చర్మం కారణంగా తరచూ మొటిమలతో బాధపడేవారికి దాల్చిన చెక్క ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులోని సహజ గుణాలు మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకోవడంలో సహాయపడతాయి. దాల్చిన చెక్క పేస్ట్‌ను చర్మంపై రాస్తే రక్తప్రసరణ మెరుగుపడి మొటిమలు తగ్గే అవకాశముంటుంది. అవిసె గింజలు ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలకు మంచి వనరు. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడటంతోపాటు చర్మంలో తేమను నిల్వ ఉంచి పొడిబారకుండా కాపాడతాయి. దానిమ్మ పండులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలోనే కాకుండా వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేయడంలో, ఎండ వల్ల దెబ్బతిన్న చర్మాన్ని సంరక్షించడంలో కూడా దోహదపడతాయి. కొబ్బరి నూనె సహజమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు లేదా అవసరాన్ని బట్టి చర్మంపై కూడా ఉపయోగించవచ్చు. రెడ్ వైన్‌ను పరిమిత మోతాదులో తీసుకుంటే గుండె ఆరోగ్యంతోపాటు చర్మ ఆరోగ్యానికి కూడా కొంత మేలు చేస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే మద్యం సేవించడం ఆరోగ్యానికి ప్రమాదకరమని గుర్తుంచుకోవాలి. అందువల్ల దీనిని చర్మ ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ప్రారంభించడం లేదా సేవించాలని సిఫారసు చేయడం లేదు.



## స్ట్రాబెర్రీలను కొనే ముందు తెలుసుకోవాల్సిన విషయాలివే..



స్ట్రాబెర్రీలు రుచికరమైన బెర్రీ పండ్లలో ఒకటి. తీపి, స్వల్ప పులుపు కలిసిన వీటి ప్రత్యేక రుచి చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటుంది. రుచితోపాటు పోషక విలువలు కూడా సమృద్ధిగా ఉండే ఈ పండ్లు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, మాంగనీస్, ఫోలేట్, పొటాషియం, బి విటమిన్లు వంటి అనేక కీలక పోషకాలను అందిస్తాయి. అయితే మంచి నాణ్యమైన స్ట్రాబెర్రీలను ఎంపిక చేయడం, వాటిని సరైన విధంగా నిల్వ చేయడం తెలియకపోతే అవి త్వరగా మెత్తబడిపోవడం లేదా పాడైపోవడం జరుగుతుంది. కొన్ని సులభమైన సూచనలు పాటిస్తే తాజా స్ట్రాబెర్రీలను ఎక్కువ కాలం ఆస్వాదించవచ్చు. స్ట్రాబెర్రీలు సంవత్సరమంతా కొన్ని ప్రాంతాల్లో లభించినప్పటికీ, శీతాకాలంలో కొనుగోలు చేస్తే మరింత తాజా రుచి, మంచి నాణ్యత లభిస్తుంది. ఈ కాలంలో పండే స్ట్రాబెర్రీలు సహజమైన తీపి, సువాసనతో ఉంటాయి. అందువల్ల సీజన్‌లోనే వీటిని కొనుగోలు చేయడం ఉత్తమం. అయితే అన్ సీజన్‌లోనూ వీటిని సరిగ్గా ఎంపిక చేసి నిల్వ చేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటాయి. స్ట్రాబెర్రీలను కొనుగోలు చేసే సమయంలో వాటి సువాసనను గమనించాలి. తాజాగా ఉన్న పండ్లకు సహజమైన తియ్యని వాసన ఉంటుంది. దుర్వాసన లేదా పులిసిన వాసన వస్తే వాటిని కొనుగోలు చేయకపోవడం మంచిది. వీలైతే సూపర్‌మార్కెట్‌ల కంటే స్థానిక రైతు బజార్లు లేదా తాజా పండ్లు విక్రయించే దుకాణాల నుంచి కొనుగోలు చేస్తే మంచి నాణ్యత లభించే అవకాశం ఎక్కువ. స్ట్రాబెర్రీల రంగు, ఆకారాన్ని కూడా పరిశీలించాలి. మంచి స్ట్రాబెర్రీలు గట్టిగా ఉండి ప్రకాశవంతమైన ఎరుపు రంగులో కనిపిస్తాయి. పండుపై నల్లని మచ్చలు, గాయాలు లేదా బూజు ఉండకూడదు. ఇంకా పచ్చగా ఉన్న పండ్లను ఇంటికి తీసుకెళ్లి పండిస్తామని భావించకూడదు. అలాంటి పండ్లకు పూర్తి రుచి ఉండదు. అలాగే పండుకు పైభాగంలో ఉండే ఆకుపచ్చ కాడ తాజాగా, గట్టిగా ఉండటం కూడా నాణ్యతకు సూచిక. చాలా పెద్ద స్ట్రాబెర్రీల కంటే మధ్యస్థ పరిమాణంలో ఉన్న పండ్లను ఎంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఎక్కువ రుచిగా, రసంతో నిండుగా ఉంటాయి. చాలా పెద్ద పండ్లు కొన్నిసార్లు లోపల ఖాళీగా లేదా నీటి శాతం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయి. మరీ చిన్న పండ్లలో గింజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. స్ట్రాబెర్రీలను కొనుగోలు చేసిన వెంటనే కడగకూడదు. వెంటనే తినాలనుకుంటే మాత్రమే నీటితో శుభ్రం చేయాలి. ముందుగానే కడిగితే అవి నీటిని పీల్చుకుని త్వరగా మెత్తబడి పాడయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల తినే ముందు మాత్రమే కడగడం ఉత్తమం. వారంలోపు ఉపయోగించాలనుకుంటే స్ట్రాబెర్రీలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. అయితే వాటిని పేపర్ టవల్‌లో చుట్టి ఉంచితే అదనపు తేమను పీల్చుకుని పండ్లు ఎక్కువకాలం తాజాగా ఉంటాయి. తేమ ఎక్కువైతే అవి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. ఒక సంవత్సరం వరకు నిల్వ చేయాలనుకుంటే ఫ్రీజర్‌లో ఉంచడం ఉత్తమ మార్గం. ముందుగా స్ట్రాబెర్రీలను బాగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తరువాత కాడలను తొలగించి గాలి చొరబడని డబ్బా లేదా జిప్‌లాక్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రీజ్ చేయాలి.

## సి విటమిన్ అందించే క్యాప్సికమ్!

రంగు రంగుల్లో దొరికే క్యాప్సికమ్‌ని ఏ వంటకంలో వేసినా రుచిని పెంచడమే కాదు... కళ్లనూ కట్టిపడేస్తుంది. ఇందులో పోషకాలూ ఎక్కువే. క్యాప్సికమ్‌లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది కొలాజన్ ఉత్పత్తిని పెంచి చర్మం ముడతలు పడకుండా, కాంతిమంతంగా ఉంచుతుంది. అంతేకాదు, ఐరన్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల ఈ పోషకాన్ని శరీరం వేగంగా గ్రహించగలుగుతుంది. వయసు పెరిగేకొద్దీ మహిళల్లో ఎదురయ్యే ఆస్టియోపోరోసిస్ సమస్యకు ఇందులోని విటమిన్ కె1, కాల్షియం మంచి పరిష్కారం. తక్కువ కెలోరీలు, ఎక్కువ ఫైబర్ ఉండే క్యాప్సికమ్ బరువు తగ్గాలనుకునే మహిళలకు బెస్ట్ ఛాయిస్. జీర్ణక్రియనూ మెరుగుపరుస్తుంది. రోజువారీ డైట్‌లో కనీసం ఒక కప్పు రంగురంగుల క్యాప్సికమ్ ముక్కలను చేర్చుకోండి. హార్మోన్ల సమతుల్యతను, రోగనిరోధక శక్తిని సులభంగా పొందొచ్చు! ఎక్కువగా ఉడికిస్తే దానిలోని పోషకాలు నశిస్తాయి. అందుకే, పచ్చి క్యాప్సికమ్ ముక్కలను సన్నగా తరిగి, కాస్త నిమ్మరసం, నల్ల ఉప్పు చల్లుకుని సలాడ్‌గా తినొచ్చు. చాలా తక్కువ నూనెతో, చిన్న మంటపై 2–3 నిమిషాలు లైట్‌గా వేయించీ తీసుకోవచ్చు. పనీర్, మొలకెత్తిన గింజలు లేదా కూరగాయల తురుమును క్యాప్సికమ్‌లో నింపి, తేలికగా బేక్ లేదా గ్రిల్ చేసి తిన్నా ఆరోగ్యమే.



## మారుతీకి ముడిసరుకు భారం

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో వాహనాలు అమ్మినా, ముడిసరుకు వ్యయాల వల్ల నికర లాభం తగ్గినట్లు ప్రకటించింది. ఏప్రిల్ – జూన్ త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.3,446.90 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2025–26 ఇదే కాల లాభం రూ.3,792.40 కోట్ల కంటే ఇది 9.11% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.38,605.20 కోట్ల నుంచి 35.9% పెరిగి రూ.52,469.80 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.35,585.40 కోట్ల నుంచి రూ.50,000.30 కోట్లకు పెరిగాయి.




# బీమా వ్యాపారంలోకి పతంజలి !




ఆయుర్వేదం, ఎఫ్ఎమ్‌సీజీ ఉత్పత్తుల సంస్థ పతంజలి ఆయుర్వేద్ త్వరలోనే ఆర్థిక సేవల వ్యాపారంలోకీ అడుగుపెట్టబోతోంది. మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో మెజార్టీ వాటా కొనుగోలు చేయనుండటం ద్వారా, బీమా రంగానికి తన కార్యకలాపాలు విస్తరించనుంది. ఈ కొనుగోలు ప్రతిపాదనకు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (ఐఆర్‌డీఏఐ) అనుమతులు ఇచ్చినట్లు తెలిపింది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను పతంజలి ఆయుర్వేద్, రజనిగంధ పాన్ మసాలా తయారీ సంస్థ ధరమ్‌పాల్ సత్యపాల్ గ్రూపు (డీఎస్ గ్రూపు) సుమారు రూ.4,500 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. గత మార్చిలో ఈ కొనుగోలు లావాదేవీపై ఇరు సంస్థలు ప్రకటన చేశాయి. ప్రతిపాదిత కొనుగోలు అనంతరం మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో పతంజలికి 73.6% వాటా, డీఎస్ గ్రూపునకు 24.5% వాటా ఉండనుంది. అదార్ పూనావాలాకు చెందిన సనోటి ప్రోపర్టీస్, ఇతర వాటాదార్ల నుంచి ఈ వాటాలను అవి కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం సనోటికి మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో 72.4% వాటా ఉంది.

కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ప్రకారం మ్యాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ పనితీరు ఇలా.. 2020–21 నుంచి 2024–25 మధ్య స్థూల ప్రత్యక్ష ప్రీమియం 22% వార్షిక వృద్ధితో రూ.3,334 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో జనరల్ ఇన్సూరెన్స్ పరిశ్రమ 10% వార్షిక వృద్ధి రేటు నమోదు చేసింది. 2024–25లో ఈ సంస్థ బ్రేక్ఈవెన్ సాధించి, రూ.1 కోటి లాభాన్ని ఆర్జించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.141 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 2025–26 తొలి తొమ్మిది నెలల్లో కంపెనీ నికర లాభం రూ.27 కోట్లుగా నమోదైంది. 2025 డిసెంబరు 31 నాటికి సాల్వెన్సీ మార్జిన్ 1.81 రెట్లుగా ఉంది. ఇది రూ.268 కోట్ల మిగులు మూలధనానికి సమానం.

# రూ.200 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర..



వాణిజ్య అవసరాల కోసం హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే వంటగ్యాస్ ధర తగ్గింది. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు శనివారం చమురు సంస్థలు ప్రకటించాయి. ఫిబ్రవరిలో పశ్చిమాసియా ఘర్షణలు ప్రారంభం కావడంతో సరఫరా అంతరాయాల వల్ల ఇంధన ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం ధరలను కాస్త తగ్గిస్తూ వస్తుంది. జులైలో ఈ సిలిండర్ ధరలను రూ.183 తగ్గించిన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయంతో దిల్లిలో ఒక వాణిజ్య సిలిండర్‌పై రూ.202 మేర తగ్గి, రూ.2,728కి చేరింది. కోల్‌కతాలో 19 కిలోల గ్యాస్ బండ రూ.2,872.50 పలుకుతోంది. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.2,985కు దిగొచ్చింది. గృహ వినియోగ అవసరాలకు ఉపయోగించే 14 కేజీల సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. రైళ్లలో అదనపు లగేజీకి ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం. ఉద్రిక్తతల సమయంలో హోటళ్లు, రెస్టారంట్ల వంటి వాణిజ్య వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాపై ప్రభుత్వం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. వాటిని జూన్‌లో ఎత్తివేసింది. యుద్ధ సంక్షోభానికి ముందున్న స్థాయికి సరఫరాల్ని పునరుద్ధరించింది. ఆ క్రమంలోనే ధరల తగ్గుదల కనిపిస్తోంది.

# రూ.2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు




దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల వివరాలను శనివారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. జులై నెలలో రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నెలవారీ వసూళ్లు రెండు లక్షల కోట్ల మార్క్‌ను దాటడం ఇది రెండోసారి. ఏప్రిల్‌లో జీఎస్టీ కలెక్షన్లు రూ.2.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశీయ లావాదేవీల నుంచి పన్ను వసూళ్లు 10.1శాతం పెరిగి రూ.1.44లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల నుంచి స్థూల ఆదాయం 29శాతం పెరిగి రూ.66,511 కోట్లు ఉంది. జులైలో కేంద్ర జీఎస్టీ ఆదాయం రూ.39,835 కోట్లుగా ఉంది. ఎస్‌జీఎస్టీ రూ.47,881కోట్లు, ఐజీఎస్టీ రూ.1.23 లక్షల కోట్లుగా నమోదైంది. జులై నెలకు రీఫండ్ల విలువ రూ.29,968 కోట్లు కాగా.. దానిని సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ (GST) వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తెలంగాణలో రూ.5,819 కోట్ల జీఎస్టీ వసూలైంది. గతేడాది జులైతో పోలిస్తే ఈసారి వసూళ్లు 19శాతం పెరిగాయి. ఇక, జులైలో ఏపీ జీఎస్టీ వసూళ్లు రూ.3,366కోట్లుగా ఉన్నాయి.

# 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలు

జులై 31 నాటికి 5.9 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి (ITR filed AY27). 2026– 27 మదింపు సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఎక్స్‌వేదికగా ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. 2025–26 మదింపు సంవత్సరంలో ఐటీఆర్ గడువు పొడిగించినందున సెప్టెంబర్ 16 నాటికి 7.3 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలైనట్లు పేర్కొంది. ఐటీఆర్ 1, ఐటీఆర్ 2 దాఖలు చేయడానికి ఎలాంటి అదనపు రుసుము లేకుండా చివరి గడువును జులై 31గా ఐటీ శాఖ నిర్ణయించింది. రూ. 50 లక్షలలోపే వార్షికాదాయం ఉండి.. రెండు సొంతిళ్ల ఆదాయం, వ్యవసాయ ఆదాయం రూ. 5వేల లోపు ఉన్నవారికి ఐటీఆర్–1 వర్తిస్తుంది. వార్షికాదాయం రూ. 50 లక్షలలోపు ఉండి.. రెండు కంటే ఎక్కువ సొంతిళ్లు, స్వల్పకాలిక మూలధన లాభాలు ఉన్నప్పుడు (స్టాక్ మార్కెట్ / మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినవారు), విదేశీ ప్రయాణాల కోసం రూ.2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసిన వారు ఐటీఆర్–2 దాఖలు చేయాల్సి ఉంటుంది.


నిర్ణీత గడువులోగా ఐటీఆర్ సమర్పించకపోయినంత మాత్రాన రిటర్నులు దాఖలు చేయకూడదని కాదు. కొంత ఆలస్య రుసుము చెల్లించి రిటర్నులు దాఖలు చేసే వెసులుబాటును ఆదాయపు పన్ను విభాగం కల్పిస్తోంది. మీ వార్షికాదాయం రూ.5 లక్షల వరకు ఉంటే రూ.1000 చెల్లించి డిసెంబర్ 31లోపు రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. వార్షికాదాయం రూ.5 లక్షలకు పైబడి ఉంటే రూ.5 వేలు ఆలస్య రుసుము కింద చెల్లించాల్సి ఉంటుంది.







## బాక్సింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు



కామన్వెల్త్ గేమ్స్ 2026లో బాక్సింగ్‌లో భారత్ రెండు స్వర్ణాలు సాధించింది. తొలుత మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ గోల్డ్ మెడల్ దక్కించుకుంది. ఫైనల్‌లో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి 5–0 తేడాతో చిత్తుగా ఓడించింది. ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడటంతో ప్రీతి పవార్‌ను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. కాసేపటికే భారత్‌కు మరో పసిడి పతకం దక్కింది. మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో మైఖేలా వాల్ష్ (నార్తర్న్ ఐర్లాండ్)పై జైస్మిన్ 5–0 తేడాతో గెలుపొందింది. మరోవైపు.. పురుషుల బాక్సింగ్ 55 కేజీల విభాగంలో జాదుమణి రజతం దక్కించుకున్నాడు. ఫైనల్‌లో ఆస్ట్రేలియాకు చెందిన బాక్సర్ జై డిక్సన్ చేతిలో జాదుమణి ఓటమి పాలయ్యాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్57లో సోమన్ రానా (13.40 మీ) స్వర్ణం, శుభమ్ జుయల్ (13.28) రజత పతకాలు సాధించారు. ఇక, పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ (16.58 మీటర్లు) రజతం సొంతం చేసుకోగా.. సెల్వ ప్రభు తిరుమరన్ (16.52 మీటర్లు) కాంస్య పతకం అందుకున్నాడు.

# వారి విజయం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసింది: ప్రధాని మోదీ




కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన అథ్లెట్లకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. జావెలిన్ త్రోలో రజతం గెలిచిన నీరజ్ చోప్రా, కాంస్య పతక విజేత యశ్వీర్‌ను అభినందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు.

గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్‌లో నీరజ్ చోప్రా అద్భుతం చేశాడు. రజత పతకం అందుకొన్నాడు. నిలకడ, సంయమనం, స్ఫూర్తిని ప్రదర్శించాడు. అతడి విజయం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసింది. మున్ముందూ ఇదే ఉత్సాహంతో సక్సెస్ అవ్వాలని ఆకాంక్షిస్తున్నా. కంగ్రాట్స్ యశ్వీర్. అద్భుతంగా విసిరి పతకం సాధించావు. క్రీడపై నీకున్న ఆసక్తి, నిబద్ధతకు ఇదే తార్కాణం. యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలిచావు'' అని మోదీ పోస్టు చేశారు.

'జూడో 57 కేజీల విభాగంలో రజతం నెగ్గిన యామిని మౌర్య, డెకథ్లాన్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన తేజశ్విన్ శంకర్‌కు శుభాకాంక్షలు. జూడో పట్ల యామిని అభిరుచి అద్వితీయం. ఎక్కువ మంది యువత జూడో వైపు వచ్చేందుకు ఆమె విజయం బాటలు వేస్తుంది. ఇక పది ఈవెంట్లలో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన తేజశ్విన్ కష్టానికి ప్రతిఫలం అందింది. మున్ముందూ ఇలానే కొనసాగాలని ఆశిస్తున్నా'' అని మోదీ వెల్లడించారు.

# భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ భారత్‌కు సారథి అవుతాడేమో: ఈస్ట్‌జోన్ సెలక్టర్



వచ్చే దులీప్ ట్రోఫీ కోసం ఈస్ట్‌జోన్ జట్టుకు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అప్పుడే కుర్రాడికి ఇలాంటి అదనపు బాధ్యతలు అవసరమా? అని వ్యాఖ్యలు వినిపించాయి. మరోవైపు వైభవ్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంకా నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయనేది పలువురి సూచన. ఈ క్రమంలో ఈస్ట్ జోన్ సెలక్టర్ ప్రవంజన్ స్పందించారు. తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ అనుభవంతో మరింత రాటుదేలతాడని వ్యాఖ్యానించారు. "మేం వైభవ్‌ను సారథి చేయలేదు. వైస్ కెప్టెన్‌గా నియమించాం. మా జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్. వికెట్ కీపర్ కూడా. రోజంతా యాక్టివ్‌గా ఉంటాడు. అంతేకానీ, వైభవ్ సారథ్యం నిర్వర్తించడు. అతడు రోజురోజుకూ పరిణతి చెందుతున్నాడు. ఇలాంటి బాధ్యతలు.. భవిష్యత్తులో అతడికి హెల్ప్ అవుతాయి. వైస్ కెప్టెన్సీ రావడం గొప్ప అవకాశం. దేశం కోసమూ అద్భుతంగా ఆడాలని అతడు కోరుకుంటున్నాడు. ప్రస్తుతం కుర్రాళ్లకు బాధ్యతలు ఇవ్వడాన్ని అత్యంత ముఖ్యమని మేం భావించాం. భవిష్యత్తులో అతడు ఏదో ఒక రోజు టీమ్ఇండియాకు కెప్టెన్ అవ్వచ్చేమో'' అని ప్రవంజన్ వెల్లడించారు. "ఐపీఎల్‌తోపాటు ఇటీవల భారత జట్టు తరపున వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. దేశవాళీలోనూ బిహార్ జట్టుకు వైస్ కెప్టెన్సీని నిర్వర్తించాడు. వైభవ్‌ను నియమించాలని కమిటీ అంతా కలిసి కట్టుగా నిర్ణయం తీసుకుంది. బయట నుంచి ఎవరికి తోచిన విధంగా వారు కామెంట్లు చేస్తున్నారు. అందరూ ఒకేలా ఆలోచించలేరు. మేం ఏం చేసినా మా జట్టు కోసమే'' అని ప్రవంజన్ స్పష్టం చేశాడు.

# ఆమె విజయం వెనుక అతడు

బిడ్డకు జన్మనిచ్చాక తిరిగి ఫిట్‌నెస్ సాధించడం మహిళా అథ్లెట్లకు అతికష్టమైన విషయం. కానీ సీమ కలీరామ్నా ఈ సవాలును స్వీకరించింది. తల్లి అయిన తర్వాత ఉండే కష్టాలను అధిగమించి, సీడబ్ల్యూజీ పతకంతో మెరిసింది. ఆమె గురువారం అర్ధరాత్రి జరిగిన డిస్కస్‌త్రో ఈవెంట్లో కాంస్యం 58.65 మీటర్లతో సొంతం చేసుకుంది. 2022లో బిడ్డకు జన్మనిచ్చిన సీమ.. తర్వాత ఆర్థరైటిస్ బారిన పడింది. దీంతో ఆమె కీళ్లు బలహీనపడ్డాయి. ఇంట్లో చిన్న వస్తువుల్ని ఎత్తడానికీ కష్టమయ్యేది. మోకాలి నొప్పితోనూ పోరాడింది. ఈ సమయంలో తన భర్త రవీందర్ కలీరామ్నా తనకు అండగా నిలిచాడు. సీమ పుంజుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. "ఆర్థరైటిస్ గురించి ఎంతో శోధించాను. ఇదేమంత నయం చేయలేనిది కాదని గ్రహించాను. ఆయుర్వేదం ప్రయత్నించాం. ఈ క్రమంలో సీమ పుల్లటి పదార్థాల్ని మానేయాల్సి వచ్చింది. వ్యాయామం చేస్తూ మెల్లగా ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుంది'' అని సీమ భర్త రవీందర్ తెలిపాడు. తల్లి కాకముందు సీమ ఉత్తమ ప్రదర్శన 48.08 మీటర్లే. 2024లో ఆమె పునరాగమనం చేశాక ఇండియన్ ఛాంపియన్‌షిప్స్‌లో డిస్క్‌ను 59.73 మీ. విసిరి కెరీర్ అత్యుత్తమ స్కోరు నమోదు చేసింది. ఇప్పుడు కామన్వెల్త్ పతకంతో ఎందరో మహిళల్లో స్ఫూర్తిని నింపింది. "అథ్లెట్లు సానుకూలంగా ఆలోచించడం, ప్రతికూలంగా అనుకోవడం ఏమేర ప్రభావం చూపుతుందో అర్థం చేసుకున్నా. కష్టాల్లో నా వెన్నంటే నిలిచి, నన్ను ప్రోత్సహించిన నా భర్తకు ఈ పతకాన్ని అంకితం చేస్తున్నా'' అని విజయానంతరం సీమ పేర్కొంది. ఆమె అనారోగ్యం నుంచి కోలుకునే క్రమంలో శారీరక విద్యలో పీహెచ్‌డీ చేయడం గమనార్హం.



# ప్రపంచ కప్ ప్రైవేటీకరణపై విమర్శలు.. వెనక్కి తగ్గిన ఫిఫా అధ్యక్షుడు

ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గియాని ఇన్‌ఫానిటో (Gianni Infantino) తీసుకున్న ఓ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. యూఈఎఫ్ఏ నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇంతకీ ఆయన చేసిన ప్రతిపాదన ఏంటంటే?

పురుషుల, మహిళల ప్రపంచ కప్‌లతోపాటు కీలకమైన టోర్నీలను నిర్వహించే కమర్షియల్ యూనిట్‌లో వాటాను విక్రయించాలనేది గియాని ప్రతిపాదన. దాదాపు 20 శాతం వాటాను విక్రయించి 4.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.40 వేల కోట్లు) నిధులను సేకరించాలని ఫిఫా పాలక మండలి ఆలోచన చేసింది. వ్యాపార విభాగం మొత్తం విలువను 20 బిలియన్ డాలర్లుగా ఫిఫా అంచనా వేసింది. ఈ ప్రతిపాదనపై యూరోపియన్ ఫుట్‌బాల్ అసిసోయేషన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఫుట్‌బాల్ గేమ్ 'సోల్'ను అమ్మకానికి పెట్టిందని ఆరోపించింది. ప్రపంచంలోనే మెగా టోర్నీలను బయటి పెట్టుబడిదారులు నియంత్రించకూడదని స్పష్టం చేసింది. దీంతో ఫిఫా అధ్యక్షుడు గియాని వెనక్కి తగ్గి ఓ ప్రకటన చేశారు. "అన్ని విధాలుగా సమీక్షించిన అనంతరం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం లేదు.



గేమ్‌ను మరింత విస్తృతం చేసేందుకే అలాంటి ప్రతిపాదన తీసుకొచ్చాం. కానీ, అందరి అభిప్రాయాలను గౌరవిస్తున్నాం. ఫుట్‌బాల్‌లో ప్రతి దేశం భాగస్వామ్యం ఉండేలా చూడాలనుకున్నాం. అంతే తప్ప ఇందులో మరే ఉద్దేశం లేదు'' అని గియాని స్పష్టం చేశారు.

# వుదయం సినిమా

## అబద్ధమేవ జయతే' చిత్రంలోని 'అమ్మ కోసం' పాటను విడుదల

**వుదయం సినిమా** విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న 'అబద్ధమేవ జయతే' చిత్రంలోని హృదయాలను హత్తుకునే 'అమ్మ కోసం' పాటను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, "'అమ్మ కోసం' పాటలో మంచి భావోద్వేగం ఉంది. ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకేలా ఈ గీతం రూపొందింది. ఇలాంటి మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న 'అబద్ధమేవ జయతే' చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. 2026లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ వినోదాత్మక చిత్రానికి కార్తీక్ కొండ కథ, కథనం, దర్శకత్వం వహించారు. కొండ సందీప్ నిర్మాతగా వ్యవహరిస్తు



# 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ లాంచ్



**వుదయం సినిమా:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరికొత్త అవతార్‌లో కనిపిస్తున్న 'కొరియన్ కనకరాజు' పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, టీజర్, రెండు చార్ట్‌బస్టర్ పాటలు సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడు దల చేసి అంచనా లను మరింత పెంచేశారు. సత్య,అతని తండ్రి, రీతికా నాయక్ కలిసి 'కొరియన్ కనకరాజు' ఆత్మను ఆహ్వానించేందుకు క్షుద్ర పూజ చేయడంతో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమవుతుంది. ఆ తర్వాత కథ పెను కొండకు చెందిన ఓ కుర్రాడి జీవితంలోకి వెళ్తుంది. కియా ఫ్యాక్టరీలో పనిచేసే అమ్మాయితో ప్రేమలో పడిన అతని జీవితం అనుకోని మలుపు తిరుగుతుంది. ఓ కొరియన్ అండర్‌వరల్డ్ డాన్ ఆత్మ అతనిలోకి ప్రవేశించడంతో హీరో పూర్తిగా మారిపోతాడు. అక్కడి నుంచి మొదలయ్యే నవ్వులు, థ్రిల్స్‌తో కూడిన ప్రయాణాన్ని ట్రైలర్ ఆసక్తికరంగా ప్రజెంట్ చేసిందిమేర్లపాక గాంధీ ఈసారి పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రాయలసీమ నేటివిటీని కొరియన్ కల్చర్ తో మేళవించిన తీరు ఆకట్టుకుంటోంది.

# 6న 'ది ప్యారడైజ్' టీజర్ రిలీజ్

**వుదయం సినిమా:** కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఒడెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో, ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. SLV సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఆగస్టు 6న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై నెలకొన్న ఆసక్తి మరింత పెరిగింది. 1 నిమిషం 35 సెకన్ల నిడివి గల ఈ టీజర్‌లో సినిమా వరల్డ్ తో పాటు కథలోని ఎమోషనల్ ఇంటెన్సిటీని చూపించబోతున్నారు. మేకర్స్ ఎలాంటి సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నారో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.నాని రగ్గడ్ లుక్, రా విజువల్ వరల్డ్, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల యూనిక్ స్టయిల్... ఇవన్నీ కలిసి 'ది ప్యారడైజ్' పై భారీ అంచనాలు క్రియేట్ చేశాయి.ఈ చిత్రంలో మోహన్ బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయాల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, సీహెచ్ సాయి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.



# సైమా అవార్డ్స్ 2026.. ఉత్తమ నటుడు నామినేషన్స్..

## పవన్‌తో పోటీపడేది వీళ్లే!



**వుదయం సినిమా:** ఈసారి సైమా అవార్డ్స్-2026 (South Indian International Movie Awards 2026) వేడుక రసవత్తరంగా ఉండబోతోంది. దక్షిణాది భాషల్లో అత్యధిక నామినేషన్స్ దక్కించుకున్న చిత్రాల జాబితాను 'సైమా' అవార్డుల కమిటీ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వివిధ కేటగిరీల్లో పోటీ పడుతున్న వారి వివరాలను వెల్లడించింది. సైమా అవార్డ్స్ -2026లో తెలుగు నుంచి 'మిరాయ్' అత్యధికంగా 11 నామినేషన్స్ దక్కించుకుంది. (siima 2026 nominations) 'సంక్రాంతికి వస్తున్నాం' (Sankranthiki Vasthunam) మూవీకి 10 నామి నేషన్స్ దక్కాయి. 'తండేల్', 'కోర్ట్' మూవీలు చెరో 9 నామినేషన్స్‌ను సొంతం చేసుకున్నాయి. సెప్టెంబరు 11, 12 తేదీల్లో జరిగే వేడుకల్లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.ఈసారి తెలుగులో ఉత్తమ నటుడు కేటగిరీ నామినేషన్స్ ఆసక్తికరంగా ఉన్నాయి. అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) ఈసారి నామినేషన్స్‌లో ఉండటం గమనార్హం. మొత్తం ఆరుగురు ఉత్తమ నటుడు విభాగంలో పోటీ పడుతున్నారు. పవన్‌కల్యాణ్ (ఓజీ), ధనుష్ (కుబేర), నాని (హిట్ 3) నాగచైతన్య (తండేల్), తేజ సజ్జా (మిరాయ్) వెంకటేశ్ (సంక్రాంతి వస్తున్నాం) ఇలా ఈసారి జాబితా భలే క్రేజీగా ఉంది. అన్నీ సూపర్‌హిట్ సినిమాలు కావడంతో పాటు, దేనికదే ప్రత్యేకమైనది. దీంతో ఎవరిని ఉత్తమ నటుడు అవార్డు వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# "క్రేజీ కల్యాణం" టీజర్ రిలీజ్ ఈవెంట్

**వుదయం సినిమా:** నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా టీజర్‌ను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నందిని రెడ్డి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోలిరిక్ రైటర్ గోరటి వెంకన్న మాట్లాడుతూ – నాకున్న పరిమితులతో చూస్తే నేను సినిమాల్లో ఎక్కువ పాటలు రాసినట్లే లెక్క. ఇది చాలా మంచి సినిమా. ఎలాంటి అశ్లీలత లేకుండా హాయిగా అందరూ చూడొచ్చు. అనుపమ చక్కగా నటించింది. ఈ సినిమాలో ఎవరూ నటించినట్లు లేదు జీవించారు. ఈ కథ చూస్తుంటే నిజ జీవితాలు చూసినట్లే అనిపిస్తోంది. టీజర్ చూశాక నాకు ఈ పాత్రల్లా వ్యవహరించే ఓ పదిమంది గుర్తుకు వచ్చారు. భద్రప్ప, జగన్మోహన్ కలిసి టాలీవుడ్ కు ఒక మంచి సినిమా ఇస్తున్నారు. ఈ సినిమాకు వేణు ఊడుగుల గారు మార్గనిర్దేశం చేస్తున్నారు. సురేష్బొబ్బిలి గొప్పగా ట్యూన్స్ కంపోజ్ చేశాడు. జగన్మోహన్ నాది 30 ఏళ్ల స్నేహబంధం. ఈ సినిమా హిట్ అవుతుందని నాకు గట్టి నమ్మకం ఉంది. ఎంత స్థానికత ఉంటే అంత గొప్ప సినిమా అవుతుంది. ఊళ్ల ప్రేక్షకులు కూడా ఈ సినిమాను బాగా చూస్తారు. ఇది తెలంగాణ ప్రాంతం సినిమా అయినా అన్ని ప్రాంతాల ప్రజలు ఇష్టపడే సినిమా అవుతుందన్నారు.



# 8న 'టాక్సిక్' ట్రైలర్ రిలీజ్



**వుదయం సినిమా:** రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్' ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులకు తెరదించుతూ మేకర్స్ తాజాగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, సినిమా ట్రైలర్‌ను ఆగస్టు 8, 2026న రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కొత్త పోస్టర్‌లో యష్ పోషిస్తున్న 'రాయా' పాత్రను సిల్హౌట్ రూపంలో చూపించారు. చేతిలో టామీ గన్ పట్టుకుని కనిపించే ఈ పోస్టర్, సినిమా ప్రపంచం ఎంత రా, ఎంత ఇంటెన్స్‌గా ఉండబోతుందో సూచిస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌లాగే ఈ పోస్టర్ కూడా సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేస్తూ, సినిమా కథపై అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ట్రైలర్‌ను బెంగళూరులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. యష్, కేవీఎన్ ప్రొడక్షన్స్ హోమ్ స్టేట్ అయిన కర్ణాటక నుంచే సినిమా ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతున్నారు. అలాగే ఆగస్టు 8 తేదీకి మరో ప్రత్యేకత కూడా ఉంది. 'టాక్సిక్' షూటింగ్ ప్రారంభమై సరిగ్గా రెండేళ్లు పూర్తవుతున్న రోజునే ట్రైలర్‌ను విడుదల చేస్తున్నారు.ఇప్పటివరకు పోస్టర్లు, గ్లింప్స్, పాటల ద్వారా మేకర్స్ సినిమా ప్రపంచాన్ని కొద్దికొద్దిగా పరిచయం చేస్తూ వచ్చారు. కానీ కథలోని అసలు మిస్టరీని మాత్రం బయటపెట్టలేదు. ఇప్పుడు విడుదల కానున్న ట్రైలర్‌తో 'టాక్సిక్' ప్రపంచం, ప్రధాన పాత్రలు, సినిమా స్కేల్, కథలోని అసలు కాన్ఫ్లిక్ట్ ను ప్రజెంట్ చేయనున్నారు.గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యష్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి కీలక పాత్రల్లోనటిస్తున్నారు. ఒకేసారి కన్నడ, ఇంగ్లిష్ తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

## తీవ్రంగా గాయపడిన హీరోయిన్ రశ్మిక మందన్న

**వుదయం సినిమా:** డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరణ సందర్భంగా హీరోయిన్ రశ్మిక మందన్న తీవ్రంగా గాయపడ్డా రు. ప్రస్తుతం ఆమె రణబాలి, మైసా సినిమా షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. రణబాలి, మైసా చిత్రాల్లో వరుసగా యాక్ష న్ సీక్వెన్సులు, డ్యాన్స్ పర్ ఫార్మెన్స్ లు చేయడం వల్ల రశ్మిక హిప్ ఏరియాలో పూర్తి గా టెండన్ డిటాచ్ మెంట్ అయ్యింది. ఆమె గాయం వైద్యు లను సైతం షాక్ కు గురి చేసిం ది. తీవ్రంగా సాధన చేసే క్రీడా కారుల్లో మాత్రమే ఇలాంటి గాయాలు అవుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. రశ్మిక 6 వారాల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. టెండన్ తిరిగి బలపడేందుకు రీహాబిలిటేషన్ కూడా అవసరం అని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రశ్మిక మందన్న పాన్ ఇండియా స్థాయిలో బిజీయెస్ట్ హీరోయిన్ గా కెరీర్ కొనసాగిస్తున్నారు. ఆమె 4 భారీ చిత్రాల షూటింగ్స్ లో పాల్గొంటున్నా రు. అలాగే 30 ప్రొడక్ట్స్ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. రశ్మికకు అయిన తీవ్ర గాయంతో ఆయా సినిమా ల, వ్యాపార ప్రకటనల షూటిం గ్స్ నిలిచిపోనున్నాయి. ఆమె త్వరగా



# 'రామాయణ' ట్రైలర్

**వుదయం సినిమా:** రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా, నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే అధికారిక ప్లాట్‌ఫార్మ్‌లలో 350 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ చిత్రం 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది.ట్రైలర్‌కు సినీ అభిమానులు, విమర్శకులు, సెలబ్రిటీలు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా భారీ స్థాయి విజువల్స్, వరల్డ్ క్లాస్ VFX, భావోద్వేగభరితమైన కథనం, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా "Our Truth. Our History." అనే థీమ్ ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంది. భారతదేశపు గొప్ప ఇతిహాసాన్ని అత్యంత గౌరవంతో, ప్రామాణికంగా, భారీ స్థాయిలో తెరపై ఆవిష్కరించారని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ట్రైలర్‌లో మరో ప్రధాన ఆకర్షణ స్టార్ కాస్టింగ్. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ శక్తివంతమైన నటనతో ఆకట్టుకోగా, రావణుడిగా యష్ తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. సీతగా సాయి పల్లవి తన హుందాతనం, అమాయకత్వం, భావోద్వేగాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఈ స్టార్ కాస్టింగ్ ట్రైలర్‌కు మరో పెద్ద బలంగా మారింది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.